సృజన

90

ఏప్రిల్ 1979

ఈ సంచికలో....

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Warangal Printing Press, J.P.N. Road, Warangal - 506 002 for Venkataramana Mudranalayam, Warangal

Working Editor: Varavararao

సృజన

ఆధునిక సాహిత్య వేదిక
మాసపత్రిక

90

ఏప్రిల్ 1979

సోషలిజం అనే భావమూ, శ్రామిక ప్రజలపట్ల సానుభూతీ దాని శ్రేణులలోకి నిత్యనూతన శక్తులను తెస్తాయి, దురాశా, కరియరిజమూ కాదు. అది స్వతంత్ర సాహిత్యంగా వుంటుంది; ఎందుకంటే, అది మొహంమొత్తిన కథానాయికకో, బలిసి, పతనం చెందిన, ఉబుసుపోని "పై పదివేలమంది"కో కాక, కోటానుకోట్ల శ్రామిక ప్రజలకు— దేశంలోని ఉత్తమమైన భాగానికి, దాని బలానికి, దాని భవిష్యత్తుకు— సేవచేస్తుంది. అది స్వతంత్ర సాహిత్యంగా వుంటుంది; మానవజాతి యొక్క అత్యున్నత విప్లవ ఆలోచనను సోషలిస్టు కార్మికవర్గం యొక్క అనుభవంతోనూ, సజీవ కృషితోనూ సంపన్నం చేస్తుంది; గత అనుభవానికీ (శాస్త్రీయ సోషలిజంకు, ఆదిమ, ఊహాస్వర్గ రూపాలనుండి సోషలిజం అభివృద్ధి పరిపూర్తికీ), వర్తమాన అనుభవానికీ (కార్మిక కామ్రేడ్ల వర్తమాన పోరాటానికి) మధ్య శాశ్వత చర్యా ప్రతిచర్యను కలిగిస్తుంది.

— లెనిన్

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 15 రూపాయలు

ఈ సంచిక రు. 1-50 పైసలు

పొలాలు మేల్కొన్నాయి

నదులు వనంబులు నానా మృగములు - నాల్గు సంద్రములును
కొండలు వండలు జలములు పొలములు - గుంటలు పెలయేళ్ళు
కాయలు పండ్లు పాడిపంటలు -
అంతరువులా భేదములేక - అందరి సొమ్మండి.

ఆదికాలమున అందరు జనులు- అన్నతమ్ములవలె వుండేవారని తక్కెళ్ళ జగ్గడు 'మాలపల్లి' నవలలో ధర్మబోధలు తలపున నిలపవలసిందిగా ఎన్నడో చెప్పాడు. మరి ఈ జలముల మీద, పొలముల మీద, పాడిపంటలమీద ప్రజల అధికారం తప్పిపోయి ప్రజాకంటకుల అధికారం ఎప్పుడు వచ్చింది? మధ్యకాలంలో వర్గ సమాజం ఏర్పడి నాక వచ్చినట్లే కదా! లేకపోతే పండితాపురం చెరువుమీద అధికారం భూస్వామిది ఎట్లా అయింది? ఆయన తండ్రి కాలాన్నో తాతకాలాన్నో పట్వారీని, గిర్దావర్‌నూ పై అధికారులను కట్టుకొని రాయించుకొని వుండకపోతే. భూస్వామికి చెరువు కింద సెంటుభూమి లేదు. చెరువు లోతట్టు షికం మాత్రం మొత్తం ఆయనది. చెరువు కట్ట ప్రభుత్వానిది. నీళ్ళు భూస్వామి స్వంతం. ఆ నీళ్ళు కట్టికింది ప్రజలకు కావాలి. ఆ నీళ్ళకూ, ఆ నీటి అవసరానికి మధ్యన భూస్వామి ఆస్తిని కాపాడుతూ ప్రభుత్వం కట్ట. ఆ కట్టకు మట్టిపోయడమో, మత్తడి కట్టడమో అంతా ప్రభుత్వం ఖర్చు. కాని చెరువుమీద ప్రభుత్వానికీ, ప్రజలకూ అధికారం లేదు. ప్రభుత్వాలు భూస్వాముల సేవలు చేయడానికే వున్నాయి కాని భూస్వాములను అదుపులో పెట్టడానికి కాదు! గాలీ, నీరూ, నేలా, ధనమూ, ధాన్యమూ ఎవరి పదార్థము? ఎవడి సొత్తు? ఓ నరుడా- అని మాలపల్లి నాటకంలో ఒక పిచ్చిదాని పాత్ర మధ్యమధ్యన ప్రశ్నిస్తూ 'గాలిలో తేలేటి గండభేరుండం'లా రివ్వున ఉరుకుతుంటుంది.

పండితాపురంలో భూమే కాదు, నీళ్ళు కూడా భూస్వామి సొత్తు! పండితాపురం చెరువు, షికం సమస్య విన్నప్పుడు 'ప్రజల మనిషి' నవలలో చెరువు సమస్య గుర్తుకు వచ్చింది. నిజాం కాలంలో దిమ్మగూడెంలో చెరువు షికాన్ని భూస్వామి అనుభవిస్తున్నాడు. అయితే అది భూస్వామి పట్టామాత్రం కాదు. చట్ట ప్రకారం అది ప్రతి సంవత్సరం హర్రాజు చేయబడి దున్నుకోవడానికి ఇవ్వబడాలి. భూస్వామి పట్వారీని, గిర్దావరును కట్టుకొని ప్రతి సంవత్సరం హర్రాజు అవుతున్నట్లు, తాను ఎక్కువ పాటపాడి తీసుకుంటున్నట్లు కాగితాలు రాయించి అనుభవిస్తున్నాడు. గ్రంథాలయోద్యమ ప్రభావంతో ప్రజలాపద్ధతిని సవాల్ చేసారు. ఊళ్ళో దండోరా వేయించి హర్రాజు పాడలేదని, తమకు తెలియదని షికంలో దున్నుతున్న దొర అరకలను ఊరు

ఊరంతా వెళ్ళి నిలవరించారు. దొర అరకలు విడిచేసారు. గ్రామంలో 'శాంతి భద్రతల'కు భంగమేర్పడిందని హుటాహుటిని పరుగెత్తుకొచ్చిన మేజిస్ట్రేటు, సబిన్స్పెక్టర్ ప్రజలక్కడి నుంచి కదలకపోతే శాంతిభద్రతలు కాపాడడం కోసం కాల్పులు జరపాల్సి వస్తుందని హెచ్చరిస్తారు. గ్రామమంతా నిర్మానుష్యమై చెరువుకట్ట దగ్గరే చేరుతుంది. మేజిస్ట్రేటు తాత్కాలికంగా షికం ఎవరూ దున్నడానికి వీలులేకుండా ఆజ్ఞలు జారీచేసి 144 సెక్షను ప్రకటించి అక్కడి నుంచి వెళ్ళిపోతాడు. సబిన్స్పెక్టర్, పోలీసులు దొర గడీలోనే వుంటారు - తింటారు. షికం దొర దున్నకుండా ప్రజలు ఆపగలుగుతారు.

పండితాపురంలో సంఘటనలు 1938 కి పూర్వం నిజాం కాలంనాటి దిమ్మెగూడెం సంఘటనల (ఇది వాస్తవాలపై ఆధారపడి చేసిన కల్పన) కన్న ఘోరంగా వున్నవి - షికం భూస్వామి పట్టాగా అనుభవిస్తున్నాడు. ఆయన పంటను కాపాడడానికి వచ్చిన పోలీసులు ఆయన చెప్పిన వాళ్ళందర్నీ అరెస్టు చేసారు. అన్యాయమని తీసిన ఊరేగింపుపై కాల్పులు జరిపారు - హెచ్చరికాలేదు. జరిపిన కాల్పులు సూటిగా కండ్లకు, తలలకు, గుండెలకు గురిచూసి కాల్చినవే. స్త్రీలను అరెస్టుచేసి చెరచారు. ఎందరో పేద రైతుకూలీలను అరెస్టుచేసి రోజుల తరబడి అక్రమంగా పోలీసు కస్టడీలో వుంచారు. గాంధీజీ కలలుగన్న రామరాజ్యానికి పునాదియైన గ్రామరాజ్యం పంచాయితీ బోర్డు ఆఫీసు చెన్నారెడ్డి ప్రభుత్వానికి పోలీసు స్టేషనుగా ఎంతో బాగా పనికొచ్చింది. భూస్వామి వేసిన మినుముల పంట రైతులు కోసుకపోయారన్నది మొదటి ఆరోపణ. హుటాహుటిన వచ్చిన పోలీసులు ఆ పంట భూస్వామికి అప్పగించడమే కాక రైతుల ఇళ్ళలో వున్న వాళ్ళ ధాన్యము, వస్తువులు కూడ ఎత్తుకపోయారు. భూస్వామి షికాయతుపై ఇంత క్షణాలమీద కదిలే పోలీసులు, ప్రభుత్వము దశాబ్దాలుగా ఈ చెరువు సమస్యగా వుందని పట్వారీ, ఎంఎల్ఎ, చివరకు ఎస్పీ, కలెక్టర్లు రాసినా, భావించినా ఏ చర్యా ఎందుకు తీసుకోలేదు? ఊరేగింపుగా వెళ్ళిన జనం భూస్వామి యింటిమీదకి పోవడానికి ప్రయత్నించారనడానికి ఆఊరేగింపు ముందు వృద్ధ స్త్రీలు, పసిపాపల నెత్తుకున్న తల్లులు వుండడమూ, దొడ్డ సుశీల, భాస్కరరావులను వదలాలని, పోలీసు క్యాంపు ఎత్తివేయాలనీ నినాదాలు యివ్వడమూ చూసిన వారికి నమ్మదగ్గదిగా లేదు. డిఎస్పీకి తగిలిన గాయాలు ప్రజలు కావాలని కొట్టారా, ఆ తొక్కిడిలో నాగలిపైపడితే అయ్యాయా తెలియదు. దీనికి ప్రజలు ఇంత మూల్యం చెల్లించాలా, రెండు ప్రాణాలు, మూడు మానభంగాలు, ఎనభై ఆరు అరెస్టులు ఇంకెన్నో వారంట్లు, కాల్పులు, గాయాలు, దెబ్బలు, ఇళ్ళు ధ్వంసం - ఇంకా.... ఇంకా....

నీరు నోచుకోని జనం నోరు విప్పడానికి కూడా నోచుకోలేదా–

నేల నోచుకోని జనం తల తిప్పడానికి కూడ నోచుకోలేదా–

లేదు. జనం అడగదలుచుకున్నారు. జనం ముందుకు అడుగేయదల్చుకున్నారు. సుశీల తన శీలం నిలుపుకోదల్చుకున్నది. అయితే నీరూ నేలా శీలం– అన్నీ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టడంతో ముడిపడి వున్నాయని, దున్నేవానికి భూమి దక్కేదాకా పేదవానికి కూడు గూడు గుడ్డ మాత్రమే కాదు అభిమానం కూడ దక్కదని పండితాపురం ప్రజలు తెలుసుకున్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంనాటి వీర సంప్రదాయం ఆ గ్రామానికున్నది. నైజాం ఫ్యూడల్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు బలిపెట్టిన యోధుల శ్వాసలు అక్కడి గాలిలో కలిసిపోయాయి.

భూస్వామి నీళ్ళను ప్రభుత్వం కట్ట ఇంకెంత కాలం కాపాడచూసినా కట్ట కింద పొలాలు మేల్కొన్నాయి– వాటిని ఏ కట్టలూ, ఏ చట్టాలూ జోకొట్టలేవు, ఏ అరెస్టులూ, ఎ కాల్పులూ అరికట్టలేవు. పండితాపురం ఎందువల్ల ఆ పేరు తెచ్చుకున్నదో గానీ ఇపుడు మాత్రం అది చైతన్యవంతమైన ప్రజల పురంగా తెలంగాణ గడ్డమీద మరోమారు చరిత్ర సృష్టించుకున్నది. పరస్పరం సంఘర్షించిన శక్తులతో పుట్టిన చరిత్ర అది.

– సంపాదకుడు

4-4-79

పరమమైన స్వేచ్ఛను గురించి మీరు చెప్పే మాటలు పచ్చి వంచన, అని బూర్జువా వ్యక్తివాదులైన మీకు మేము తప్పక చెప్పాలి. డబ్బు శక్తిమీద ఆధారపడిన సమాజంలో, శ్రామిక ప్రజా సముదాయాలు దారిద్ర్యంలోనూ, కొద్దిమంది ధనికులు పరరక్తోపజీవులుగానూ జీవించే సమాజంలో, నిజమైన, ఫలవంతమైన "స్వేచ్ఛ" వుండ జాలదు. రచయితగారూ, బూర్జువా ప్రచురణకర్త విషయంలో మీకు "స్వేచ్ఛ" వుందా? చట్రాలలోనూ,* చిత్రపటాలలోనూ బూతు వుండాలనీ, "పవిత్ర" ప్రకృతిదృశ్యాల కళకు "అనుబంధం"గా సానివృత్తివుండాలనీ మిమ్మల్ని డిమాండుచేసే బూర్జువా జనం విషయంలో మీకు "స్వేచ్ఛ" వుందా। యీ పరమమైన స్వేచ్ఛ అనేది బూర్జువా, లేక అరాజకవాద నుడికారం (ఎందుకంటే, ప్రపంచ దృక్పథంగా, అరాజకవాదం తిరగేసిన బూర్జువా సిద్ధాంతం). ఎవడైనా సమాజంలో జీవిస్తూ, సమాజం నుండి స్వేచ్ఛగా వుండజాలడు. బూర్జువా రచయిత, లేక కళాకారుడు, లేక అభినేత్రియొక్క స్వేచ్ఛ కేవలం ముసుగులో (లేదా వంచనతో కూడిన ముసుగులో) డబ్బు సంచిమీదా, లంచంమీదా, సానివృత్తిమీదా ఆధారపడడం.

*మూలంలోని 'రామ్లహ్' (చట్రాలలోనూ) అనే పదం అచ్చుతప్పు అయివుండాలి. సందర్భాన్ని బట్టి యిది 'రొమానహ్' (నవలలోనూ) కావచ్చునని తోస్తుంది.

[వి. ఐ. లెనిన్ – సాహిత్యం మీద వ్యాసాలు నుంచి]

గోదావరి నా స్వరం

మంగ

చాలా రోజుల తరువాత
ఇవ్వాళ గోదావరిని చూస్తున్నాను
కొత్తగా కనిపించింది
ఏవో గీతాలు వినిపిస్తూ–

ఇదివరకు గోదావరిలో స్నానం
చేసినప్పుడు
అలనాటి తెలంగాణ ముచ్చట్లు వినిపించి
ఆలోచనల అలలు రేపేదినాలో
నేను ఒళ్లు విదిలించుకుని వచ్చేవాణ్ని

కాని ఇవ్వాళ ఆలోచనల అలలుకాదు
ఒకటి వెనుక ఒకటిగా
లెక్కబెట్టలేనన్ని అలలు కళ్ళముందు
తిరగబడుతూ
తమతో చేతులు కలుప మంటున్నాయి

తనకు అడ్డునిలిచిన నల్లని రాతిని
ఢీకొని ఆర్తనాదం చేసుకుంటూ
వైదొలగి పోయిన గోదావరిని
నిన్న చూసాను

ప్రవాహపు ఉరవడిలో
గులకరాళ్లుగా మారుతున్న నల్లనిరాళ్లను
అవి చావుకేకలు పేస్తుంటే
గోదావరి తన ప్రవాహంతో
వాటి పునాదులను పెకిలించి
తన పాదాలకింద నలిపివేయడం
ఇవ్వాళ చూస్తున్నాను

అవును
గులకరాళ్లుగా మారిన నల్లనిరాళ్లకు
నిలకడ ఎక్కణ్నుంచి వస్తుంది ?

ఇవ్వాళ కష్టజీవుల కన్నీళ్లు
నిలువ నీటి గుంటలు కావు
పోరాటపు బ్రతుకుబాటలో
దూకుతున్న జలపాతాలు
రాళ్లను అరగదీసేశక్తి
ఈ నీళ్లకు వుంది

నిన్నటి వరకు ఆగిఆగి
నేరుగా నడిచిన గోదావరి
ఇవ్వాళ నాతో అంటున్నది
జీవితంలో మలుపు రావాలని
మలుపు కోసం ఎరుపు కావాలని
ఎరుపు కోసం మలుచుకోవాలని

గోదావరిలో ప్రతిఫలిస్తున్న ఎర్రనికిరణాలు
నాకు బాట చూపుతున్నాయి
నేను గోదావరివెంట నడుస్తున్నాను
గోదావరి అలల హోరుతో
నా కంఠాన్ని శ్రుతిచేస్తున్నాను

శ్రమ జీవన సౌందర్యం

జగన్మోహన్

చెట్లు చిగిరిస్తే
వాన కురిస్తే
ఆకాశంలో పక్షులు
ఆనందంగా విహరిస్తే
నాకు కల్గుతుంది
కృతజ్ఞతాభావం.

చిన్నప్పుడు
స్వేచ్ఛావాయువులతో
పోటీపడుతూ
తాటికమ్మల సంగీతాన్ని
గంటుతుమ్మెదల గానాన్ని
మోదుగుపూల
మత్తెక్కించే కమ్మదనాన్ని
కళ్ళతో ముక్కుతో చెవులతో
ఆస్వాదించిన క్షణాలు—
మా యింటిముందు
తాటి పట్టెకు జిట్రేగి కట్టెలకు
నగిషీలు చెక్కుతున్న
మా తండ్రి మోటు చేతులు
నా జీవితానికి మెత్తని
పదునెక్కించిన పనిముట్లు.

పాలుపోసుకుంటున్న పరి
జొన్న కంకుల సువాసనలు
మట్టి వాసన—
భూమినీ, హృదయాలనూ
పెళ్ళగించి
బ్రతుకు తీపిని
పండించిన
మోటు దండలపై
మెరుస్తున్న సూర్యుని వెలుగు—
పచ్చగా వెలుగారబోసినట్లున్న
పొలాలపైన
ఉవ్వెత్తుగా ఎగిరే
నా గుండెనిండా కృతజ్ఞత.

నేల నుండి నింగికి
ప్రజా హృదయాన్ని
ఒక సవ్వే గనిగా మలచిన
కార్మికా కర్షకా శ్రమజీవీ!

ఇంపీరియల్ ఢిల్లీ!

సురా

నియాన్ లైట్ల కాంతిలో
ద్వీపపు బతుకులు
విష వలయాల్లోపడి తిరుగుతాయ్,

చీకటి చలికాలపు గాలి
ఉన్ని పాదాల అడుగునపడి
ప్రతిధ్వని లేకుండా ధ్వనిస్తుంది

అయినా

పాలకులు రాలిన
శతాబ్దాల మట్టి
తన పుత్రులకోసం ఎదురుచూస్తోంది

సామ్రాజ్యాల
సమాధి ఈ నగరం
రేపటికోసం ఈరోజు జీవిస్తోంది.

కృతఘ్న కలకత్తా!

ప్రసూన్ ముఖర్జీ

కృతజ్ఞతా భావం లేని కలకత్తా!
నువ్వు నీ అభివృద్ధికీ, నీ శాంతి భద్రతలకే అంటిపెట్టుకొని వుంటావు
రోజూ లలితకళా ప్రదర్శనలు, రవీంద్ర సదన్, కళామందిర్
నీ ఆటవిడుపు కేంద్రాలు.
వాటికింద, ఫుట్‌పాత్‌లకింద బంధించబడి
ఎదురించిన యువకుల చిందిన నెత్తురూ చిట్లిన ఎముకలూ

నీ నాగరిక యువకులు రోజూ
బిచ్చగాళ్ళ ఆకలి కొలువులమీద పైసలు చిలకరిస్తుంటారు
నువ్వు బ్లాక్ అవుట్ ప్రకటించిన వేళల్లో
మితిమీరిన విమాన దాడుల్తో మింటికెగురుతావు

వాళ్ళందరికీ ఆనందం పంచే విషయాలెన్నని!
"పీస్ కార్ప్స సభ్యులకు రహస్యంగా బియ్యం దెచ్చిన
వ్యవసాయ కూలీ యువకులు ఎట్లాచెరచ బడ్డారు...."
వాళ్ళను సంతోషించనీ ;
"ఉద్యోగం నుంచి తొలగించబడిన కార్మికుడు పోలీసు వ్యాన్‌ను
చూసి తన చేతుల్లో వస్తువులు వదిలి ఎట్లా పరుగెత్తాడు...."
వాళ్ళను సంతోషించనీ– ఇవన్నీ వాళ్ళు ఆనందించనీ–
ఎందుకంటే,
నెత్తురు పోసి పెంచిన ధాన్యం రైతు గుడిసెకు చేరదు
దోపిడీ కొనసాగుతూ వుంటుంది, మృగం బలుస్తూవుంటుంది
ప్రతిగ్రామానికీ ఎంతో ఎక్కువ....కావాలి–
(ఇక్కడ ఆగిపోదాం)
అందుకే పట్టణాల్లో శాంతి భద్రతలు కాపాడడం చాల అవసరం.
ఫలితంగా
నీ యువవాణి సెమినార్లకూ, బాతిక్, దహ్లియా, ఇంకా
ఇతర ప్రతినిత్యం ప్రదర్శనలకూ
కలకత్తానువ్వు నీఅభివృద్ధికీ, నీశాంతి భద్రతలకూ అంటిపెట్టుకొనివుండు

1971

సమర్ సేన్ కవితలు రెండు :

1916 లో పుట్టిన సమర్ సేన్ ఈ శతాబ్దపు నాలుగవ దశాబ్దంలో బెంగాల్‌ను కదిలించిన యువకవుల్లో ఒకడు. ప్రత్యేకమైన ఆయనశైలి, మౌలికమైన ఊహలు ఆధునిక బెంగాలీ సాహిత్యంలో ఒక నూతన ఉద్యమాన్ని సృష్టించాయి. ఒక నూతన రచయితల తరానికి ఉత్తేజాన్ని యిచ్చాయి. కమిటెడ్ మార్క్సిస్టుగా కవిత్వాన్ని వదిలి రాజకీయ పత్రికా రచనలోకి ఆయన 1950 లో ప్రవేశించాడు.

ఇప్పుడు సమర్ సేన్ కలకత్తా నుంచి వెలువడుతున్న వామపక్ష రాజకీయ వార పత్రిక 'ఫ్రాంటియర్' కు సంపాదకుడు.

ఈ కింది రెండు కవితలూ ఆయన 1940లో రాసినవి.

మార్చింగ్ కాలం

'కాలం మార్చింగ్ చేయడం ఎపుడైనా విన్నావా?'
చీకటి తెరపడగానే నల్లని సముద్రం మీంచి
నిరీక్షణాశబ్దాలు వినొస్తాయి.
క్షితిజరేఖ మీద ఉక్కురంగు
ఆకాశం చిక్కనవుతుంది
అప్పుడు నిద్రరాని నీరవ నిశీధిలో నేను వింటాను
మిట్టమధ్యాహ్నపు మండుతున్న సూర్యునికింద
కటిక ఉక్కు బాటపై అలసిపోయిన బర్రె బరువుగా వేసే పాదాలధ్వని.

వసంతం

నేను చూడజాలని
ఒక కొండ కొమ్మమీద వసంత గర్జన
ఇవ్వాళ
శిశిరాంతాన
పసుపు పచ్చని ఎడారి అంచున నిలబడి నేను
అలసిన కన్నులతో ముందుకుచూస్తే
దూరాన పొలాల్లో
జొన్న కర్రలువేసిన ఆకుపచ్చని పంటల చిగుర్లు.

నవల - సీరియల్

కొలిమంటుకున్నది

అల్లం రాజయ్య

(గత సంచిక తరువాయి)

10

"సత్తెవ్వా...." నర్సింహం తలుపుకు నోరుబెట్టి గుసగుస పిలిసిండు- బిడ్డపేరు బెట్టి పెండ్లాన్ని.

లోపట పిల్లి కుయ్యికుయ్యి మంటుంది- తలుపు సందుల నుంచి దీపం ఎలుగు కన్పిత్తంది. మల్లికాంబ అడ్డదిడ్డంగా నోరుదెరుసుకొని వన్నది- అంగి సూసిండు- పిల్లికండ్లు, మల్లికాంబ మొకం కన్పిచ్చినయ్....

"సత్తెవ్వా.... ఓ సత్తెవ్వా"

".... ...."

"సత్తి...." గట్టిగనే పిలిసిండు.

తలుపు కిర్రుమన్నది- మల్లికాంబ మూతలు పడ్తన్న కండ్లతోని మొగన్ని సూసింది- దీపం ఎలుగు నర్సింహం మొకంమీన పడ్తంది- సప్పిడి దవడల మజ్జెన మొక్కసుట్ట తేజ్‌గ ఎలుగుతంది- కండ్లల్ల సుట్టకొనతీర్గ ఇంకేదో మెరుత్తంది- మల్లికాంబ కండ్లు టపటపలాడిచ్చింది- ఆవలిచ్చింది.

"సాల్లే సంబడం.... ఓదిక్కు- ఉన్నదంత ఊడ్సుకపోతంటే నీకేమొ నాత్రి కలలత్తన్నయ్- పెరదెవల కప్పజెప్పచ్చినవ్? ఇయ్యేడు అప్పేంగడ్తవో? తిండేం తింటవో సూత్తగద. అయింత అరువాన్ని ఎవడన్న కట్టుకపోతే అటెంక నెత్తినోరు కొట్టుకుంటే ఏం లాభం?" మల్లికాంబ ముసిముసి నవ్వుకుంట మొగన్ని మీదికట్లా అన్నది.

"నీయక్క! ఏదయితె అదయితది- నేనేం జెయ్యాల్నె?" సుట్టమొక్క అవ తల కిసిరేసి కాండ్రికిచ్చి ఊంచిండు.

నర్సింహం మల్లికాంబను దగ్గెరికి తీసుకున్నడు- నర్సింహం సేతులు మల్లికాం బను కాలుత్తన్నయ్- మల్లికాంబ మాట్లాడలే- నర్సింహం మొకంలకు సూసుకుంట ఉండిపొయింది.

దీపం గాలికి అటూ యిటూ ఊగింది.

నర్సింహం అలిట్టతోటి మల్లికాంబ గుండెలమీస తలపెట్టుకొని నిర్భింధిగ నిదురబోయిండు.

తొలికోడి కూసింది- మలికోడిసుత అర్సిలర్సి గూసేటాల్లకు మల్లికాంబ ఉలికి పడి లేసింది.

ఫికరేం లేకుంట మాంచి జోరు నిదురబోతన్న మొగన్ని అటీటు ఊపి లేపి కూకుండబెట్టింది.

"అవుతల అరువం; ఏలుబెట్టి కొస్న ఇంజస పెట్టుకొని రామసక్కదనాల నిదుర బోతన్నవ్- బొనయ్యా! గ ఇంజస, బొంగులు ఇంటికన్న పీక్కరారాదు- కాలం మంచిగలేదు. ఇంజనమ్మతనని అడికీడికి జబ్బలు జారేసుకొని తిరుగబడ్తివి- ఏడి కోకాడికి అమ్మన్న కాలబెట్టకపోతివి- అఖరుకు మా నోట్లె మన్నుబోసెటట్టుగున్నది గని- షావుకారి రామలింగం జుట్టుబోసలు పట్టుకుంటె దెలుత్తది బాగోతం- నిదుర సూడు. శరంలేని నిదుర- నిర్రంధి నిదుర." నర్సింహం మూతిమీన గారువాల పోట్లు పొడిసి మెటిక లిరిసింది.

"నీయక్క! నీకు బుద్ధిరాదు- పొద్దుగాల పొద్దుగాలేందే బాగోతం" అయిట్టం గనే లేసి ఒల్లిరుసుకొని, పంచె నిండాకప్పుకోని కూరుక్కుంట పెరటికెల్లి నడిసిండు.

అట్ల అడుగు లడుగేసుకుంట నర్సింహం పెరడి సేరుకునేటాల్లకు తూరుపు రేకలు పొరుతన్నయ్.

అప్పటికే పిట్టా పీసు లేసి అరుత్తన్నయ్.

పెరడిగెట్టుమీన నిలుసుండి పారసూత్తేమున్నది? తూరుపుతూరుపంతా అగ్గయి మండుతన్నట్టు, ఏదో కత్తుల ఇజ్జెం జరుగుతన్నట్లుగ- నెత్తురు కాలువలై పార్తన్న ట్టుగ ఎర్రిడాలు. పెరట్ల నల్లమట్టి పెల్లలుసుత నిప్పులతీర్గ మండుతన్నట్టున్నయ్.

కండ్లు నలుసుకొని సూసిండు నర్సింహం.... పెరట్ల మక్కగూల్లు కనిపించలే- అయున్నకాడ కణకణలాడే నిప్పుకుప్పలు కనిపిచ్చినయ్- అట్ల కాలులేపి ఉరికిండు నర్సింహం. గూళ్ళన్ని మాడి మసిబొగ్గయి బూడిదై పోయినయ్- అడాడ మాడిన మక్క కంకి కున్నెలు ఉన్నయ్.

ఏడాది రెక్కలిరుసుకొని పండిచ్చిన పంట తనకండ్ల ముంగటనే కాలి కూలి కామునపెంటయి పోతంటె కుప్పతీర్గ కూలిపోయిండు- పిడికిట్లకు బూడిది తీస్కొని పిచ్చిలేసినోని తీర్గ నెత్తిమీన పోసుకున్నడు.

కరకర పొద్దుపొడిసింది- ఎటు దోసక పెరడంత ఉరుకులు పరుగులుబెట్టిండు- మట్టిపెళ్ళలు లేవట్టి పండ్లుకొరుక్కుంట ఇసిరేసిండు- ఆఖరుకు గొడ్డుతీర్గ ఒర్లుకుంట బాయికాడికురికిండు- కరంటుమోటర షెడ్డు తలుపు తెరిసున్నది- తాళంకప్ప కింద పడున్నది- లోపటి కురికిండు- లోపట కూకుండబెట్టిన బోలోట్లు తప్ప ఏమిలేదు- బాయిలకు సూసిండు- బొంగులు లేవు- షెడ్డుగోడకేసి తలకొట్టుకున్నడు.

ఉన్నొక సిప్ప పలిగిన కుంటి బిచ్చగానోలె కుమిలి కుమిలి ఏడ్సిండు.

సూతిపందిమాకు మీన కూకుండి మొఖాన పంచెపెట్టుకొని ఎంతసేపేడ్సిండో ఎవలకెరుక? ఏడ్సేడ్సి కండ్లల్ల సీల్లొడ్సి పోయినయ్- ఖిన్నుడై సానాసేపు పత్తా యించిండు- ఎటూసూసిన సుట్టూత సీల్లు గిరేసుకున్నట్టుగ, దరిదాపుల గరిక పోససుత లేనట్టుగ" తోసింది 'సీ-గీ జల్మముండెందుకు: బతుకవ్వను మాదుగులు దెం.... ఇదేం బతుకు- గీ బతుకు బతికేమి? సచ్చేమి?....సత్తె ఏ అల్లర ఉండదు'....అనుకున్నడు అనుకొని లేసి నిలబడి సుట్టు సూసిండు....లోకమంత పొగ కమ్ముకున్నట్టుగ తోసింది.

తలంచుకొని మోట సిమ్మల దనుక నడిసి బాయిలకు సూసుకుంట గుడిసేవ్వ కూకున్నడు- నీల్లల్ల తన బొమ్మెదుత్తంది- నర్సింహంకు ఆ ఏల్లల ఎవలు యాదికి రాలే- సూసిసూసి గుప్పిచ్చి బాయిల దునుక బోయిండు.

నర్సింహం జబ్బ ఎవలో పట్టుకున్నరు.

"నర్సన్నా- సూతిల బడుతావే- సచ్చేం సాదిత్తవే- మల్లవ్వను సత్తెవ్వను ఏం జేత్తననుకున్నవ్. లే- లే- బాంచెన్-" సీరటి బొత్తయ్య నర్సింహం రెట్టందుకొని సూతిగడ్డమీనికి నడిపిచ్చిండు.

"ఇంటికి పోదాం- దా-" ఇంటికెల్లి తిప్పిండు.

నర్సింహం సూత్తండేకాని ఎర్రి సూపులు- కండ్లు నిలబడిపోయినయ్. తలకాయ ఏలాదేసిండు- తెలివి తప్పిపోయిండు. బొత్తయ్య నర్సింహంను అటిటు ఊపి సూసిండు- కూలబడిపోయినోన్ని నిలుసుండబెట్టి సూసిండు. మల్ల కూలబడిపోయిండు. "మరింక పాయిదా లేదని" అమాంతం భుజం మీనేసుకొని పల్లెకెల్లి నడిసిండు.

పల్లె పల్లెంత ఒడ్డన నర్సింహం ఇంటిముంగట ఒరిగింది- పల్లెగొల్లు మన్నది- తలోమాట- "చ్చొచ్చొ"లు- ముక్కుసీదటాలు, మూతి ఇరుపులు, తిట్లు- శాపనార్థాలు- ఏదీ సరింగ ఇనపడకుంట ఎవలేమంటండ్రో ఎవలికి సమజ్కాకుంట తిట్టెటోల్లు తిట్టుతండ్రు- అరిసెటోల్లు అరుత్తండ్రు.

ఎవడో దూరంగ దడి కొయ్యలకాడ నిలుసుండి పేరు పెట్టకుంట అడ్డం పొడుగు తిడ్తండు- ఎవలను ఎందుకు అడుతిడ్తండో అనికే సమఝయిత లేదు.

"నోటికాడికచ్చిన పసల్లు కాలిపోతయ్. మనుషులే నిట్టనిలువుత సూత్తుండగ మాడి మసి బొగ్గయిపోతరు. అరేయ్ మనమంత మాట్లాడే పసురాలం- గొడ్లంరా గొడ్లం- ఎందుకు సూత్తంఁడ్రా లంజకొడుకుల్లాలా! దమ్ములుంటే అడుగుండ్రి ఏ లంజకొడుకిది సేసిండని? సుట్టూపదూల్లల్ల ఏ లంజకొడుక్కు- గంత దమ్మున్నదిరా? కూసుండ బెట్టుకున్న ఇంజను ఎత్తుకపోను- పంట కాలబెట్టేటందుకు- మాట్లాడరేమిరా- నా కెరికె మీకందరికీ తెలుసున్నా నోరిప్పరు- ఫీతిగాదుర- ఫీతి- గిసొంటి గోరాలు నా ఎంటికలన్ని సూసిన- ఎవడన్న మాట్లాడిండా? అద్దు ఫిరాదున్నదా? తు!! తొత్తుకొడుకుల్లాలా భయపడుకుంట ఎన్నిదినాలు బొంచె బతుకులు బతుకుతరా- మానాలులేవు. ఇజ్జతులులేవు- రేషాలులేవు- సచ్చిన పామసొంటిది సొవంగ తోకూపుతది.

అరె! అన్నెందుకు గట్ల ఇరుగబడి సూత్తండ్రు? నర్సిమ్మడు పిడాత సచ్చిపోయిండనా? అడు సొపడు- ఆడుసత్తె గియ్యన్ని ఎవడెల్ల బొయ్యలె- ఎన్నడో సచ్చినోడు ఇంకేమి సత్తరా నా లంజెపియి-" గుడ్డి గట్టయ్య గద్దువ కింద గుతుపకట్టె ఆనిచ్చుకొని ఓటుగాలు మీద నిలుసుండి అందర్ని ఇయ్యాడ మయ్యాడ తిడ్తండు. ఎగగట్టిన మాసిన బట్టపేగుల పుల్లల తీర్గ కాల్లు, ఎప్పుడో పారేసిన పాతసెప్పు ఎండకు ఎండి, ఆనకు తడిసి డొప్పయిపోయినట్టుగ- ఊగులాడ్తున్న కర్రెతోల్ల ముల్లెగట్టిన మొఖంల ఏది సరిగాకన్పియ్యదు- నోరు తీర్గున్నది పళ్ల ఇప్పుకున్నది.

"మల్లీ.... నీమొగన్ని ఇంట్లకుదీసుకపోయే. గుడిసేపు పండబెట్టు.... ఆడే కోలుకుంటడు.... అధాతుగ సూసిండుగన్క- దెబ్బతిన్నడు. అన్నిబోయినంక నా ఎంటికల్ ఇంకేం బోతయి. పిస్సముండ ఏడుత్తేమత్తదే- కండ్లనీల్లుబోంగ- అదలకుండ్రి- నా కెల్లిసూడు- నా కేమున్నది? నాగుడిసెల సిప్పసుత లేదు. ఎదిగిన కొడుకుల పోగొట్టుకున్న- పెండ్లాన్ని పోగొట్టుకున్న- మారే! నేను పోగొట్టుకున్ననా? నాత్రి పగలు- పన్జేసి పన్జేసి కూడులేక నరిగెబడి నరిగెబడి- రోగాలచ్చి సచ్చిండ్రు. సావకుంటేం జేత్తరు....? ఉంటె ఊడిగమన్న జెయ్యాలె- లాకపోతే సావనన్న సావాలే- నేను సావనుపో అంటె సంపుతరు- ఇన్నావు బిడ్డా మల్లవ్వా నీ కెరికేనా? సచ్చెడంటేంది నా లంజెపియి- మూడుకొత్తల గుడిసె. గుడిసెమీన దెబ్బగొడ్తె ఒడిసె- గంతే బిడ్డ గంతే- ఈగ సత్తది దోమ సత్తది- ఫో- బిరాన లోపలికి పట్టుకపో- గింత మందిని సూత్తే గావరయితడు- ఏందిర? ఏవున్నదీడ? మనసొంటి గరీబోడే పాము

పడిగె దెబ్బతిని అపలచ్చి పడ్డడు- సూసేం సేత్తరాత్రి? అరుత్తరా తీరుత్తరా? గా పని జెయిమంటె ఎట్ల బొయెటోడట్లనే అంగబడి తిరిగి సూడకుంట బోతరు- పడే పిడుగు మనమీన కానంత వరకు బేఫికరే- కని ఆ పిడుగు ఇయ్యాల్ల గాకుంటే రేపు పడ్తది మనమీన్నని అనుకోరు- ఇషపురుగు నిడిసి పెడితె కర్సినోన్నల్ల కర్సినంపుతది- పోండ్లిరా? బగ్గొడ్డుకాడ పంతరగల్లోలె ఏందిరాత్రి? గిసొంటి దానికి మా కూడుతరు బిడ్డ ఎందుకంటె ఎలుకల వడ్డోన్ని సూసి ఇగిలిచ్చెటందుకు. ఓరీ! పిరికెడు పిరికెడు మీసాల లంజెకొడుల్లాలా- కంకెడు కంకెడు సిగల లంజెకానాల్లాలా- ఎల్లిపోండెర్రిహే!-" అట్లెంత దన్కా తిట్టెటోడోకని.

"దెహే! గుడ్డి ముసలోడేందో సక్కోరడి పెట్టినట్టు అదుగుతండు- ముడ్డిమీన యూడిచ్చి తన్నుండెర్రిహే!-" ఎవడో గుంపులనుంచి మొత్తుకున్నడు.

"ఎవడాడు....? ఎవనికిరా అంతలావు బలిజెమున్నది- ఎవడా ఆ.... లు నరిసిన మొగోడు- ఈ తలకచ్చి మాట్లాడురా గాడ్దికొడుకా- నన్ను తన్నేది సుతారమారా! ఆడి దాన్ని గొట్టంచి ఇది మీసంగాదన్నడట ఎనకచెవడో నీ అసొంటి ఉచ్చుబున్నలోడు...."

ఎవడో జర ముంగటికచ్చి ముసలోన్ని తన్నతన్న బోయిండు- గుడ్డి గట్టయ్య ఏగిర పడకుంటనే ఇకిలిచ్చిండు.

"నారీ! కోల మొకపు కొంరెల్లి- ఈడు మీదున్నప్పుడు నీ అసొంటోల్ల అయిదుగురిని జమిలిగ తన్నెటోన్ని- గుడ్డోన్నరా? ఈ కన్నెవడు పొడిసేసిండు ఎరికేనారా? గీ కడుపుడుకుడంత ఎందుకోసరమో ఎరికేనారా? మనూరి దొరోడు లేడు? అని తంత్రి. లచ్చుమరెడ్డి- ఎరికైందా? నీ కెమెరుక- అట్టిసాపలు గాల్చుకతినే మొకానికి-"

"గట్టన్న! గోడలకు సెవులుంటయి- అట్టి సంబురానికి గియన్ని మాటలెందుకు?" ఎవడో గుసగుస లాడిండు.

"నాకేందిర బయ్యం....? నేను బతుకుతన్న మనిషిని నీయక్క! తిక్క లేత్తె గడి ముంగటికి బొయి భెల్లెపాట గడ్త...." గద్దువ కింద గుతుపకట్టె తీసిండు- నాలె మీన డొక్కుడొక్కున పొడుసుకుంట గెంటుకుంట గెంటుకుంట పోతండు.

"పూరాగ నిండినంక పాపం బద్దలైతది- వానమ్మల కుక్కలు దెం.... నోటి కాడికచ్చిన పంటను కాలబెట్టినోడు పసురానికంటె కనీనం. పాపపు లంజకొడుకులు. రోత లంజకొడుకులు- దుట్టి లంజకొడుకులు...." మూల మలుపు దిర్గినా సుత గుడ్డి గట్టయ్య తిట్లు ఇనపడ్తనే ఉన్నయ్.

ఎటోడు అసెల్లిపోయిండు- గిసొంటి మాటలు గుడ్డి గట్టయ్య సెవులిల్లు గట్టుకొని సెప్పుతనే ఉంటడు. ఎవడు సెవున పెట్టడు- "అః ఆనికేంది రంధా! రవుసా! మా సెప్పుతడు మాటలా-" అంటరు- జనం బడే తామూలోల్లు- అవుతల కొంపలంటుక పోయిన ఈతల కూకున్నోల్లు లేవరు- "గిదేందుర్రా? అంటే...." "ఎప్పటికుండే బాగో తమేనాయె ఇయ్యాల్ల కొత్తంగచ్చిందా?" అంటరు.

ఆల్లెట్లన్నా అనకునా జర్గేటియి జరిగిపోతనే ఉన్నయి- రోజుకొకడు నాశిడమై పోతనే ఉన్నడు.

పగసేల్ల అయ్యేదనుక నర్సింహం సడీసప్పుడు లేకుంట మంచాల పన్నడు- పొద్దు ఒంగుదలకు అధాతుగ మంచాల లేసి కూకున్నడు. మోకాల్లమీన తలబెట్టు కొని తెరుస్తున్న గలుమ గుండ బజాట్లకు సూసుకుంట కూసున్నడు.

ఎవలెవలో అటునుంచి నడుసుకుంట పోతండ్రు- ఎవలయో బండ్లు బడ బడ సప్పుడు సేసుకుంట ఉరుకుతన్నయ్- మూలమలుపుకాడి ఏపకింద పోరగండ్లు గోలీలాడుతండ్రు- బక్కపోరడు మోసేతితోని దేకుతండు-

మల్లికాంబ నిట్టాడు కానుకొని సేతులు ముంగట బెట్టుకొని మొకం రాగి పైసంత జేసుకొని కూసున్నది- ఆమె సెంపలమీన కన్నీల్లు ఎండిపోయి సారికలు గట్టినయ్- ఆదరువేందో? దిక్కేందో? ఎంతెతికిన కన్పిత్తలేదు- రేపేమయితదో నన్నది సమజ్ అయిత లేదు. ఎందుకనో సెందిరియ్య అత్తె బాగుండుననిపిచ్చింది. గీ కట్టకాలంల ధైర్నము సెప్పెటోడన్న ఉంటే మంచిగుండుననుకున్నది. మొగన్ని సూత్తే దుఃక్కమాగుడు లేదు.

బిడ్డ సత్తెమ్మ ఆకలి కడుపుతోని అయ్యను, అవ్వను సూసుకుంట కూకున్నది.

నర్సింహం మంచాల్నుంచి దిగ్గునలేసిండు. గొండికున్న పొవాకు ఈతలకు తీసి కూసంత సుంచుకొని నోట్లేసుకున్నడు. కసపిస నమిలి ఊంగిండు- అటుకు మీనున్న రేకు సందుగ తీసి అందుల నుంచి బట్టపేగుల ముడుపు గట్టిన అయిదు రూపాల నోటిడుసుకున్నడు- ఆడికి "దేవుందిగాదు దేంవుది-" మల్లికాంబ అంటనే ఉన్నది....గొండికి సెక్కుకున్నడు....

"అంతేందో సావు కాలమే అచ్చింది- అడ్లు పెరుగు గలిపినట్టున్నది" మల్లి కాంబ గులుగుతనే ఉన్నది.

సత్తెమ్మ మిడి గుడ్లేసుకొని నర్సింహంను సూసుకుంటున్నది.

"తాల్లకు బోతండు- అయిపోయింది.. అంతా అయిపోయింది. సర్వనాశిడమై పోయింది-" సేతులు భూమ్మీద సరుసుకుంట ఏడ్సింది మల్లికాంబ.

తల్లిని సూసి బిడ్డ రాగ మందుకున్నది.

నర్సింహం పెద్దపెద్ద జంగలేసుకుంట తాల్లదిక్కు నడిసిండు.

గూడు సెదిరినోన్ని, గుండె సెదిరినోన్ని- అందరిని ఆదుకునేది తాటికల్లేనని ఎవలు సెప్పకుంటనే ఆల్లందరికి సమ్‌జయిపోయింది.

* * *

గుడిసెల్ల దీపాలు మిలుకు మిలుకు మన్నయ్.

కయికిలి బొయి నోల్లంత తట్టబుట్ట నెత్తికెత్తుకొని ఇండ్లకు ముచ్చెట్లు బెట్టుకుంటత్తంద్రు- గౌండ్లోల్లు కావల్లు బుజానేసుకొని ఉరుకత్తంద్రు.

నర్సింహం సొలుక్కుంట సొలుక్కుంటచ్చి ఏపసెట్టు గద్దెమీని కెక్కిండు. లడలడ ఏందేందో అదురుతుండు. అంతట్లనే పాటలు పాడ్తుండు....కట్టుకున్న పాద్దోతి కాల్లకు తట్టుకొని ఎప్పడసంగనో సినిగిపోయింది. మోకాల్ల దానుక దుబ్బ పేరుకపోయింది.

"ఇంటారుర్ర ఇలవరిసెబెట్టి నేను బుర్రకత సెప్పుత- బుడుగు జంగాలకత సెప్పుత- నాకెరికే సర్సిమ్మడు తాగున్నడను కుంటాంద్రు- అవునుర్రా తాగిన- ఎంత దనుకున్నరు? అయిదు రూపాలది- పెద్దలొట్టి- డుండుం- కరంటు దీపాలు మనూల్లెకు కదిలచ్చినయని మోటర బెట్టి మోతెపరి నైతననుకున్న- కరంటోల్ల నోల్లె కంకెడు మొ.... ఆల్లు సుట్టు తిప్పిచ్చుకొని, కాల్లు మొక్కిచ్చుకొని ఝూడిచ్చి తన్నింద్రు- కరంటు మనది కాదుర్రో గానివేశింగా- దీపాలు మనయి గాదుర్రో గానివేశింగా- మనూరు దొరోడు కంబాలు నీయికాదు బాంచోతన్నడు- అద్దమనాత్రి పీక్కపోయి ఆడు సిడిమెల నీల్లు పోపిచ్చుకున్నడు- గిదేందంటే....? దొక్క సింపి దోలుగత్తనన్నడు- ఎట్లెట్ల గత్తవో సూడనే సూత్తనన్న- వారి ఇంటన్నారుర్రా? సూసిండు- చేసిండు కూసున్నడు మందనడు మాకనడవోవ్- ఎంకమ్మను గుంజిన్నని సల్గుల్ల బెట్టిండు- గనలుగు రెవలోంటా? ముండలకు కడుపులు జేసే మాలి పటేలోడు. కడుపులు దిగబోసి కన్ను గీటే కోమటోడు- నడుమ నా పాలేదని ఉరుకచ్చె పట్వారిగాడు. కారిన సొల్లునాకి మాట దోయక కూకుండె పెద్దమనుసులు- కుప్పలు కూడింద్రా? ఆల్లు దండుగులన్నారా! అరె! నేనే దండోన్ని నాకేంది దండుగ అన్నానా? అంటె ఏమ

య్యింది గదా అంటె– అహ కోసిన మక్క గూల్లకు అగ్గే పెట్టిండా? ఆడు అగ్గే బెట్టిండా? బొగ్గులు సేసిండా! అరె బొగ్గులు జేసిండా? పల్ల బూడిద జేసిండా! అరె ఇంజను పీకిండా! ఎత్తుక పోయిండా! మరిక నాకేందిర్రా– లచ్చాదికారిని– ఏటికి ఎడ్లు– పాటికి బర్లు...." నర్సింహం తొడగొట్టి మీసం తిప్పిండు.

ఇండ్లకు సేరేటోల్లు ఇచ్చెంతర పడి సూసింద్రు.

"బాగనే ఉంది సంబడం." ఎవతో మూతి మూడంకరలు తిప్పింది.

"సంబురమా! ఎవతది? పేగులు దెగి పోయేటట్టు ఏడ్సిన్నే? ఏడిత్తె ఏం లాభం దొంగ గాడ్దికొడుకులు మీసాల మీన సెయ్యేసి ముసిముసి నవ్వుతరు. ఎందుకని? అడుగే నన్నడుగు. ఒంటి నాగలి నర్మిమ్మడు కయికిలి గాడయితడు. కోతలు కోత్తడు. మల్ల మోతలు మోత్తడు– పంజలు గొత్తడు. అల్లగుమ్మిల్లకు అడ్లు జేరగొత్తడు– ఏ ఊల్లెనైన కూలోడుతప్ప బతుకద్దు– ఎవడికి గుంటెడు బూమున్నా తోలు ఒలిసి దోర్నాలుగడ్తా– బూముంటే ఓపూటన్న తింటడు. తింటె బతుకుతడు. బతుకుతె ఎదురు తిరుగుతడు. బాంచెగాడు బద్మాషయి పోతడు. ఎరికయ్యిందా?"

"అంతెగాల వచ్చింది. ఇయ్యాల్ల దొర నిన్ను బూలచ్చిమికాడ పాతర బెత్తడు–" ఎవడో ముసలోడు సడుసుకుంటనే అన్నడు.

"దొరెవ్వర్రా నన్నింక పాతర బెట్టెటోడు. నేనే దొరతనాన్ని పాతరబెత్త సిరుసు కనిపిచ్చేటట్టు– సిరుసుమీనికెల్లి గొడ్ల, బర్లగొత్త– మా అవ్వను మిలమిల సూడంగ సంపింద్రు– మాఅవ్వ యాదికున్నాదిరా ముసలోడా? పోసవ్వతల్లి! మాతిల బడి సచ్చిపోయింది. చ్చొచ్చొ.... యాదికిలేదా? ఎందరని యాదికుంటరు.... పోనీ మా మామ యాదికున్నడా? దొర గవిడి బర్రె పొడిసి సంపిన సాంబడు. ఆడు యాదికిలేడా? యాదికుంచుకోను ఆడేమన్న దొరోడా! ఎల్లుంద్రి.... ఈన్నుంచి ఎల్లుంద్రి నాముంగటేమున్నది నాటుకం.... మీరంత నాసుట్టు ఈగలతీర్గ ముసురుకుంటే నాకే డుపత్తది.... పోరగండ్లాల ఉరుకుండ్రి.... పెద్ద పెరిగినంక బూములు జాగలు పొయినంక బగ్గ కల్లు దాగేరు– పోతలేరా! గింత దోతి పేగిడిసేత్త– దొరింటిముంగటే కురుకుత– తెల్లెపాటగడ్త– పేరుపేరున కడిగిపోత్త, ఎవడడ్డమత్తడోసూత్త– ఇగో ఉరుకుతున్న–" నర్సింహం ఏపసెట్టు గద్దె మీన్నుంచి దునికి ఉరికిండు.

గుడిసేపటికి గడికెదురుంగ నిలుసున్నడు.

దోసిట్లకు మన్ను దీసుకున్నడు. సుట్టూరసేరిన పోరగండ్లతోటి.

"మట్టిపోత్తన్నా ! ఇగో మనమంత నేను మంతిరిచ్చిన గీమన్నును జల్లుకొని గడికాడి కురుకుదాం. పెద్దరువాజ పడగొడ్దాం- లోపటి కురుకుదాం- అన్ని, ఆ లంజ కొడుకును మిలమిల సూడంగ గొంతికె...." నర్సింహం గూబ గుయ్యిమన్నది- కింద మన్నె ముక్కుమూసుక పడ్డడు- నోట్లెనుంచి నెత్తురు కార్తంది- పోరగండ్లు బయపడి ఎటోడటు ఉరికింద్రు.

"లంజకొడుకు గొంతికెల వచ్చేదనుక తాగిండు...." షేకెదారు బాలమల్లు సేతులు దులుపుకొని గడిలకు నడిసిండు.

దొరతల్లి బొమ్మ కిట్టమూర్తి ముంగటే గంట ఊపింది- గ గంట సప్పుడు ఇల్లంత మారుమోగింది.

బక్కపలుసటి పంతులొకడు దొరకొడుకులకు పజ్జెం చెప్పుతండు.

"చీమలు పెట్టిన పుట్టలు పాముల కిలవైనయట్లు/హేమంబు కూడబెట్టిన భూమీసుల పాలజేరు" ఇడమర్సి సెప్పుతండు పంతులు.

సీమల పుట్ట లెరుకలేని దొరకొడుకులు తికమకపడ్డరు.

దొర గిలాసెత్తి అకరిదమ్ము అనుకుంటనే గొంతికల పోసుకున్నడు- కండ్లు కరంటు బుగ్గలోలె మండుతన్నయ్.

గడి అవల తొవ్వల ఇద్దరు సోరోల్లు మాట్లాడుకుంట పోతన్నరు.

"ఇంతట్లకే ఎవలదో మూలుగుడు ఇనచ్చింది- అప్పటి కిద్దరు గడి పెద్దరువాజ ముంగటి కచ్చింద్రు.

"సూడు ఎవలో దుబ్బల పడ్డట్టున్నది."

కరంటు ఎలుక్కు ఒకడు పొయి సూసిండు.

నర్సింహం సాతకాక మూల్గుతండు.

ఇంకొకడు కూడా సేరుకున్నడు.

మొదటి అతను బీరిపొయి నిలుసుండి పోయిండు.

"నీ కెరికేనా ?"

"మా సిన్నాయిన...."

రెండవ అతను మాట్లాలేదు.

ఇద్దరు నర్సింహంను మోసుకపోయింద్రు.

ఇద్దట్ల ఒకడు సెంద్రయ్య- ఇంకొకడు బొగ్గు బాయిల పని పోగొట్టుకున్న ఆనందం.

11

బారెడు పొద్దెక్కినా నర్సింహం మునుగదీసుకొనే పన్నడు.

సెంద్రయ్య, ఆనందం సీకటితోనే లేసి ఎటో పోయచ్చింద్రు. సుట్టాలచ్చింద్రని మల్లికాంబ పొయ్యి అంటుబెట్టింది. సత్తెమ్మ ఎటో ఆడుకోను బోయింది.

"లేయే సిన్నాయినా ఎంత పొద్దెక్కిందో సూసినవా?" సెంద్రయ్య నర్సింహంను లేపి కూకుండబెట్టిండు.

నర్సింహం లేసి కూకున్నడేగని రాత్రి కల్లురిమ్మ దిరిగినట్టు లేదు. కండ్లు బాగ ఎరుపెక్కున్నయ్. పెయ్యంత నలుగురు తన్ని ముగ్గురీడ్సినట్టుగున్నది.

"నర్సన్న! రందిపడ్తె మున్నది. మా మొఖాలు సూడు. ఇట్ల తిరిగే మొఖాలల్ల ఏం గనిపిత్తంది. నేను సెలకారునూర్లు సంపాయించెటోన్ని. పైస మిగులక పొయ్యేది. సమ్మె సేసిన నేరానికి నౌఖరిపోయింది. ఏడున్నరో పిల్లలు? నేనిప్పుడు ఏమి లేనోన్ని. మనందరి బతుకులు గంతే, గందుకనే మనం పోరాటం జెయ్యాలె" ఆనందం చెప్పుకపోతండు.

"దీనికేమన్న సెయ్యరాదా? పోలీసులకు సెప్పుకుంటే...." సెంద్రయ్య నర్సింహం పక్కకు కూలబడుకుంట.

"పోలీసు లెవలు? ఆల్లు ఎవల పచ్చం మాట్లాడ్తరు? గవాయిలు, సాబూతులు గావాలె. ఈ ఊల్లె అందరి కెరికె కని ఎవడు ముంగటికత్తడు. అంతదనుక అచ్చిందనుకో.... దొర తెలివిగ తప్పుకుంటడు. మనసొంటి గరీబోన్నే కేసులిరికిత్తడు. ఏడికచ్చిందన్నమాట...."

"ఆ లఫ్డికొడుకుల పేరెత్తకుండ్రి. ఎవనితోని సెప్పుకున్నా ఒరిగేది లేదు..." నర్సింహం అన్నడు. అని మంచాల్నుంచిలేసి కొండ్రికిచ్చి ఊంచి అంపులకాడికిబొయి సన్నీల్లు కుమ్మరిచ్చుకున్నడు. దోతి కట్టుకొని ఎటో ఎల్లిపోయిండు.

గ నాత్రే.... షేకెదారు బాలమల్లు మంచాల పండుకున్నడు. అయినె పెండ్లాం బూలచ్చిమి ఆకులు దెచ్చింది. సున్నం రాసి మొగనికిచ్చింది.

"బా.... నర్సిమ్మని ఆరువం కాలిపోయిందట?"

"ఔనట...."

"పాపం.... గరీబోడు."

"గరీబేంది సరీబేంది?"

"ఇంజన సుత ఎత్తుక పోయిం(డట....?"

"…. …. …."

"దొరే సేయించిండని ఊరు కోడై కూత్తంది.

అటునుంచి ఇటు దిరిగి పెండ్లాం మొకం సూసిండు- బూలచ్చిమి బాలమల్లు కొల్లను సూత్తంది.

"ఎంత కోతుకమున్న నోటికాడికచ్చిన అరువాన్ని…."

"నోరు మూసుకుంటవా లేదా? అడి ముండల కన్నిగావాలె-" బాలమల్లు కసురుకున్నడు.

"నేనేమన్ననని ఇరుసుకపడ్తన్నవ్- ఊరుఊరంత మొత్తుకుంటాంటే సెవులు సిల్లులు పడిపోతన్నయి."

"…. …. …."

"ఎవలా లంజెలు లంజెకొడుకులు…. గిసొంటి ముచ్చట్లు నా దగ్గరెత్తుతే సెప్పుతోని నాలికెగోత్త లమ్డి…."

బూలచ్చిమి అక్కన్నుంచి లేసిపొయి కొంగుతోని కండ్లు తుడుసుకున్నది.

"మంచిమాట రాదుగద ఈ మనిషికి- పచ్చిపెండ మీనగొట్టినట్టు" అనుకున్నది.

12

నాత్రి సీకటి దుప్పటి కింద జోగుతంది- సుక్కలు దిక్కులేని కూలి జనాలోలె అకాశంల ఉండుండి ఎలుగుతన్నయ్- ఈతమొగుల్లల్ల, తాటి మొగుల్లల్ల మిరుగుడు పురుగులు ఎగురుతన్నయ్- గ సిమ్మం జీకట్ల ఊరంత నిదురబోతన్న ఏల్లల ఒకడు ఆకలితోని నిదుర రాక అటిటు పొర్లుతండు- పక్క-కేసుకున్న అరిగడ్డి ఉడుకు పొగలు కక్కుతంది- అని ముంగట మాదండి అడ్డరాసున్నది- కని అని కడుపుల కరకర మంటన్న ఆకలున్నది- అడ్డ రాసిమీన అరిగడ్డి కప్పిఉన్నది- కడుపుల ఆకలిమీన ఏం గప్పాలో ఎరుకలేక అధాతుగ లేసికూకున్నడు- అనుకుతన్న కాల్లతోని అడ్డకుప్పసుట్టు దిరిగిండు- మనుసుల గుంజాటన- కుప్పసుట్టు పాలేరోల్లంత అడ్డదిడ్డంగ పడి గుర్రు కొడుతం(డు- అందట్ల ఎవడో కలువరిత్తండు.

అరిగడ్డి తొలిగిచ్చిండు- నేలమీన పిల్లితీర్గ సప్పుడు కాకుంట కూకున్నడు- సప్పుడుకాకుంట ఎనుక ఎవలో నిలుసున్నట్టనిపిచ్చింది- ఉలికిపడి ఎనుకకు సూసిండు-

పొలాలల్ల గోండ్రుకప్పలు ఒర్లుతన్నయ్- సిమ్మంసీకటి తప్ప ఎవలులేరు- లబదిబ గుండెకొట్టుకున్నది- పెయ్యంత సెముటపట్టింది- అట్టట్టిగనే సేతులనుకుతన్నయ్....

మల్ల కుప్పమీన గడ్డి కప్పి లేసి నిలుసున్నడు- తన పక్క కాడికి సడిసి కాల్లు బారసాపుకొని కూకున్నడు.

"ఇంటికాడి దురిగి కూడండి పెట్టిందేమొ? ఆదే అత్తడని సద్ది పంపలేదు గావచ్చు-" కూడు సంగతి మనుసుల మెదిలి లేసి నిలుసున్నడు.

సీకట్ల అడుగుల సప్పుడు- బురుద గుంటల్ల మీన్నుంచి, కోసిన కొయ్యకాల్ల మీన్నుంచి పొలాల్లబడి సెరువు కట్టమీనికెక్కిండు- సెరువు ఎండిపోయింది- ఆడాడ మిగిలున్న కయ్యల్ల కప్పలు బెకబెక మంటన్నయ్.

కట్టపొంట ఈతసెట్లు జడలు ఇరబోసుకొని నిలుసున్న దయ్యాలతీర్గున్నయ్- ఈత సెట్లను సూడంగనే మనుసుల పురుగుదొలిసింది- సీకట్ల కండ్లు సిట్లిచ్చి సూసు కుంట లొట్లున్న ఈతసెట్టు కిందికి సడిసిండు. అటీటు సూసిండు- ఈతసెట్టు నెగ బాకిండు- లొట్టి సూడబీకి మూతికాడ పట్టిండు- సెట్టు కిందికి జారిండు- సాలలే.... ఇంకో సెట్టు- ఇంకో సెట్టు- కడుపంతా కల్లుతోని డిబడిబ లాడింది- ఆకరిలొట్టి కిందడి సిండు- కప్పల బెకబెక సప్పుట్ల కల్లుకుండ సప్పుడు కలిసిపోయింది.

పెద్దపెద్ద జంగలేసుకుంట మాదిగ గూడెంకెల్లి నడిసిండు- గుడిసె పనుగడి నొక తన్ను తన్నిండు- పనుగడి కిర్రుమన్నది.

ఇంటాడిది నలుగురు పిలగండ్ల అడ్డదిడ్డం పండేసుకొని నిదురబోతంది- అధా తుగ సూత్తే అప్పుడెప్పుడో సచ్చి కట్టెసరుసుక పోయినట్టున్నరు- ఇల్లు ఇల్లంతా బొందలగడ్డ తీర్గున్నది- పొయిల సెవులపిల్లి గుర్రు మన్నది- దాని కండ్లు సీకట్ల సితర్రంగ మెరుత్తన్నయ్.

"తుర్రివ్వ లెల్లె నిను మాదుగుల్ దిన- కాల్లగూట నరాలు గుంజుకత్తన్నయ్- నీకేంది? ఇయ్యారమయ్యార తుంగ గొరికినవ్- ఇంట్ల నాకైతె గంజిసుత దొరకలే-" నారపేడసొంటి పోరడు కలువరిత్తండు.

"అన్న! ఏడ దొరికినయె ఎండ్రికిచ్చలు.... నీ ఉచ్చదాగుత నాకోటియ్య- కాల్సుక తింట ఆకలయితంది-" కాసేపటికి ఇంకొక పోరడు.

పనుగడ కాడ పర్వతమోలె నిలుసున్నడు గని కాల్లు బూమ్మీస ఆగుతలెవ్- గుడిసె లోపటికి తపతప అడుగులేసుకుంట నడిసిండు- బువ్వకుండను కాలుతోటి

తన్నిండు- మూలకు దీపం కూరుకుతంది- కూరుకుతన్న దీపాన్ని గుడిసేప్త సూసిండు- 'బొడబొడ' సప్పుడు సేసుకుంట దొర్లిపోయిన గడికెసుల ఇంకా అటిటు ఊగుతంది- ఎక్కన్నో అశె పుట్టింది- ఎడంసేత గడుకెసులనెత్తి మూతిబెట్టి సూసిండు- కుండల తడిసుత లేదు- అకరుకు అంటన్న లేదు.

కుండ సప్పుడుకు ఇంటాడిదానికి తెలివచ్చింది- పిల్లిగావచ్చునని "సో సో" అన్నది- సడీసప్పుడు లేదు- పనుగడి పాపుకొని కుక్కగిన సొచ్చిందేమోనని మెడెత్తి సూసింది.

గుడ్డిదీప మెలుగుల నిట్టాదెత్తు నిలుసున్న తునికి మొద్దోలె మొగడు మూలికాడ కుండ పట్టుకొనున్నడు.

"కూడులేదు కుమ్మలేదు- ఇంకా సక్కదనానికి కూడా? మన్ను బుక్క- మంచినీల్లు దాగకపొయినవ్- సెత్తపెంచినవ్.... మానంలేని సెత్త- శరంలేని సెత్త- పోరగండ్లు ఆకలో ఆకలని పచ్చిబలికిచ్చింద్రు- నీకేంది మొగబాయిగానివి- ఏనాత్రచ్చో ఎల్లిపోతవు- పోరగండ్లు పొద్దందనుక సీరుక తింటంద్రు- ఇయ్యాల్లనన్న ఇత్తులు తెత్తవని కొండ కెదిరిసూసినట్టుగ సూసుకుంట కూకున్న- అనింట్ల పీనెల్ల! నా కోత కయికిల్లన్న ఇత్తడనుకుంటె కోతలు పురాగకాంది ఇయ్యాదట- బాలమల్లుగాడు బిరాన ఎప్పుడు సత్తడో? వాని సావు నిర్వావుగాను- ఏందిని కోతలుగో త్తరనుకున్నడో? గింత నాత్రిదనుక ఏడసచ్చినవ్? నీకేంది మారాజువు- పోరగండ్లు, నేను సచ్చి మురిగి పొయిన ఆర్నెల్లకు ఇటు తొంగిసూత్తవ్-" ఆడిది సనుగుతంది.

"లంజెకాన! కూడుగావాలె...." తుపుక్కున మొకంమీన ఊంచిండు- గుదగుద సప్పుడు రాంగ బుర్రల రాల్లేసి ఊపినట్టుగ సెప్పరాని తిట్లు తిట్టిండు.

"నీయింట్ల పీనెల్ల! ఏడతాగచ్చినవ్ గింతనాత్రి? తాగెటందుకు ఇత్తులు దొర్కి నయ్ గని, పోరగండ్ల కింత గంజి కాసి పొత్తమంటె దొరుకలేదా? సేసిన కట్టం గొండ్లోని కొమ్మున బెట్టినవ? సూడు సుప్పనాతి మొఖం! నన్ను సూడు నా అందం సూడుమని! కూడట కూడు- ఏడదేవాలె? సీ, సిగ్గులేని పుటుక! నా గండాన పుట్టినవ్- నిన్నెత్తుక ఎగబట్టుకపోను- గొంతికెల కచ్చెదాక తాగిండు- తాగుడింట్ల పీనెల్ల...." మొఖంమీని ఊము తుడ్సుకోను కొంగులేక- అరిసేత్తోని తుడుసుకున్నది.

ఇగట్లచ్చింది కోపం- ఆడిదాన్ని యూడిచ్చి తన్నిండు- సేతుల కుండ పొయిల కిసిరేసిండు- పిల్లి తోకపట్ట దులుపుకొని ఒర్రుకుంటురికింది.

పోరగండ్లు కోల్లమీన పిల్లి అధాటుగ దునికినట్టుగ లేసింౘ్రు.

ఏడిసేటందుకు సాతకాక ఇంటాడిది "వీని నాము సదుక— వీని కాల్లు బడిపోను— వీని తాగుడు నాశిడంగాను— తన్నిపోతండు— ఎందుకేడుత్తరుౘ్ర పోరగండ్లు— అయ్యకు బుద్దిరాదు— మనకు సావురాదు— పండుండ్రి—" అని పోరగండ్ల కసిరి నేలమీని కొరిగింది. సిల్లులు పడ్డ గుడిసె కప్పు కెల్లి సూసుకుంట— పీక్కపోయిన సెంపలు తడిసేటట్టుగ— సప్పుడుకాని ఎడతెగని ఏడుపేడిసింది.

"సీయవ్వల కుక్కల్ దెం.... మాదిగి లంజకొడుకుల్లాలా— కడుపునిండ తిని కాళ్ళు బారజాపుకొని పన్నారుౘ్ర— నా సంగతెవడు ఇసారించలే—" తిట్టుకుంట, సొలుక్కుంట పెద్దమ్మ గుడికాడికి సేరిండు.

ఏమనిపిచ్చిందో ఏందో పెద్దమ్మగుడి గద్దెమీన కాల్లుబారజాపి కూకున్నడు— గజ్జి బక్కకుక్క "కుయ్యికుయ్యి" మనుకుంట లేసి ఉరికింది— తలకింద సేతులుబెట్టుకొని ఎల్లెలుకల పన్నడు— వండి, కాలుమీన కాలేసుకున్నడు.

"కుక్కా ఎందుకురుకుతన్నవ్ బంచత్ ! ఓసి ! గదా సంగతి ఎవతి గింత గంజి బొయ్యలేదా ? గిడేమున్నది ? మాదిగిండ్లబట్టుకొని సత్తన్నవ్— ఊల్లెకు బోతెగాదు ? ఆడ దొరల కుక్కలున్నయ్ గద— అయ్యేడ రానిత్తయ్— పేగులెల్ల కరువయ్....! నీ కెరికలేదా ? నేను సుత కుక్కనే— నేను పెద్దకుక్కను, నువ్వు సిన్న కుక్కపిల్లవు. ఓరి సీయవ్వ ! గింత మురిగిపోయిన గొడ్డుమాంసమన్నా, అదెపాయె కాలుబొక్కన్నా !! దొరుకలేదా ? ఇయ్యాల్ల ఎవనిగొడ్డు సావలేదండాలె— లందలన్న సూడకపోయినవ్— తోలు సెక్కన్న దొరుకుద్ది— జువ్విసెట్టుకింది కురుకు— నిన్నటి బొక్కలేమన్న ఉన్నయేమొ ? అయిసుత పీతిరిగద్దలు ఎత్తుకపోవచ్చు— ఎత్తుకపోతయి, ఎత్తుకపోవు మరి— కడుపుల దవ పుట్టుకత్తంటె కంట్లె కనిపాపలు సంపుకొని పసిగుడ్లోలె అని పొలం సాదుకచ్చిన్నా ? కోయించుకున్నడు— కొట్టిచ్చుకున్నడు— రాసులు బోసుకున్నడు— మూన్నెల్లబట్టి కపుడుకు సాల్తలేదని గీమాలిస— అన్ని ఒక్కపారే బత్తాలు కుట్టిచ్చి ఇంటికి పంపిత్తడట— అని పెండ్లాన్ని పెద్దమాదిగోడెత్తుకపోను.... గసొంటి పాపం మాదిగోని కెందుకు— ఆడే సూరు మంది పెండ్లాలెత్తుకపోతడు—" గాలిసిరికొట్టింది. గ గాలితోటట్టే మురుగు అసనచ్చింది— బొత్తయ్య ముక్కు మూసుకున్నడు.

"సీయవ్వ ! మాదిగిండ్లన్ని ఎన్నడో మురిగిపోయి గవులు గొడ్తన్నయ్— సచ్చిన బగ్గొడ్లను తిని అటి తోలు జేగర్తగ సాపుసేసి సెక్కునాల సెప్పులు సేసియ్యాలె తిన్నపాపానికి. వ్వారెవా ! ఎంత గడుసోల్లు దొరలు— అల్లిండ్ల ముంగట మురిగి

పోయిన గొడ్లను పారేసేదే మాఎక్కువంటె- గండట్ల సుత లాబమే పిండుకుంటండ్రు- ఆల్లదేం తప్పు? మాదిగి లంజకొడుకులదే తప్పు- ఓరి మాదిగి లంజకొడుకుల్లాలా! పెద్దవ తల్లిమీన బాససేసి సెప్పుతన్న- ఇనుండ్రిరా! మీ పుట్టుగుడ్డి పుటుకల్ల మొ.... కండ్లు దెరువుండ్రి- బడితెలు బట్టుకోండ్రి- అడ్డమెవడత్తడో సూత్త- బడితెలు బట్టేది గొడ్ల మోసెటందుకు గాదు- మర్రేయిండ్రి."

ఎవడో ముసలోడు కడుపులపేగు లీతలబడెటట్టు దగ్గుకుంట బొత్తయ్య ముంగటి కచ్చిండు.

"అద్దుమనాత్రి అంకమ్మ శివాలు.... తాగిందరుగలేదురా? మారాజోలె కాలు మీన కాలేసుకొని గద్దెమీన పన్నవ్- అరువాన్ని ఎవల కప్పజెప్పచ్చినవ్?" దగ్గుకుంటనే అన్నడు.

"ఓరంకరి పల్ల! నేను మారాజునేరా! నలుగురు కొడుకులు- ఓ బిడ్డ ఎందు కనుకున్నవ్? సచ్చినపుడు మోసెటందుకు, బిడ్డ ఏడ్సెటందుకు- ఇంకేం గావాలిరా మారాజుకు? అదిగాదుగని- నేను తాగుత- లెల్లెపాటలు పాడుకుంట- దప్పు బుజా నేసుకొని ఎగురుత- నువ్వెవనివిరా లంజకొడుక? నన్ను మందలియ్య...." పన్నోడు లేసి కూకున్నడు.

ముసలోడు దగ్గుతోటి లుంగసుట్టుకపోయిండు.... మాట్లాకుంట ఎల్లిపోయిండు.

"లేల్లే.... లెల్లే.... లెల్లాయిలో
లెల్లే.... లెల్లే.... లెల్లాయిలో
అరె! వాడ గదిలిందిరా జంబాయిరే
బెజ్జువాడ గదిలిందిలా జంబాయిరే.... టిన్ టిన్ టిన్
మెట్టు గదిలిందిరా జంబాయిరే
కమ్మంమెట్టు గదిలిందిరా జంబాయిరే.... జమ్డుక-జమ్డుక"

రాగం మారింది- పదం సుత మారింది-

"తీగెవారె తీగెవారె వాయిరేణుకో
అమ్మ రేణుకా....
మొగులుముట్ట తీగెవారె వాయిరేణుకో
అమ్మ రేణుకా.... టిన్-టిన్-టిన్....

పదం పాడుకుంట, నోరుతోనే జమిడికె ఆయించుకుంట పెద్దమ్మ గుడిముంగట దుబ్బల గుడిసేపు అంగంగి ఎగిరిండు- గట్లనే పదం పాడుకుంట అచ్చిందారి పట్టిండు.

సెరువు కట్టమీని కచ్చేటాల్లకు కల్లు అరిగిపోయింది- పల్లో ఈతసెట్టెక్కిండు. పొలాలల్లబడి కల్లంకాడికి సేరుకున్నడు.

అరిగడ్డిమీన అటీటు పొర్లిండు- కడుపుల ఆకలిమంట మొదలయ్యింది- లేసి కూకున్నడు- నెత్తికి సుట్టుకున్న పాతపేగిప్పిండు- పిల్లితీర్గ అడుగులేసుకుంట అడ్లరాసి దనుక నడిసిండు- అటీటు సూసిండు- పాలేరోల్లంత ఇంక నిదుర్లనే ఉన్నరు- పందిరి కింద ఎలుగుతన్న సికిలేటును కానలే- పాత పేగులకు అడ్లు తోడుకున్నడు- మల్ల గడ్డి కప్పిండు- లేసి నిలుసుందామనేటాల్లకే ఎనుక నుంచి ఈపుమీన తుపాకి గుండుతీర్గ తన్ను- ముకంమీన టార్సులైటు ఎలుగు ఒక్కపారే పడ్డయ్- బీతిబీతిగ తలెత్తి సూసిండు- సికిలేటు తాగుతన్న అంతెత్తు దొర- దొరపక్క బాలమల్లు- ఇంకో దిక్కు పాలేరోడు గుండడు.

బొత్తయ్య నవనాడులు కుంగి కూలబడిపోయిండు....

కూలబడ్డోన్ని మొత్తుకోంగ ముగ్గురు తన్నిండ్రు- అప్పటికే పాలేరోల్లు లేసిండ్రు. అంత లొల్లి- తొక్కులాట- ఇద్దరు పాలేరోల్లు గిర్రున పెడరెక్క లిరిసి పగ్గాలతోని బొత్తయ్యను కట్టేసిండ్రు- నెత్తిమీన అడ్లముల్లెబెట్టి గనాత్రే పెయిల నుంచి సొడసొడ నెత్తురు కారంగ బొత్తయ్యను ఊల్లెకు దీస్కపోయిండ్రు- అడ సింతకు గట్టేసి, దొర కుర్సిల కూకుంటె బాలమల్లు సెముటల్ పెట్టేదనుక, సేతులు నొచ్చే దనుక కొట్టిండు.

* * *

బూలచ్చిమి కాడ పెద్దమనుషులు కుప్పకూడిండ్రు.

మల్లయ్య సింతసెట్టు కింది రోలుమీన కూకుండి సుట్టతాగుతండు- బీమయ్య సింతసెట్టుకు కొంచెందూరంల కూకుండి కండ్లు పులపొడుత్తండు- కోమటి రామలింగం గడించల కూకుండి కొనుకపోగు తీసుకుంటండు- మాలిపటేల్ ముకుందరెడ్డి ఇంకో గడంచల కూకుండి తొడమీన తపతప కొట్టుకుంటండు- పట్వారి గౌరయ్య పక్కకే కూకుండి పండ్లల్ల పుల్లపెట్టుకుంటండు.

సబ్బండవర్నాలు ఎవల అంతస్తులబట్టి ఆల్లు దుబ్బల కూకున్నరు.... ఆల్ల ముంగట నాత్రి కట్టిన కట్లతోని బొత్తయ్య నాలెసూపులు సూసుకుంట నిలుసున్నడు- బొత్తయ్య పక్కకు ఇద్దరు సుంకిరోల్లు బరిసెలు బట్టుకొని చిలుసున్నరు.

"ఏందిర బొత్తోడ- ఇదేమన్నాయెంర! ఇది ఊరనుకున్నవ పాడనుకున్నవా?" అన్నడు మల్లయ్య.

పిల్రల లింగడు ముంగటికి జరిగిండు- బొత్తోనికి మజ్జెతుగ ఏందన్న సెప్పుదామనుకున్నడు- మాటదోయక గుంజాటనపడ్డడు.

"గులాపోల్లం బాంచెన్- కడుపుకు సాలనోల్లం బాంచెన్- కడుపుల బెట్టుకొని, దమ్మువింగి ఇడిసిపెడ్తరని ఆశపడ్తన్నం బాంచెన్- తన్నినా గుద్దినా మాకెవలున్నరు బాంచెన్ దిక్కు? కాపాడినా, సంపినా మీరేకాదు బాంచెన్? అనిది తప్పే, గింత మందిల గది తప్పుగాదనోన్నిన్ని సెప్పుతోని పంట్లూడ గొట్టుండ్రి- అశలె ఎర్రి లంజకొడుకు- అందట్ల గిన్ని కల్‌సీల్లు తాగున్నడేమొ! ఎద్దసొంటిది పక్కకుండంగనే పిరికెడు ఆరువపందుకుంటది బాంచెన్- గురుత్తము సూసుకపోపాలె- మాదుగులమంతా కరువచ్చినా, కడుపుకు సాలకున్నా, పిటపిట మాడిసచ్చినంగని ఇగో గిప్పటిదనుక పిరికెడిత్తులు ముట్టెరుగం- అనికేం బుద్ధిబుట్టిందో? ఏయేల్ల బుట్టిందో నారాయుడికెదుక- అగ్గి ముట్టనే ముట్టిండు- ముల్లుగుచ్చ సందులేకుంట తన్నులా తిననే తిన్నడు పాంచెన్- అని మొకం సూదకుండ్రి- అగో గ మందిల నిలుసున్న దురిగి మొఖం సూడుండ్రి- గ పోరగండ్ల మొఖం సూడుండ్రి బాంచెన్- నలుగురున్న కాడ నారాయుడున్నడంటరు- ఇగ అన్ని ఏడు నిలువులలోతు తొక్కినా మీరే, అదెపాయె దొంగలంజకొడుకని కనికరిచ్చినా తమరే-" మూడుసార్లు మొక్కి ఎనుకకు జరిగిండు.

పెద్దమనుషులు ఒకల మొకాలొకలు సూసుకున్నరు.

"ఎట్లయిన మాదిగి లంజకొడుకులకు మోర బలిమి కుదిరింది- గాంధచ్చి సవరాజ్జమన్న కాన్నుంచి గమండి పెరిగిపోయింది- సాపల రాకిసట్టు రాకంగనే గిట్లుండటడ్తిరి- నెలకో దండుగు తాకంగనే నేనే మొగొన్నని మీసాలడిపెట్టబడ్తిరి. వారీ! బొత్తోడ! అరికల్లం ఇంట్లకు దెచ్చుకుంట ననుకున్నావురా! ఇగ కక్కు లంజకొడుక- ఇవ్వారకు కానకుంచెంతెత్తుక పోయినవో? కక్కు...."

బీమయ్య సూసాయగా సెప్పిండు.

అన్ని పంచాతులోలైనే గ పంచాతు తెగింది- తొత్తోన్ని బొందబెట్టిండ్రు- ఆడు జల్మజల్మలకు కోలుకోకుంట జేసిండ్రు.

అయిదు నూర్ల రూపాలు దండుగేసిండ్రు.

గుడిసెకున్న పదిగుంటల పెరడు బీమయ్య దీసుకున్నడు- దురిగి కడెంబద్దలు కోమటి రామలింగం కొన్నడు- అయినా ఆడు నూదూరిపాటు పట్వారి గౌరయ్య కాడ

అప్పు దెచ్చిండు— పెద్దోడు అడ్డికిందికి పాసింది పులిసింది దిని బర్లగాయ కుదిరిండు— అప్పు దేరే దనుక పోరనికి జీతంలేదు, రూపాల కడ్డిలేదు.

దండుగు రూపాలు సేరేకాడికి సేరినయ్— నాలుగు నూర్లు దొరకండినయ్— కడుపయి తలిన్ని పెద్దమనుషులు పంచుకున్నరు.

గియ్యన్ని జర్గినా బొత్తోడు బొందిగకు తాడుపెట్టుకోలేదు— మాడ్సుకున్న మొకంతోటి శచ్చినోనితీర్గ అడలన్ని తిర్గుతనే ఉన్నడు— పనులు సేత్తనే ఉన్నడు.

13

వైశాఖ మాసం జొచ్చింది.

అ యేడు ఎండలు నిప్పులే కురిపిచ్చినయ్— ఎన్నడు లేనంత ఉడుకు అడగాలి ఇసిరిసిరి కొట్టింది— ఎండి నెర్రెలు బాసిన సెరువు మీన్నుంచి, పొలాల మీన్నుంచి, ఆకులు జాడిచ్చిన అడివిలనుంచి ఆగుల ఇసుకమీన్నుంచి, నల్లరేగడి పెల్లలమీన్నుంచి అడగాల్లు "రయ్యి రయ్యి"న ఈడ్సికొట్టినయ్— బారెడు పొద్దెక్కేటాల్లకే అరిపాదాల మంట నెత్తికెక్కి, నెత్తిల ఉడుకు ఒల్లంత పాకి, శలీరం సెమటతోని తడిసి ముద్ద కాంగ, మనుషులంత పెదువులు నాక్కుంట, పిడుసగట్టుకపోయిన నాలిక అటిటు తిప్పు కుంట ఏ సెట్టునీడకో సేరేటోల్లు— గట్లయిన, పన్జెయ్యకుంటె కడుపుల కెట్లత్తది? రెక్కాడ్తెనే డొక్కాడే జీవాలకు— సత్తవడుత మలమలమాడంగ సుత గుంటుకులెంట సెల్లమట్టి, పెంటబొందల్ల పెంట జారిగొట్టుకుంట గ పల్లెజనం పన్జేసెటోల్లు.

కర్రెపిట్టలోలె ఎండల మాడిపోయి, కడుపులు ఎన్నుకపూస కతుక్కపోంగ గుడిసెల్లకత్తె గుడిసెల్లేమున్నది? మూడు పానాదులకాడి దుబ్బ. సెంబెడు మంచినీల్లు గటగట తాగి నిట్టాడుకు గేరచ్చి ఒరిగిపోతె, షెకెదార్లు అంకసెండాలం తిట్టుకుంట ఎములతీర్గ ఇండ్లమీని కచ్చేటోల్లు— అచ్చిన కట్టం సచ్చిన దప్పదని, కాల్లీడ్సుకుంట, గడ్డాలు పెరిగిన మొకాలల్ల ఆకలిని, తామసాన్ని దాసుకొని పనులమీనికి నడిసెటోల్లు— మల్ల గానుగెద్దుకు గంతలు కట్టబడేయి— గడియ పుర్సతులేకుంట గయ్యే పొలాల సుట్టు, పెరండ్లసుట్టు, సేండ్లసుట్టు తట్టలు పారలు బట్టుకొని తిరిగేటోల్లు— దొరిచ్చిన జీతం గింజలు రోజుకు తవ్వెడు— ముక్కినయ్ మురిగినయ్ పోంగ, తాలు తవుక లేరంగ మిగిలినయ్ ఏకొద్దో? ఇసుర్రాయిల పోసి కిరకిరలాడి కిందగూలిన గటుక సోడు పిరిసిబెడు— అరుసోడు పిండి పిరిసిబెడు పొట్టు— సోడు గటుక ఏపూటలకు సరిపోద్ది. పిల్లలుగలోల్లకు అరుసోడు పిండంబలి ఏ పేగుకు జారుద్ది?

ఎండకాల మచ్చిందంటె ఆడోల్లకు పనులుండయ్‌— ఎటుతోసక గుడిసెల సూర్ల నీడకు సింపిరి తలలు ముంగటేసుకొని పేండ్లు కుక్కుకునుడో? అదీ సాతగాంది ఆకలి కోపమో, మరే కోపమో 'అత్తలమీని కోపాలు దుత్తలమీన తీసినట్టుగ' "ఛీ" అంటె "ఛీ" అని తన్నుకుంటనో తిట్టుకుంటనో ఉంటరు.

మాదిగ్గూడెంల ఆడోల్లు తంగెడు గట్టె కొడుతరు— తంగెడుకట్టె ముంగటేసుకొని తపతప కొట్టి తోలు ఒలుత్తండ్రు— పిల్లిగడ్డపు సెక్కసేటు కొంటాబెట్టి వాళ్ళ మూలుగుడుల జోక్కొని సంచులు నింపుకొని అల్ల సేతుల్ల సిల్లర పోత్తండు— సీకట్ల లేసి మల్ల సీకటయేదనుక పడ్డ కట్టం ఇలువ సిల్లర పైసెలు— సెక్కసేటు అవుతల సెక్కముక్కతోని సెక్కసాల ఇండ్లు గట్టుకున్నడు. గొడ్డు గోదా ముగ్గురు పెండ్లాల సంపాయించిండు. అయిదుగురు పాలేరోల్ల సేత సంపాయించిండు.

తప్పకుంటె అన్ని పెంకలే— మరందుకని....

మల్లికాంబ బిడ్డ సత్తెమ్మను ముంగటేసుకొని నెత్తిమీన 'టోంగులు' పొడుసుకుంట పేండ్లు కుక్కుతంది— సత్తెమ్మ ఏడ్సుకుంట తల్లిని తిడ్తంది— దానికి మర్రి సెట్టు— కట్టకొమ్ము— గోలీలు— సిర్రగోనె కండ్లల్ల కన్పడ్తన్నయ్‌.

నర్సింహం ఇంటెనుక కొడాల్లె పందిరికింద గడంచల కూకుండి బక్కెడ్లను సూసుకుంట రుప్ప తుప్ప ఊంచుతండు— ఎండ లగాంచి కొడ్తంది— పొద్దు నెత్తెమీని కచ్చింది— అడగాలి ఉండుండి సెవుగువ్వలు పలిగిపొయ్యేటట్టుగ యాత్తంది— పోశమ్మ ఏపసెట్టుమీన గోరెంకలు ఒక్క దగ్గెర కుప్పకూడిన కూలోల్ల తీర్గ అరుత్తన్నయ్‌— ఎండదెబ్బకు కొన్ని టప్పటప్ప కిందపడి సత్తన్నయ్‌.

"ఓ నర్సన్న! ఏడ కూకున్నవే?" సపాయి దుర్గడు గడి గొయ్యలకాడ నిలుసుండి సీకట్లు కమ్ముతన్న కండ్లు సికిలిచ్చి నర్సింహంను సూసిండు.

"ఇగో! కోమటి రామలింగయ్య నిన్ను జరూరుగ తోలుకరమ్మన్నడు."

నర్సింహం గుండెల రాయిబడ్డది— నోరెండుక పోయింది.

"రేపగ్గెరయామత్త పో—"

"నా కెరుకలే.... నిలుసున్నోన్ని నిలుసుండంగనే పట్టుకరమ్మన్నడు."

"ఇంట్ల లేడనుపో—"

"మారె, గయ్యన్ని ఇచ్చులు కచ్చకాయలు సెప్పరాదు— సానది నాల నుంచి తప్పిచ్చుక తిర్గుతన్నవట—" సపాయి దుర్గడు నిక్కచ్చిగ సెప్పిండు.

నర్సింహం అడుగు అడుగేసుకుంట ఇదిలేక ఎండలబడి సపాయి దుర్గనెంట కోమటి రామలింగం ఇల్లు సేరుకున్నడు- మొకంమీని సెమట తుడుసుకున్నడు- ఇంటి ముంగటి రేకుల పందిరి నిప్పులు కురిపిత్తంది- నర్సింహం నిప్పుల్లనే నిలుసున్నడు.

ఎదురుంగ కాశిగడ్డి పందిరి కింద జంజిరంపోస తీడుకుంట సాచ్చాత్తు ఎమదరుమ రాజు తీర్గ కోమటి రామలింగం నిలుసున్నడు- అంగిలేనిపెయి, గుంబొట్టతీర్గ బొత్త- నూనెబుడ్డసొంటి మన్నటి గుండు- గుండుమీన ఉండిలేనట్టున్న జుట్టుపోస- తిరుమని గౌరబొట్టు- గప్పుడే తిన్నదేమొ దగదగలాడత్తండు మనిషి- నర్సింహంను సూడంగనే పిల్లితీర్గ వెకవెక నవ్విండు.

"దా.... దా నర్సింహం.... దా- ఇటేటు రారాదుర- రేకులకింద మంట- నీడకు నిలుసుండు-" కట్టె పీటమీన తిరిపారి కూసుండి- ఎడంసేతుల బాగం వక్క- నోట్లేసుకున్నడు.

నర్సింహం నిలుసున్న కాడినుంచి జరుగలేదు.

"ఇగో నర్సింహం! ఎండలు సూడు ఎట్ల మండి పోతన్నయో? గీ ఎండల సూత్తే- ఇయ్యేడు బతికే కాలంరాలె- కాలం గాడ్దినెక్కచ్చిందట- ఇన్నావురా? శనారం కార్తులు- ఊడ్సుక పోయినట్టే- ఎటుసూసిన ఏందో మాలోకం తీర్గున్నది."

"అవునట- ఎట్లబతుకుతమో?" నర్సింహం ఏదోమాట్లాడాల్నని.

"అవుగని- అడెరా! మనుషుల మీన మనుషులదోత్తె నువు మాత్రం గీడిదా కచ్చిపోపయితివి- కాదుర బిడ్డా! అక్కెరున్నప్పుడు కొంటబోందెవ్వలు? నా అసొంటేనికే ఓయాల్ల బడ్తెఏడికన్న సేబదులు కురుకాల్సత్తది- ఇయ్యేడు నా ఎవారం ఈగలు గొట్టుకున్నట్టుగనే ఉన్నది- దేవుడు నిన్నెట్ల ముంచిండో నన్ను గట్లనే ముంచిండు. పదిహేనుపుట్ల మక్కలు గొని గాలికిబోయె కంపను ముడ్డికి తగుల బెట్టుకున్న- ఇవ్వార్దన్క ఉంచింది పోతేపాయె- తరుగుల కగ్గిదల్ల అయిన సుత పోయిన యనుకుంటి- కిటుకేడున్నదో సమఝయితలేదుర నర్సిమ్మా! ఏకుదమ్మున దర పడిపోయింది- నీకాడ అవద్దమెందుకు గిద్దెకు అయిదురూపాలు అసలుకే లుక్సాను బెట్టుకొని మొన్న బీట్లపారబోసిన- ఏల్లర- ఏల్ల- ఇయ్యేడు గాశారం మంచిగలేదు- ఏడింట శని కూకుంటె ఏడ ముంగట బడ్తం- ఇత్తిదునం దరలు పడిపోయినయ్- కోమటోడు సేతులు ముంగట బెట్టుకొని కూకుంటె ఎల్తదా? ఏదన్న ఎవారం సెయ్యకుంటె సేతికి సిప్పత్తది- గందకనే మిరుప వరుగు గొన్న-" రామలింగం నర్సింహం మొకంల మార్తన్న రంగులను తేరిపారి సూసిండు.

"సల్ల కచ్చి ముంత దాసేదేంది? అయింక సాటుకు కోమటోడు కటికోనికన్న కడీనం అని పెండ్లమాలు దిట్టు పడ్త- కని నర్సమ్మం.... గ అర్నెల్ల కింద కొంట బొయిన రూపాలియ్యంది ఎల్లేటట్టులేదు. కావాల్నంటె నా పిలగండ్ల మీన ఒట్టుబెట్టు కుంట- అవ్వతోడురా- నాదగ్గెర సిన్న కొత్తుంటే ఎంతంటె అంతొట్టు. నువ్వు గయ్యి ఇయ్యకుంటె నా పజీతు బోతది.... పజీతు పొయినంక బతికేం సచ్చేం? ఒల్లె క్కాలకు సూత్తండంగ నాబట్టలు నడిబజాట్ల ఇడిపిత్తరు...."

"నాసంగతెరికెనాయె- షావుకారి- నోటి కాడికచ్చిన పసలు అట్ల గాలిపాయె- అప్పుదెచ్చి కూసుండ బెట్టుకున్న మోటర దొంగల పాలాయె- ఇంట్ల పిరికెడిత్తులు లేవు- గీ అగ్గెనగాండ్ల నీబాంచెన్-" తతిమ్మ మాటలు మింగిండు.

"గదంత నాకెరుకలే- ఇగోనర్సిమ్మా! కొలువా కుమ్మరియ్యి నాపైసలు నాకి య్యంది కలువది. నా పుర్సి బేరం గోదాట్లె కొట్టుకపోయినట్టె- ఇగ నీయిట్టం.... సంగతైతే గిదని నీసెవులేసిన." కోమటి రామలింగం ఖరాఖండిగ సెప్పి లోపలికెల్లి పోయిండు.

'గ యిట్టమేందో?' నర్సింహం కెరికే- బీరిపోయి నిలుసుండే తాకతు సన్న గిల్లి సంకెల్లేసిన ఖయిదు తీర్గ పడారి గోడకానుకొని కూలబడి పోయిండు. కిట్టయ్య మెత్తటి బెదిరింపుకు- దసిలి తువ్వాల్ల మొలలసెప్పుబెట్టి కొట్టినట్టుగ మాట్లాడిన మాటలకు ఒల్లుమండుతంది.

మసక మసకగ గడిసిపొయిన దినాలు యాదికత్తన్నయ్. తను ఏదిక్కు లేకుంట దొరగారి గడిలనుంచి సుబద్రమ్మ దొర్సాని తరుముతే ఎటూ ఏ ఆదరువు లేకుంట సచ్చి పొయిన తల్లిని తల్సుకొని తల్సుకొని వాగొడ్డుకు తాడిసెట్టు మొదట్ల కూకుండి ఎక్కెక్కి పడి ఏడుత్తుంటే, బారెడు దొత్తెలు బుజానేసుకొని అచ్చిన రాగిపీసాల నడీడు మనిషి తన పక్కకు కూకుండి, కండ్లనీల్లు తుడిసి, ఖుదరకిచ్చి సెయిబట్టి లేవట్టి "రారా! నర్సిమ్మా! ఏ దిక్కు లేనోనికి దేవుడే దిక్కు- నా కెవలున్నరు- అందరుబోంగ ఇద్దరు బిడ్డలు- ఒకతి పెండ్లయి అత్తగారింటికి పోయింది. సిన్నపోరి మల్లవ్వ, నువ్వు ఉండేరు."

అటెనుక రాగిపీసాల సాంబయ్య తనతోటి మల్లికొంట మెడల పుత్తె కట్టి య్యడం- పెరట్లకు తీసుకపొయి పనులన్ని సెప్పటం- కండ్ల ముంగట మెదిలినయ్.

గ దినం దొర గవిడిబర్రె పొడిసి పంచమ్మీన అర్నెల్లు అటు సావక ఇటు బతుకక- అకరుకు ఇద్దరిని దగ్గెరికి పిలుసుకొని పంచంమీన కూసుండబెట్టుకొని ఇద్దరి

సేతులు కలిపి, నూతిలనుంచి మాట్లాడ్తన్నట్టుగ "నర్సిమ్మం! మీరిద్దరు ఎడ్డిబాపులోల్లే ఎట్ల బతుకుతరో? నీసేతుల బెడ్తన్న- అది సచ్చేటప్పుడు ఇద్దరిని గిట్లనే నా సేతుల బెట్టీ సచ్చింది- పెద్దదాన్ని ఒకయ్య సేతుల బెట్టిన- దాని బతుకది బతుకుతంది- కడుపుకు సచ్చి, ఊళ్ళె సక్కాల దూరంగొట్టి నా రెక్కాల కష్టం గ పెండి మిగిలిచ్చిన- అండ్ల రతునాలే పండిత్తవో? రాల్లే పండిత్తవో నాకెరికలే.... దాన్ని మల్లవ్వకంటె ఎక్కువ సూసుకో. కూడుబెట్టినా కూలగొట్టినా బూదేవరే! దానికోసం నేనెన్ని తిప్పల్లు బడ్డనో పరమేశునికెరుక- అన్ని తిప్పల్లుబడి కాకుల గద్దలనుంచి కాపాడిన- నేను ఎట్లా బల్లితిర్గ కడుసుకొని కాపాడిన్నో! నువ్వు గట్లనే దక్కియ్యాలె- ఆకలితోని సత్తె అండ్లనే సావుంఁడ్రి- బతికితె అండ్లనే బతుకుంఁడ్రి- కని కోమటోని కాడ అప్పులు సేయకుండ్రి- ఇంటన్నవా నర్సింహం-" మూరు మాటబడి కాల్లిదప్పి నడి యూము నాత్రి దనుక ఇప్పిన నోరు ముయ్యకుంట తన బతుకులోని సీకటంతా ఇప్పి సెప్పిండు. ఆకరుకు తెరుసుకున్న కండ్లు తెరిసుండంగనే సెల్లిపోయిండు.

నర్సింహం కండ్లల్ల గుబగుబ నీల్లచ్చినయ్.

ఏదో నిర్నాయం సేసుకొని, ఎవలో గొరగొర ఈడ్సుక పోతన్నట్టుగ రామలింగం లోగింట్లకు నడిసిండు.

రామలింగం సులోచనాలు పెట్టుకొని కాయితాలు ముంగటేసుకొని లెక్కలు గడ్తండు.

"అడ్డీ అసలెంతయిందో సెప్పుంఁడ్రి." నర్సింహం అన్నడు.

"గట్ల దొరికిరావాలె- ఎట్లయినగని అన్నెం పున్నె మెరుగని హరిసంద్ర మారాజ సొంటోనివిరా! మంచోల్లకే కట్టాలత్తయ్- ఇగో! నీ లెక్కాలే సూత్తన్న, నిన్న టమాసకు ఏన్నెల్ల పదియేను దినాలయ్యింది- ఏడు నెల్లెందుకచ్చిన యంటవా? ఇయ్యేడు అదికాషాడమాసమచ్చింది. ఇంటన్నవా? నూటికి నెలకు పదిరూపాలసొప్పున మూడు వేలకు నెలకు మూడునూర్లు- మల్ల గ మూడు నూర్లకు రొండోనెలకు అడ్డెంత? ఇన్నవా? అయ్యోముప్పయేసుకో? ఏడునెల్లకు ఇరువై ఒక్కవంద- పదిహేనుదినాలకు నూటయాబై- అల్లికల్లి సున్నకుసున్న- ఇరువై రెండు నూర్ల యాభైరూపాలు గంప గుత్తనఅడ్డి- నూటికి పదిసొప్పున అడ్డికి మొదటినెల ముప్పయి, రొండోనెల అరువై- అడ్డికడ్డి తొమ్మిదినూర్ల ముప్పయి రెండురూపాలు అడ్డంత ఎంతయింది? మూడువేల ఒకవంద ఎనుబై రూపాలు. అసలెంత? మూడువేలు- వెరసిమొత్తం ఆరువేల ఇన్నూటికి ఎనిమిది తక్కువ, సమఝయ్యిందా? లెక్కకాడ ధోకాలేదు. కాయిదం నీసేతులేత్తగ గౌరయ్య పంతులు తోని మల్ల లెక్కసేపిచ్చుకో-" రామలింగం అడ్డం పెద్దగీత తిరుగులేంది గీసి నర్సింహం మొకం సూసిండు.

"ఇయ్యంగ అయిదు రూపాలే అంటిరిగద అడ్డి?"

"ఏందిరో? నేనవద్దమాడితే అద్ద మవద్ద మాడ్తదా? ఇగో గీ కాయిదం కాశి కలకత్తల సూపెట్టుకో! అంతకు తక్కువుంటే రూపాలు ఒల్లెక్కాలకు ఇడిసిపెడ్త- నీ సేతులతోని నువ్వే దస్కతుపెడ్తివి- మరిసిపోయినావురా? నాకైతే యాదికుంటదా? మనిద్దరిపొత్తుల గీ కాయిదమే ఉండె-" రామలింగం మొకం మాడ్చుకున్నడు.

"సదువ సాత్తరమా షావుకారి? సేతులు గాలినంక అంటేమున్నది?

"గందుకనే నేనియ్య పోర్రా అంటే సుట్టు దిర్గితిరి- లెక్క కాడికత్తే గిట్లం టిరి- కొంటజొంగ సంబురపడి కొంటబోతిరి- పెంకాసు లిచ్చినానురా?" కారెడ్డ మాడిండు.

"మిమ్ముల్నంటేమున్నది? మా మొకం మంచిగలేక అద్దం నేలగొడితేమున్నది? మీరు మంచోల్లే షావుకారి- ఎంతయిన ఇచ్చినోనికిందోడే కొంటబొయినోడు- గిప్పుడు గయ్యన్ననుకుంటేమున్నది- రోల్లె తల బెట్టినంక రోకలిపోట్లకు బయపడితేమున్నది- నిండ మునిగినంక సలెఎక్కడిది షావుకారీ! నోరు పాలీకెక్కుతనంటె నొసలు గొద్దుల గొత్తనంటది- ఎవరినన్నా ఏంలేదు.... ఎవరు సేసే ఇర్తాగం అళ్ళు జేత్తండ్రు- మునిగిపోయేటోల్లం మునిగిపోతన్నం- కిటుకేదున్నదో అంతుపడ్తలేదు షావుకారీ! మీ లెక్కలేవో మీరు సేసిండ్రు- పంతులు గయ్యే గీతలు గీత్తడు. మా గీతలు బాగలేక మీ గీతల నంటేమున్నది- బూదేవరను నమ్ముకుంటే సెడిపోపుర అని జెప్పి సావంగ మా మామ గ పెరడిసెక్క సేతుల బెట్టిపోయిండు- నేను నిచ్చంగనే నమ్ముకున్నా సెడిపోయిన- గ పెరడుకు ఎకురాన ఎంతబెడ్తరో సెప్పుండ్రి."

"నీ కడుపునొప్పి నీది- కాదనను- మనందరి బాదలు సూసెటోడు గ బగవంతుడేరా నర్సిమ్మం."

"అః బగవంతుడు బగవంతుడని గాలికి దీపంబెట్టి దేవుడా నువ్వే కాపాడుమని మొక్కే గీడిదాకచ్చింది- మీ అసొంటోల్లకు బగవంతుడు గని మాకెందుకు షావుకారీ! కానియ్యండ్రి."

"ఎకురాన రెండువేల కంటె గవ్వసుత ఎక్కువ బెట్టవశంగాదు నువ్వు గనుక నాఉదెంల ఇంకోమాటున్నది. పొద్గాలలేత్తే ఒకల మొకం ఒకలం సూసుకునేటోల్లం గన్క- పడుతల్ పడకున్న సూట- సూట డెబ్బయైదు రూపాలిత్త-" అని కొంచెం ముంగటి జరిగి "గీ డెబ్బయైదు మాట ఏడసద్దు. ఇంట్ల దెల్సిందంటే కాడు బందు సేత్తరు" అన్నడు గుసగుసగ.

"మూడువేలసొప్పున తీసుకోండిర్రి- హాలుబర్రెి పోంగ తలుగు కచ్చినాది తాకు లాట...."

"మారే! పడదిర నర్సిమ్మా! ఇగ పడనప్పుడు బేరం జేసెందుకు? నీ మాలుకు నువ్వుదొరవు- ఏడనన్న అమ్ముకొని పైకం ఆరం రోజులకు తెచ్చియ్యిపో- గీ ఆరం రోజుల అడ్డి సుత నేనడుగపో-"

"రెండువేల అయిదు నూర్లకు తీస్కపోండిర్రి" నర్సింహం తెగిచ్చినట్టుగ అన్నడు.

"ఏమే! లచ్చిమీ- నిన్నె ధనలచ్చిమీ! గిట్ల ఈతలికిరా! గీనర్సిమ్మని పెరడి గొంటన్న! రెండువేల మూన్నూర్లకు ఎకురం సొప్పున."

"అదే! పైసలు పుచ్చిపోయినాయయ్యా!" ఇంట్లనుంచే కేకేసింది.

మూడు నూర్లుగాదు అయిదునూర్లు" నర్సింహం.

"ససరాదుర- తప్పదంటవ- సరే! మొకం సూసిన మాట కిందికో మీదికో! మొన్ననేను కొలిపిచ్చిన, మల్లఏమన్న అనుమానముంటె నువ్వు కొలిపిచ్చుకో- సరిగ్గ రెండెకురాల నరున్నది. సడుగు బంటాలు బోంగ."

"............"

"నువ్వన్న దరే కాయమనుకో! అనుకున్నమా! ఆలెక్కన నీ కెంతెత్తయో ఎరకేనా? యాభయెనిమిది రూపాలు- మరిసే పోయినరో కాయిదం కర్సు ఎవడు పెట్టుకోవాలె-"

"షావుకారీ! బూమి సంగతట్లుంచుండిర్రి- నాపెండ్లానికి, బిడ్డకు, నాకు ఎంత దర బెత్తవో సెప్పుండిర్రి- గదానితోని కాయిదం కర్సు కట్టుకోండిర్రి" నర్సింహం మొకమంత ఎర్రగ కాంగ లేసి నిలుసుండి అన్నడు.

"అంతేరా? కొంటబోంగ ఉన్న మంచిమాట- తెచ్చియ్యంగ ఉండదు. కోమ టోడు ముంచిండని అకరికత్తె పెండ్లమాలు దిడ్తరు. ఆడికి కోమటోడు కోటికి పడగ లెత్తిండని ఊల్లోల్లు పరాసికాలాడ్తరు. గరూపాలు ఇప్పుడు నాదగ్గెర లేవుగద? గల్లల మాలంటె పదుంటె సుక్కాల్రాల్తయి?" రామలింగం ఏడుపు మొఖం పెట్టిండు.

"గీ ఊల్లె ఉన్నోల్లందరి సెముటను, సెత్తలను మింగిందా గల్లపెట్టె- అండ్ల రూపాలులేవా?

"ఇగోపటు- గ సాకలోడు ఊరుమీన జమసేసుకున్న ఇత్తుల కిచ్చేటియుండె. వాన్నె అప్పత- తీస్కో.... లెక్క బరాబరి పెట్టుకో- అయింక అంటె మంచిగాదు.

ఇగో గీ కాయిదం మీన ఆరువేల ఇన్నూరు తీసుకున్నట్టుగ రసీదు రాసిన. కాయిదపుమె దన్కా కానిగిరి రశీదు రాసుకున్న."

నర్సింహం ఎడంసేతి బొటమెనేలు ముద్దెర కాయిదం మీన పడ్డది- కూలోని బతుకుల పడ్డనెత్తురు మరకతీర్గ- తలసిరిగిన బాకీ కాయిదం మాత్రిం సేతికచ్చింది.

"ఇగో! మల్లి! జెప్పన ఉరికిరాయే. రూపాలు దెచ్చిన రూపాలు-" ఎదు రుంగచ్చిన మల్లికాంట సేతుల్ల మాసిపోయిన లోట్లు పెట్టి మొకంమీన సేతులు కప్పు కొని పిసుక్కున్నడు. కండ్లల్లనుంచి కార్తున్న నీల్లను ఆపేటందుకు. కని ఎంతాపుకున్న దుఃఖ మాగటంలేదు- గోడుగోడున ఏడ్సుకుంట మంచాల కూలిపోయిండు.

"మల్లీ! మీఅయ్యేరుడం తీరిపోయింది. హరిసెంద్రి మారాజు అలినమ్మ కున్నడు. కని నేను కన్నతల్లినే అమ్ముకున్ననే- ఇన్నవా? నేనమ్ముకున్ననా? ఆల్లే గుంజుకున్నరు. పోసీయ్ భూమి- బతుకు పోసీయ్- ఇంజన, పంట అన్నీపోసీయ్- దొరోడు నాఅంతం కండ్ల జూసిండు. సారీ! అరిగోస పుచ్చుకున్నవ్- అన్నిబోయి నంక ఇంకేం మిగిలింది నాకు గీ రొండు రెక్కలు- సెందర్రిన్నా సిన్నోనివైనా! నీకాల్లకు మొక్కాలారి- నీ బాంచెన్ నాయిన్నా! నువ్వు పాలేరుండనని ఎందుకన్నవో మీఅయ్య ఉన్న కోండర్రిమ్మి మీఅన్నను బొగ్గుబాయిలకు తోలినప్పుడు నువ్వెంత గుంజాటన పడ్డవో? ఎంతేడిసినవో నాకిప్పుడు సమఝయితంది- నీకడుపెందుకు మసులు తందో నీకండ్లెందుకు మండుతన్నయో? తెలిసిందిరా! బిడ్డ! తెలిసింది- అన్ని దారులు గక్కడికే- దొరింటి ముంగటికేనని నువ్వన్నమాట ఎరుకైతందిరా నాతండ్రి! ఎరుకయితంది- మల్లీ! సెందర్రియ్య ఏమన్నడో ఎరుకయితందానే- "సిన్నాయినా? మన మెంత కుక్క ఇస్వాసంతోటి ఆల్ల కాల్లు నాక్కుంట బతికినా, మనసేతికి సివరకు సిప్పె ఇత్తరే- అట్లియ్యకుంటే ఆడు దొరేకాదు- దొర, కుర్సిమీన కాలుమీన కాలేసుకొని కూకుండాల్నంటే- ఆనికి బూములు. బంగులాలు, గుమ్మలుగరిసెలు ఉండాల్నంటే మనకుండద్దు- మనం కూలోల్లయిపోవాలె- కని అందరం ఒక్కటైతే-" నర్సింహం గిట్ల ఏందేదో అంటండు.

"కన్న తల్లసొంటి పెరడ్ని కోమటోని కొమ్మున బెట్టినవ్- మానోల్లల్ల మన్ను బోసినవ్. ఆనింట్ల పీన్గెల్ల- అనిదినాలారాలుగాను, అనింట్ల జెట్టమ్మ కూకుండ- ఆని దినాల కర్సుకు మన పెరడే కావల్సచ్చిందా? ఊరికి కొత్తంగ కరంటచ్చిదని- కడుపు నింద బెత్తదని- జుట్టుపిట్టోలె ఎగురుతివి- ఇంజనకగ్గితల్ల- ఇంజనంట దెత్తివి. అద్దయ్య- గ కరంటు మనదిగాదు అంటె సెవున బెట్టకపోతివి. బక్కల పట్కాని

సత్తవడుత మోట గొట్టుకొని ఇంత గడుకందిలన్న దాగేటోల్లం-" పొయిమీన కుండ బెట్టకుంట నాతరింత గులుగుతనే ఉన్నది. పూడుకపొయిన గొంతుకతోని.

పెండ్లాం పక్క కూకుంది....

"పిస్సదాన- ఇగో! నువు రంది పెట్టుకోకు- నేనయితె ఆనాడే నిర్రింది సేసుకున్న- ఇంకేడిదాక మనెంట బడ్తరోసూత్త- నాకేమనిపిత్తందంటే- అడిదానివి నీకెందుకు-అయేల్ల నా ఒక్కన్నుంచిగాదు. ఇవ్వార్దనుక అడు దెబ్బమీన దెబ్బగొడ్తె మనం దెబ్బదెబ్బకు సచ్చినమ్- ఇన్నావే- మనదెబ్బ సూపెట్టాలే- సెందర్రియ్య ఎప్పుడత్తడో? ఊరూరుకుగియ్యే మాదిగిండ్లున్నయి- ఊరూర్ల గిట్లనే సీత సెరలనుబ గిత్తండ్రు- మనమంత కలువక తప్పదు. కలిసి సేసేది సేయిక తప్పదు- గందుఃనే అంటన్న. నువ్వేం రంది పెట్టుకోకు- మల్లనా తల్లి కడుపుల నుంచి రాము. సచ్చిందో నాడు, పుట్టిందోనాడు- ఇగో! నాకండ్ల ముంగట మవపెరడు మెరుత్తంది- అని బాణ వ్వల్లల దెబ్బలు అయిపోయినమ్. ఇగ నా దెబ్బేమిగిలున్నది. పరశరాముని గొడ్డలి దెబ్బ- మనం ఊల్లోల్ల గల్సినమ్- అందట్ల గలిసింది మంచిదే అయ్యింది. ఏడువకు తూడువకు- మనూల్లె ఇంటింటికీ మంటి పొయ్యేగని మాకు పొయ్యిలేదు. ఇయ్యాల్ల మనంతచ్చింది. నిన్న ఎందరెందరో గిట్ల నాత్రిల్లు ఎక్కెక్కి ఏడ్సిండ్రు- ఎన్ని సూల్లేదు? ఇంకెన్ని సూడాలె? కట్టంల పుట్టినమ్ గ కట్టాలల్ల నుంచే సాపోలె ఈదుక రావాలె- ఇంటన్నావే? పోతదిపోతదని దేని కోసరం గింత కాలం బుగులు పడ్డమో? బుగులుపడి అంగంగి తిర్గినమో? అది పోనేపోయింది-" నర్సింహం అద్దమనాత్రి ఎటో లేసి పోయిండు.

అప్పటికే మాదిగిండ్లల్ల కూడేటోల్లంత కూడిండ్రు- సెప్పేటయిన ఏందో సెప్పుతండు- ఇవ్వార్దనుక తనకెందు కనుకున్నోడు- నర్సింహం ఓపక్కకు మాట పలుకు లేకుంట నిలుసుండి ఇంటాండు. (ఇంకా ఉన్నది)

పునర్జన్మ

— శ్రీమధుర్ జీ

ముక్క వాసన వేస్తున్న కోర్టు గదిలో
కారుచీకటిని కప్పుకున్న న్యాయవాదులు
అంధన్యాయాధికారి మూడుకాళ్ళకుర్చీవెన్ను
చిర్నగవుముఖానికి తగిలించుకున్నచిత్రం
చెదలు పట్టిన చట్టాలమీద
అబద్ధాల అంతులేని వాదనలు
పోలీసు ముద్దాయిల మీద
పోలీసులు నిర్దేశిస్తున్న తీర్పులు
అప్పుడు-
న్యాయం, కోర్టు గదిలో హత్య చేయబడి
ప్రజాహృదయాల్లో పునర్జన్మ యెత్తింది.

(రాజన్ కేసులో అందరూ నిర్దోషులేనని కోర్టు తీర్పు యిచ్చినపుడు)

"మన జైళ్ళల్లో వున్న చాలా మంది అక్కడుండాల్సిన వాళ్ళు కాదు— చాలామంది అక్కడుండాల్సిన వాళ్ళు బయటి ప్రపంచంలో స్వేచ్ఛగా జీవిస్తున్నారు"

'నోరెత్తితే ప్రజలు చట్టాలచే జేలు'

కాని నోరెత్తకున్నా ప్రజలు చట్టం సాలెగూట్లో ఎట్లా యిరుక్కుంటున్నారో జైళ్ళలో సంవత్సరాల తరబడి— శిక్షించ బడడం కూడా కాకుండా— ఎట్లా వుంచబడుతున్నారో జాతీయ పోలీస్ కమీషన్ సభ్యుడు శ్రీ కె. ఎఫ్. రుస్తుంజీ బీహార్‌లోని పాట్నా, ముజఫర్‌పూర్ జైళ్ళపై సమర్పించిన నివేదికలు చెప్తాయి— ఇవి జనవరి 8,9 ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చాయి.

'బీహార్‌లో ఇంకో కొత్తజైలు నిర్మించ బడుతున్నది— కనుక పాట్నా జైలు అనర్హమైందిగా నిర్ణయించబడింది— పాట్నాజైలు ఇకనుండి కొత్తనిధులను వాడుకోవడానికి వీల్లేదు. జైలు శిథిలపరిస్థితి, ఘోరంగావున్న భద్రతా ఏర్పాట్లు, ఇతరసౌకర్యాలు లేకపోవడం జైలు అభివృద్ధికి డబ్బు ఖర్చుపెట్టగూడదన్న కారణంచేత క్షమించబడవచ్చు, ఐతే యింకొక విషయమేమిటంటే కొత్తజైలు నిర్మాణం యింతవరకూ ప్రారంభించబడలేదు, ప్రారంభించబడక పోవచ్చుకూడా. ముజఫర్ పూర్‌లో వున్నజైలు ఎప్పుడో చంపారన్‌లోని నీలిచెట్ల పెంపకం దారులనాడు కట్టినట్టు కనిపిస్తుంది. అప్పుడు గాంధీనాయకత్వంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు పోరుసలిపారు. వారినినాటి ప్రభుత్వం పెంకులతో నిర్మించిన గుడిసెలలో నిర్బంధించింది. ఆగుడిసెలు నేటికీవున్నాయి. ఒకవేళ యిప్పుడు గాంధీజీకాని, రాజేంద్రప్రసాద్‌కాని ఆ గుడిసెలు చూస్తే స్వదేశంలోనే వున్నామా అని అనుమానంలో పడతారని నేననుకుంటున్నాను.

ఈ అన్ని జైళ్ళలోనూ విచారణ జరపబడుతున్నవారి సంఖ్యే ఎక్కువ. పాట్నా జైల్లో 137 గురు శిక్షలుపడ్డ ఖైదీలుండగా 945 మంది విచారణ జరపబడుతున్న నిందితులున్నారు. ముజఫర్ పూర్ జైల్లోవున్న 1, 037 మందిలో 722 గురిపై విచారణ జరుగుతున్నది. వీరిలో అన్నిరకాలవారూ వున్నారు. వీళ్ళలో పందల మంది చెవిటి వాళ్ళు. చట్టం సాలెగూటిలో చిక్కిన అతిమామూలు మనుషులు వీళ్ళు. ఏంజరిగిందో గ్రహించలేనివాళ్ళు, వాళ్ళకు వాళ్ళపై ఏనేరం మోపబడిందో తెలియదు, వాళ్ళెందుకు జైలుకు తీసుకరాబడ్డారో తెలియదు. వాళ్ళకు కాలెండర్ తెలియదు, గడియారం

తెలియదు, కోర్టులోకేసు విచారణ కొచ్చినప్పుడల్లా తీసుకుపోయేదేదీతప్ప. ఈమధ్యనే రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమంలో అరెస్టయి జైలుకొచ్చిన కొందరు విద్యార్థులున్నారు. వాళ్ళిప్పుడు ఉద్యోగాలు కోరడంలేదు— దోమతెరలు, దుప్పట్లు కోరుతున్నారు. కొందరు స్త్రీలుకూడా వున్నారు. ఆశ్రమంపై కొన్ని ఆరోపణలొచ్చి ఆశ్రమం మూసివేయడం జరిగినప్పుడు వీళ్ళను తీసుకొచ్చారు. వీళ్ళను యిప్పుడు 'రక్షక నిర్బంధం' క్రింద జైల్లోవుంచారు. కాని వాళ్ళు ఖచ్చితంగా ఎలాంటి రక్షణా కోరడంలేదు. జైల్లో కన్నీరు కారుస్తూ, యిష్టంలేకుండా పడివున్నారు.

ఇంకా చాలామంది టికెట్ లేకుండా ప్రయాణం చేసినట్టు ఆరోపించబడ్డ వాళ్ళున్నారు. కొందరు చట్టవ్యతిరేకంగా ఆయుధాలు కలిగివున్నారని, కల్తీ మద్యం అమ్మారని, ఇంకాకొన్ని చిన్నచిన్న పనులు— శాంతిభద్రతలకు, చట్టానికి భంగం కలిగించే పనులు— చేశారని ఆరోపించబడ్డారు.

జైల్లో తెలివిగల వర్గం నక్సలైట్లది. వాళ్ళకు వాళ్ళేం కోరుతున్నారో తెలుసు, వాళ్ళవిడుదలకోసం ఆజ్ఞలు జారీ అయినాయనీ తెలుసు— వాటికోసం వాళ్ళు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. వీళ్ళలో చాలామంది ఐదు సంవత్సరాలకు ఎక్కువగా— శిక్షపడకుండానే— జైల్లో గడిపారనేది ప్రతి న్యాయశాస్త్ర విద్యార్థీ ఆలోచించాల్సిన విషయం.

వీటిలోకొన్ని ఆశ్చర్యకరమైన కేసులను నామిత్రుడు జస్టిస్ ఎన్ కె రెడ్డికి నేను చెప్పినప్పుడు భారత రాజ్యాంగం ప్రకారం నడుస్తున్న ఒక రాష్ట్రంలో యిలాంటి విషయాలు జరుగుతాయని ఆయన నమ్మలేదు.

చట్టంతో సంబంధమున్న చాలామంది పెద్దలు పేదలకు న్యాయసహాయం విషయంలో రక్షణ అందజేయాలని అంటుంటారు. ఐతేమీరు ఈ జైళ్ళల్లో ఏఒక్కరైనా వారు ఎలాంటి న్యాయ సహాయంపొందారో అడగండి. వాళ్ళు అలాంటి పథకాలెక్కడున్నాయని మిమ్మల్ని ప్రశ్నిస్తారు— అలాంటి సహాయం అందించే వ్యక్తులెవరని మిమ్మల్ని సూటిగా అడుతారు. నిజానికి యావత్ న్యాయ సహాయాన్ని పొందవలసిన వీరు చట్టానికి కఠినతతప్ప ఏమీలేదని భావిస్తున్నారు. దానికి కనికరం అసలేలేదని వారనుకుంటున్నారు. ఒక్కొక్కజైలుకు ఒక్కొక్క మంచి వాదనాపటిమగల న్యాయవాది వుంటే ఈ హంతకవ్యవస్థ వేసిన పథకాలన్నీ విప్పిచెప్పగలడు.

బీహార్ రాష్ట్రంలోని దుర్మార్గతకు అక్కడ పిల్లలకు సంబంధించిన నేరాలకు ఒక ప్రత్యేక చట్టం లేకపోవడం ఒకనిదర్శనం. పిల్లలు కూడా పెద్దలలాగా చూడబడతారు.

భారతదేశం అంతర్జాతీయ సంస్థలకి ఎన్నోసార్లు బాలల చట్టాల అమలుకు, బాలల పట్ల ఆదరణకి పూనుకుంటానని చెప్పింది. చాలాసార్లు పాట్నాలో బాలనేరస్తుల చట్టానే ర్పరిచే ముసాయిదా తయారు చేయబడింది. కాని మంత్రివర్గం తరువాత మంత్రివర్గం మారినాకొద్దీ ఆముసాయిదా అడుక్కుపోవడం మొదలు పెట్టింది. యిప్పుడు 25 సంవత్సరాలు ఆలస్యంగా ఒక ఆర్డినెన్స్ ద్వారా అది ప్రకటించ బడవలసివున్నది. ఇది పిల్లలారా నాదగ్గరకొచ్చేవరకు బాధలు సహించండి (ఒకబైబిల్‌సూక్తి: suffer little children to come unto me) కాదు– పిల్లలు నాదగ్గరికి బాధ పడడానికొచ్చారు.

నేనుకింద కొన్ని కేసులు ఉదాహరణకు వివరిస్తాను. అవి పూర్తి సమాచారాన్ని కలిగి వుండకపోవచ్చు, ఐనామనం వాటిలోకి చూడాలి. ఎందువల్లనంటే నేరం, శాంతి భద్రతలపై వాటి ప్రభావం మెచ్చుకోదగింది. నేను నొక్కి చెప్పేదేమిటంటే ప్రతివిషయమూ న్యాయస్థానాల కాగితాలలో సరిచూడాలి, నేనవి చూడలేదు. నేను జైలు కాగితాలు మాత్రమే చూశాను: పాట్నా, ముజఫర్ పూర్‌లలో జైలు, పోలీసు అధికారులతో మాట్లాడాను. ముజఫర్ పూర్‌లో జిల్లా మెజిస్ట్రేట్‌తోకూడా మాట్లాడాను.

1. హుసెనారా ఖతూన్: ఏడేళ్ళ కింద తూర్పు పాకిస్తాన్‌లో యాహ్యాఖాన్ సైన్యాలు వీరవిహారం చేసినపుడు ఈమె తన కుటుంబంతోసహా తప్పించుకొనివచ్చింది. పోలీసులు అరెస్టుచేసి 'రక్షక నిర్బంధం'లో వుంచారు. ఆమె తన దగ్గర ఒక చింపుల కాగితం వుంచుకున్నది. అది చినిగిపోతున్న జైలు టికెట్. అదొక్కటే ఆమెను తోసివేయకుండా వుండడానికి, శాశ్వత ఖైదు కాకుండా వుండడానికి రక్షగా వున్నది. బంగ్లాదేశ్‌నించి వస్తూ విదేశస్తుల చట్టంకింద నిర్బంధించబడిన అందర్నీ విడుదలచేయాలని ప్రభుత్వం ఆజ్ఞలు జారీచేసింది. కానీ ఆమె జైల్లో నాలుగు సంవత్సరాలు గడిపింది– ఆమె శుభ్రంగా కనబడుతున్నది– జైలుకు సరిపోయినట్టుగా వున్నది. ఆమె 'రక్షక నిర్బంధం'లో వుండి వెనుకకుపోవాలని ఎందుకనుకుంటున్నదని అందరూ అనుకోవచ్చు– ఆ విషయం ఆమెనే అడగాలి.

2. ఉషాకుమారి: పది సంవత్సరాల వయసని చెప్పింది– నాకామె ఏడెనిమిదేళ్ళ అమ్మాయిలాగా కనబడింది. ఎట్లాగైనా ఆమె మిగిలిన స్త్రీ ఖైదీల ఆకారంలో సగం ఆకారంతో వుంది. ఐతే మిగిలిన స్త్రీ ఖైదీలందరూ పొట్టివాళ్ళే. ఆమె ఒక సినిమాహాలు దగ్గర గొలుసు దొంగిలించిందనే ఆరోపణమీద అరెస్ట్ చేయబడింది.

3. రీనాకుమారి: ఈమె బర్ద్వాన్‌కి చెందిన బాలిక. ఈమె విషయం ఏం జరిగిందో సరిగా తెలియడంలేదు. ఆమెపై ఏ ఆరోపణవున్నదో ఆమెకు తెలియదు.

కాని ఆమె ఏ కేసులోనో కోరబడుతున్నది. ఈమె 1976 లో అరెస్ట్ చేయబడి ఒక 'రక్షక గృహాని'కి (Protection Home) పంపబడింది. ఆ రక్షక గృహం మూసి వేయడంవల్ల After Care Home కు పంపబడింది. ఆమె తప్పిపోయిన స్త్రీ కావడంవల్ల ఆమెకొక స్వంత యిల్లు లేకపోవడంవల్ల అక్కడ్నుంచి జైలుకు పంప బడింది. ఆమె న్యాయరక్షణ లేకుండా వదిలివేయబడిన ఒక బాలిక- కాదు ఒక శిశువు. ఆమె తనకు సహాయం చేసే వారెవరూ లేకపోయినా, ఎలా పోరాడాలో తెలియకపో యినా ఈ గుడ్డివ్యవస్థతో పోరాటం సాగిస్తున్నది. ఆమె మూడుసార్లు కోర్టుకు పంప బడింది. కాని ఆ మూడుసార్లూ కోర్టుకు ఆమెను చూచేందుకు వ్యవధే దొరకలేదు.

4. ఇందిరాకుమారి: ఈమె మూడు సంవత్సరాల పదినెలలు ఆశ్రమంలో గడి పింది. ఆమెకు తన కేసు కోర్టులో విచారణకు త్వరలోనే వస్తుందని ఒక తీరని ఆశ వుంది. ప్రతిసారీ ఆమె కోర్టుకు పోతుంది. కేసు పూర్వం ఎక్కడవుందో అక్కడే వుంటుంది. ఇక్కడ నిజమైన యిబ్బంది ఏమిటంటే ఆమెలాంటి స్త్రీలు 'హృదయ పరివర్తన' కలిగిందని ఎలాంటి నాటకీయ ప్రయత్నమూ చేయరు. కాని అనాలోచి తంగా మహాత్ముని విగ్రహానికి నమస్కరించడమూ, తుపాకీ విసిరేయడమూ చేస్తారు. యీ సమయంలో మధ్యవర్తులకు ఒక మంచి ఫోటో దొరుకుతుంది. వాళ్ళు ఒక నూతన జీవితాన్ని ప్రారంభించినట్టు చెప్పబడతారు- పూలదండలు వేయబడతాయి. కానీ ఈమెకు విసిరేయడానికి ఒక తుపాకీ లేనేలేదు. నిజానికి ఆమె అహింసకు ప్రతిరూపం- ఆమె భర్త చనిపోయాడు.

5. రాంసాగర్‌మిస్త్రీ: ఇతను దోపిడీ నేరం ఆరోపించబడి 1969 లో అరెస్టు చేయబడ్డాడు. 1971 లో సెషన్స్‌కోర్టులో హాజరు పరచబడ్డాడు. ఇప్పటికి అతను తొమ్మిదిన్నర సంవత్సరాలు నిర్బంధంలో వున్నప్పటికీ సెషన్స్‌కోర్టు విచారణ ప్రారంభం కాలేదు. ఆయనకు జరిగిన అన్యాయాన్ని పక్కకుంచితే అసలు కోర్టులో ఆకేసేమయింది? సాక్షులు ఎక్కడ వున్నారు? కేసు విచారించిన సబ్- యినస్పెక్టర్ నెక్కడ దొరక బడతారు? ఒకవేళ దొరకబట్టగలిగినా ఆ సబ్‌యినస్పెక్టర్ కేస్‌డైరీని గుర్తించ గల స్థితిలో వుంటాడా? లేక ఈకేసు జ్ఞాపకముంచు కుంటాడా? ఒకవేళ అతను రిటైరై వుంటే కోర్టువారిచ్చే కొద్దిపాటి భత్యమ్మీద యింతదూరం వచ్చిసాక్ష్యం యివ్వడానికి సంసిద్ధంగా వుంటాడా?

6. ఘనశ్యామ్‌మెహతా: ఈయన పదకొండు సంవత్సరాల క్రింద అరెస్టు చేయ బడ్డాడు. ఆయన తనెంతకాలం జైల్లో గడిపాడో కూడా జ్ఞాపకంలేనంతగా మారాడంటే

జైలుజీవితం ఆయన మెదడును ఎంత మొద్దుబార్చిందో అర్థం చేసుకోవచ్చు. అయన సెషన్స్‌కోర్టులో కూడా హాజరు పర్చబడలేదు. అయన లైంగిక వాంఛలకు తట్టుకోలేక దుస్సాహసికంగా తన మూత్రమార్గంలో ఒక గొట్టాన్ని దూర్చుకున్నాడు. అప్పుడు చనిపోయే పరిస్థితిలో ఆస్పత్రికి తీసుకపోబడ్డాడు. ఆస్పత్రిలో ఆగొట్టం తీసివేశారు. కొన్ని రోజులకు ఆయన స్పృహలోకి వచ్చింతర్వాత మొట్టమొదట 'యురేనియం' అని గుణిగాడు. వెంటనే ఆయనపై ఎన్నో అనుమానాలు పొడసూపినయి. స్మగ్లరా? విదేశీ గూఢచారా? ఆగొట్టం యురేనియం కలిగి వుందేమో పరిశీలించడానికై అణుశక్తి సంస్థకు పంపబడింది. మన హంతక వ్యవస్థచే సగం పిచ్చివాడుగా మార్చబడ్డ ఘనశ్యామ్‌మెహతా కొన్ని సంవత్సరాల తరబడి పరిశోధకులు కనుక్కోలేక పోతున్న అణు అపదలను గురించిన పరిశోధనా మార్గంలో తప్పిపోయాడు.

7. భోలామెహతా: అతని జైలుటికట్ అతను భారతశిక్షాస్మృతి 363, 378 చట్టాల ప్రకారం అరెస్టు చేయబడ్డట్టు చెప్తుంది. ఆయన ఎంతకాలం క్రింద జైలు కొచ్చాడో జ్ఞాపకంలేదు. బహుశా తొమ్మిది సంవత్సరాలయించేమో, పదమూడు సంవత్సరాలు కూడాకావచ్చు. ఆయనకు సంవత్సరాలు లెక్కపెట్టుకోవడం తెలియదు. ఆరుసంవత్సరాల నుంచి ఆయనను ఏ హత్యకేసులో యిరికిస్తారో తెలియడం లేదు. ఆయన ఫైలు గుర్తుపట్టడానికి వీల్లేకుండావున్నది. ఈమధ్యలో ఆయన తన భార్యనూ, కొడుకునూ పోగొట్టుకున్నాడు. ఆయనకు బంధువులు లేరు. ఒక విచిత్రమైన పద్ధతిలో ఆయనజైలు జీవితానికి అలవాటు పడ్డాడు. 'ఏం జరగాల్సున్నదో అది జరుగుతుంది- మనిషి విధి అనే సాలెగూట్లో నిష్ఫలమైన పోరాటం జరుపుతాడు.'

ఇంతవరకు జైలు అధికారులచే యితను తప్పిపోయిన వ్యక్తిగా కనబడుతున్నాడని జిల్లాజడ్జికి నాలుగు ఉత్తరాలు రాయబడినాయి. ఇకఏంచేయాలి? ఆఖరి ఉత్తరం అతను ఆలస్యం కారణంగా పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని తెల్పింది. ఆయన తన ఫైలు దొరకబట్టకపోతే నిరాహారదీక్షకు పూనుకుంటానని హెచ్చరించాడు. కనుక ఆయనను నిశ్శబ్దంగా వుంచడానికి ఎంతో శ్రమించాలని ఆఉత్తరం తెల్పింది. దీనికి జవాబుగా జిల్లాజడ్జి కార్యాలయం నుంచి ఆయనను ఒక రోజున కోర్టుకుపిలుస్తామని జవాబొచ్చింది ఆయన కోర్టుకు తీసుకపోబడ్డాడు. కానీ జడ్జి ఆయనను చూడనేలేదు. ఏమైనా చినిగిపోతున్న ఆయన డాక్యుమెంట్ మీద యింకో సంతకమూ, ఇంకో తేదీ వేయబడ్డాయి. ఇట్లా ఖైదీ తననేరం గురించి వెతుక్కోవడంలాంటి వింతైన పరిస్థితిని ఫ్రాంజ్ కాఫ్కా సృష్టించాడా?

8. బబ్లూరాజ్(నక్సలైట్): హత్యానేరంపై అరెస్ట్‌చేయబడి 1971 లో జైలుకు పంపబడ్డాడు. ఇంతవరకు ఛార్జిషీట్ కూడా సమర్పించబడకుండా ఆయన ఏడేళ్ళు జైల్లోగడిపాడు. పాట్నా హైకోర్టు ఆయన పెట్టుకున్న హెబియస్‌కార్పస్ దరఖాస్తును తిరస్కరించింది. ప్రభుత్వం నక్సలైట్లపై కేసులు ఉపసంహరించుకున్నప్పటికీ ఈయన బెంగాల్ కేసుల్లో అవసరమౌతాడు కాబట్టి ఇంకా చాలారోజులే జైల్లోగడపాల్సి వస్తుందనుకోవచ్చు. చట్టబద్ధ అనుమతి లేకుండా ఒక వ్యక్తిని ఎంత సులభంగా నిర్బంధంలో వుంచవచ్చో ఈయన కేసు తెలుపుతుంది. మీసా, కోఫపోసా (MISA, COFEPOSA) ల అవసరమే లేదు. ఇంకేవిధంగానైనా నటించవలసిన అవసరమూ లేదు- ఒక వ్యక్తిని జైల్లో పెట్టొచ్చు- విచారణలో వున్నాడని చెప్పొచ్చు.

9. హరిలాల్‌మిస్త్రీ: ఇంకొకరిని అనుకరించాడన్న నేరంపై అరెస్టు చేయబడ్డాడు. ఆయన ఒక సాధువుగా మారాడు. తను జైల్లో ఎంతో సంతోషంగా వున్నానని చెప్పాడు- బాగా తింటున్నానని, తన గురించి మంచి శ్రద్ధతీసుకుంటున్నారని చెప్పాడు- ఆయన ఖైదీల ఆధ్యాత్మిక అవసరాలు తీరుస్తున్నాడు- అవతల ఆయన కోసం ఎదురుచూసే వారెవరూలేరు. అయన పాట్నా జైలుకు కౌంట్‌ఆఫ్ మౌంట్ క్రిస్టోలో కౌంట్ లాగాకనిపిస్తాడు.

ఇవి పాట్నా జైలులో విచారణలో వున్నవారిలో కొందరి యదార్థ విషయాలు. చట్టం పోలీస్ విచారణ నిర్ణీతకాలంలో పూర్తికావాలని చెప్తుంది కాని ఆలస్యం జరుగుతూనే వుంటుంది. కాని కేసు విచారణ కొచ్చేముందు ఆ వ్యక్తిని ఎంతకాలం నిర్బంధంలో వుంచే విషయంకానీ, కేసు ఎంతకాలం నడిచే విషయం కానీ ఏ చట్టమూ నిర్దుష్టంగా చెప్పలేదు.

దొంగతనం ఆరోపించబడ్డ చాలామంది మూడు నుంచి ఆరు నెలల నిర్బంధం ముగియగానే విడుదల కావాల్సింది కానీ వాళ్ళు జైళ్ళలోనే వుంటున్నారు. వారిలో ఒకతను టికెట్‌లేకుండా ప్రయాణించినందుకు రు. 11-50 పై. అపరాధపన్ను కట్టాల్సింది కానీ ఆడబ్బు ఆయన దగ్గర లేకపోయినందువల్ల ఎన్నోనెలలు జైల్లోగడిపాడు వారిలో చాలామంది పశ్చాత్తాప పడుతున్నారు. వారిలో చాలామంది ఒక క్రమశిక్షణా పద్ధతిలో కోర్టుకు హాజరై ఇకముందు నేరం చేయబోమని ప్రతిజ్ఞానేందుకు సిద్ధంగా వున్నారు. కాని యిక్కడ అసలైన యిబ్బంది ఏమిటంటే కోర్టుకెట్లా హాజరుకావాలి? న్యాయ దాతలచే వీళ్ళెట్లా గుర్తించబడతారు? ఈపని ఒక కోర్టుగుమాస్తా చేస్తాడు. ఒక్కొక్కన్యాయాధికారి 1200 కేసులు చూస్తాడు. కొందరు 1800 చూసేవాళ్ళు

కూడావున్నారు. వాళ్ళకు ఈ ప్రజల్ని చూసేవ్యవధే వుండదు. 'పో, తర్వాత' అనేదే మన వ్యవస్థ వాళ్ళకిచ్చేజవాబు.

'నువు జైల్లో మొట్టమొదటి స్థానంలో వుండడానికే తగివున్నావు.'

ముజఫర్‌పూర్ జైల్లోవున్న వెయ్యిమందిలో డెబ్బైశాతం విచారణ జరపబడు తున్నవారే. ఈ జైల్లోవున్న పరిస్థితిని కిక్కిరిసి వుండడం అంటే పరిస్థితిని తగ్గించి చెప్పడమే అవుతుంది. వీళ్ళల్లో 42 మంది ఐదేళ్ళకుపైగా సెషన్స్ విచారణ ఎప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూస్తున్నారు. ఇక్కడ కొన్ని కేసులు ఉదహరిస్తాను.

గుల్షన్‌రాయ్, రామ్‌స్వరూప్‌సాహ్ని: వీళ్ళు 10 సంవత్సరాల నించి జైల్లో వున్నారు. వీరినిప్పుడు విడుదలచేస్తే అదురు పాటుతో బహుశా చనిపోవచ్చు. ఒక వృద్ధునికి పదేళ్ళు ఒకచోట గడిపి అప్పుడు యింకోచోట నూతన జీవనం ప్రారంభించా లంటే మామూలు విషయంకాదు.

అనుచిత్‌భగత్: ఈయన పదిసంవత్సరాల క్రితం ఆయుధాల చట్టంకింద అరెస్టు చేయబడ్డాడు. సెషన్స్‌కోర్టులో ఇంకాకేసు విచారణ ప్రారంభించబడలేదు. ఆయన విధిని దాచుకున్న చినిగిపోతున్న కాగితం నరకంలోని ఒకరాక్షసుడు తయారుచేసిన రాశిఫలంలాగా కనిపిస్తుంది. ఈ కేసులో నేరపరిశోధక వైద్యనిపుణుడిచ్చే నివేదిక రావాల్సివుంది. ఆయన ఫిర్యాదు చేయలేక పోవడమేకాక ఇప్పటికి పది సంవత్సరాలు జైల్లోవున్నాడు.

లాల్జీపాండే: ఈయన పదిసంవత్సరాల నించి జైల్లోవున్నాడు. ఈయన ఎవరిని ఎత్తుకుపోయాడన్న ఆరోపణమీద నిర్బంధించబడ్డాడో ఆ అమ్మాయి ఈజైల్లోనేవుంది. ఇప్పుడు ఈయన ఆమెను వివాహం చేసుకోవాలను కుంటున్నాడు. అతను ఆమెను రహస్యంగా కలుస్తున్నాడు కూడా. కొన్ని ప్రేమమయమైన మాటలూ, ఆజైలుచీకట్లో ఒక నిమిషమూ పొందడానికి అతడు రోజూ ఆమెకు అన్నంపట్టుకపోతున్నడు. ఆమె కూడా వివాహనికి ఒప్పుకున్నది. కానీ చట్టం క్రింద ఇలాంటి పరిస్థితికి అవకాశం ఎక్కడ దొరుకుతుంది? దానికి మీకొక హిందీ సినిమాలో ఐతే వీలుంటుంది.

మూగ్రిమూస్మాకొయిరీ: ఈమె హత్యాప్రయత్న నేరంపై తొమ్మిది సంవత్స రాలుగా జైలులో గడుపుతున్న వృద్ధస్త్రీ. ఏడేళ్ళపాటు ఆమె చిన్నకొడుకు ఆమెతో కలిసివుండి తన పదమూడోఏట చనిపోయాడు. నేనామెను చూసినప్పుడు ప్రభుత్వం యింతహీనస్థితిలోవున్న ఆమెను అట్లా ఎందుకు నిందిస్తుందా అని ఆశ్చర్యపోయాను.

ఒకవ్యక్తి తనకేసు విచారణకు ఎదురుచూస్తూ అంతవిషమ పరిస్థితిలో తొమ్మిదేళ్ళు ఎందుకు నిరీక్షించాలి? ఆమె లాంటి వృద్ధస్త్రీ వ్యక్తిగత పూచీపై విడుదలైతే శాంతి భద్రతలకు ఏంపెద్ద భంగం వస్తుందని పోలీసులు భావిస్తున్నారు?

జానకీదేవి: ఈమె భీతిచెందినట్లుగా, సిగ్గుగా, నిరాశగా కనిపిస్తుంది. ఆమె ఒక శిశుహత్యకేసులో విచారించబడుతున్నది. ఆమె గ్రామస్తులు తనకు వ్యతిరేకంగా సాక్ష్యం యివ్వడానికి కుట్రపన్నారని అంటున్నది. ఆమెకు ఒక కొడుకున్నాడు. ఆకొడుకు తన జీవితమంతా జైల్లోనే గడిపాడు. ఆ అబ్బాయి బయటి ప్రపంచాన్ని చూడలేకపోయాడు. ఆ అబ్బాయి ఈ భూమియొక్క దురదృష్ట వంతమైన పౌరుడు. ఆ తల్లీ కొడుకుల విషాదాన్ని ఎట్లాపునర్నిర్మించగలరు? ఏంజరిగిందో ఎవరు వెనక్కి తిరిగిచూస్తారు? ఆమె ఒకవేళ బలాత్కరింపబడిందేమో? తననవమాన పర్చినవ్యక్తి కొడుకును పెంచడానికి యిష్టపడలేదేమో? ఒకవేళ ఆమెనే వ్యక్తైనా కోరాదేమో? ఆమె తన కులంచేత- చమర్ కులం- పోలీసురక్షణకు అనర్హమైందిగా భావించ బడింది కాబోలు. తన కొడుకును చంపుకున్నదని ఆరోపించబడ్డ ఒకస్త్రీకి ఏడేళ్ళ బాధ దుఃఖంతో కూడిన ఒకదీర్ఘకాలం- ఆమెను ఏపూచీకత్తులేకుండా, ఏదస్తావేజు లేకుండా మామూలుగా జీవించడానికి వదిలితే ఈవ్యవస్థకు ఏం నష్టం సంభవిస్తుంది?

ఇత్వారియా అహిర్: ఈస్త్రీ తనకేంజరిగిందో చెప్పలేకపోతున్నది- ఏదో ఒక పెద్ద బరువు ఆమెకు తాకినట్టుగా, ఏంచేయాలో తెలియనట్టుగా అది ఎందుకు జరిగిందో తెలియనట్టుగా కనిపిస్తుంది. ఆమెపై ఏఆరోపణవున్నదో జైలు అధికారులకు కూడా తెలియదు- పోలీసులు ఒక సందిగ్ధమైన వివరణ యివ్వగలుగుతున్నారు. ఆమె భారత హంతక శిక్షాస్మృతి 171 క్రింద జైలుకు పంపబడింది. ఆమె ఒక కేసులో సాక్ష్యం చెప్పడానికి ఒప్పుదల పత్రం రాసివ్వనందుకు, ఒక పూచీకత్తు రాసివ్వనందుకు జైల్లో ఐదుసంవత్సరాలు గడిపింది. ఓదైవమా! ఇందుకేనా?- కానీ యిక్కడ దైవంప్రసక్తి ఎందుకు? ఆయన యిలాంటి మనుషుల్ని మరిచిపోయాడు. ఇమెకు జైల్లోపుట్టిన ఒక నాలుగేళ్ళ అమాయక, అందాల పాపవుంది. ఏంచేసిందని ఆపాపకు మనం యిలాంటి శిక్షవేశాం? ఒకవేళ ఆపాపను బయట దత్తుకిచ్చినా ఆపాప తన తల్లికి ఒక న్యాయవాదిని చూపెట్టేదేమో!

బీహార్ బెంగాల్ రాష్ట్రాల్లో బలాత్కరింపబడ్డామని, చెరచబడ్డామని ఫిర్యాదు చేసిన యువతులే జైల్లో వున్నారు. వారు జైల్లో వున్నకారణం సాక్ష్యమివ్వడానికి సులభంగా దొరుకుతారని. న్యాయం ఎంత విపరీతమైన పద్ధతిలోవుంది!

రామ్‌దీన్‌సింగ్: ఈయన తనపై మోసం, అనుకరణ ఆరోపణల గురించి విచారణ కెదురు చూస్తూ ఏడేళ్ళుగా జైల్లో గడుపుతున్నాడు. ఆయన తను నిర్బంధించ బడ్డప్పుడు తను ప్రయాణిస్తున్న ట్రక్‌లో కొన్ని నేరం ఆరోపించదగిన కాగితాలున్నా యని ఒప్పుకుంటున్నాడు. ఈయన విషయంలో ఆలస్యం చేతివ్రాత నిపుణులవల్ల జరుగుతున్నది. ఒకవేపు ఈఅభాగ్యజీవి ఏడేళ్ళుజైల్లో గడిపితే ఇంకోవేపు గణించడానికి ఒక జీవితకాలమంతా తీసుకునే ఊహించలేనటువంటి మోసాలు, ప్రభుత్వ సంస్థలచే కోట్లాది రూపాయల మోసాలు జరుగుతున్నాయి. ఐతేయివన్నీచేసే ప్రజలు అపతల డబ్బుతో అనుభవించగల సుఖాలన్నీ అనుభవిస్తున్నారు.

'రామ్‌దీన్ ! నువ్వుతిరిగి సంపాదించుకోలేని అమాయకుడివి' అని నేనాయనతో అనదల్చుకున్నాను. 'నీకన్యాయం జరిగిందని కూడా గమనించలేని అమాయకుడివి'

దేవకాళి; ఒకపార్సీ బాలిక. ఐదేళ్ళ క్రితం దోపిడీ నేరం క్రింద అరెస్టయింది. ఇంత బిడియపు, కేసుతో తన సంబంధం గురించి ప్రశ్నిస్తే కళ్ళనీళ్ళతో చూసే ఈ నిరుపేద బాలిక ఒకదోపిడీ చేసిందా అనేది ఊహించవలసిన, రుజువు పర్చబడవలసిన విషయమే. ఆమెకులం ఆమెకు వ్యతిరేకంగా పనిచేసిందని, ఆమె తండ్రికీ అన్న లకూ వ్యతిరేకులైనవాళ్ళు ఆమెను జైలుకు పంపారనుకోవచ్చు. ఆ కేసేమయినా కావచ్చు గాని, జైల్లోఎందుకు వున్నదో చెప్పలేని, ఘనత వహించిన న్యాయం పొంద డానికి దారులేవో తెలియని, దోపిడీదారుగా చెప్పబడుతున్న, భీతితో, సిగ్గుతోవున్న ఆ బాలిక నాపైప్రసరించిన దృక్కులను మరిచిపోలేను. నేనామెను చూసినప్పట్నుంచి ఆమె కళ్ళు నన్ను వేటాడుతున్నాయి. ఆమె చిన్నబోయినట్టుగా వెళ్ళిపోతుంటే దుఃఖంతో 'నన్నుక్షమించు' అన్నాను 'నేన్నీకేమీ చేయలేను.'

పూనమ్: ఈ బాలిక ఐదేళ్ళుగా రక్షిత నిర్బంధంలో వున్నది– ఈమె సేంట్ పాల్ బలిపశువుల్లో ఒకామెలాగా కనిపిస్తున్నది– మనం అవినీతి వర్తక వ్యతిరేకచట్టం కింద బాలికలను రక్షించడానికి తీసుకున్నచర్య అవినీతికరమైందని చెప్పడానికి ఎలాంటి సంశయమూ అక్కర్లేదు. ఈ విషయంలో మనం ఆంగ్లేయుల కపట నీతినే అనుస రిస్తున్నట్టు కనిపిస్తున్నది. బ్రిటన్‌లో కేంద్రమంత్రి నుండి వీధులూడ్చే మనిషిదాకా స్త్రీలను ఒక పద్ధతిలో వాడుకుంటారు. అందుకు డబ్బు చెల్లిస్తారు. కాని వ్యభిచారం పట్ల వాళ్ళప్రవర్తన కొచ్చేసరికి ఒక్క ఘనమైన జాతినీ పట్టలేం. వాళ్ళు వాళ్ళ ఆలోచనలో అంతపవిత్రులు. వాళ్ళవీధులు శుభ్రంగా వుంచుకోవాలనే కోరికలో వాళ్ళంత ప్రసిద్ధులు. వాళ్ళు వదులుకునే, శుద్ధిచేసుకునే శక్తిలో అంతనీతి మంతులు

వాళ్ళను వాళ్ళే అమ్ముకునే స్త్రీలను శిక్షించడమంటే వాళ్ళకంత యిష్టం. పూనమ్‌లాగా, ముజఫర్‌పూర్ పాట్నాల్లోనేగాదు దేశమంతటా పొరపాటుబడ్డ పరిస్థితులకు బలిఐనస్త్రీలెంతమందో? ఒకబాలికను జైల్లోఐదేళ్ళు పెట్టడమూ ఆమె రక్షిత నిర్బంధంలో వున్నదని చెప్పడమూ ఎంత సులభం! మనం ఇదే పద్ధతిని లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం, చట్టవిరుద్ధ రాజకీయ జోక్యం నేరాలు ఆరోపించబడ్డ వారిపట్ల అమలు పర్చలేమా?

నేను అవిరామంగా ఎందరిగురించో చెప్తూపోగలను– రహమాన్‌మియా, వివేకానందరాయ్, జోగేందర్‌రాయ్, మొహిందర్‌సాహా, అచ్యుకుమార్‌సింగ్, హుసేన్‌మొహమద్, జీనత్....

నేనుజైల్లో భారత హంతకశిక్షాస్మృతి 109 కింద నిర్బంధించబడ్డ ఏబయి మంది కేసులు చెప్పనేలేదు. వాళ్ళల్లో కొందరు ఇంకా దేశంపై తిరుగుతున్న కుర్రవాళ్ళలాగా కనబడ్డారు. పాఠశాల నుంచి అప్పుడే వదలబడి, ఒక నిర్దిష్టమైన సంఖ్యలో కేసులు పెట్టబడాలి కనుక చట్టం చక్రంలో చిక్కుకున్నారు. నేను నేరస్తులైన బాలల గురించి మాట్లాడడంలేదు. ఈ స్థితిలో వాళ్ళగురించి చెప్పాల్సిన అవసరం లేదు.

తర్వాత ఎనిమిదేళ్ళనుంచి విచారణ జరపబడుతున్న కృష్ణదేవ్‌ఝా నాయకత్వంలోవున్న నక్సలైట్లున్నారు. ఇంకాచాలా మంది ఐదునుంచి ఏడేళ్ళుగా విచారణక్రింద మగ్గుతున్నారు. వీళ్ళల్లో ఒక హోమియోపతీ డాక్టర్ కూడా వున్నాడు. కేసులు ఉపసంహరించబడ్డాయని, వీళ్ళవిడుదలకై ఆజ్ఞలు జారీ అయినాయని అనుకుంటున్నారు.

కోర్టు ఆవరణలో వుండే ఒక చిన్నగది 'హజత్.' దీన్ని ఖైదీలను కోర్టులో హాజరు పరిచేముందు వుంచడానికి వుపయోగిస్తారు. దీని పరిస్థితి గురించి చాలామంది ఖైదీలుఫిర్యాదు చేశారు. నేను జిల్లామెజిస్ట్రేట్‌తోనూ, పోలీస్ సూపరింటెండెంట్‌తోనూ కలిసి ఈగది చూడడానికి వెళ్ళాను. ఒక అతిపెద్ద భవనంలోని ఒక అతి చిన్నగది విచారణలోవున్న ఖైదీలకు ఉద్దేశించబడింది. అది పదిహేనడుగుల పొడవూ పదడుగుల వెడల్పూగల ఒకగది. దాంట్లోనే కంపుగొడుతున్న మరుగుదొడ్డి కూడా వుంది. ప్రతి రోజూ ఒకఖైదీల గుంపును– కాదు ఖైదీలమందను– ఆ గదిలోకితోలుతారు. నేను వాళ్ళ దగ్గర్నించి పోతున్నప్పుడు వాళ్ళల్లో ఒకాయన ఆవేశంగా 'మేం కూడా మనుషులమే ఈమరుగుదొడ్డి చూడండి– ఈ మందను లోపల తోలడం చూడండి' అన్నాడు.

నేనాయనతో "మీరు మనుషులని ఎవరన్నారు? మీరు విచారణలో వున్నారని చెప్పబడుతున్న నిశ్చయించబడని హంతకులు మాత్రమే. ఈ దేశం మీరు శ్రద్ధ

చూపగలవారని అనుకోవడంలేదు. ఇంకా చాలా పనులున్నాయి–" అని అందామను కున్నాను.

నేను దుఃఖపడ్డాను– ఆవేశపడ్డాను.

మానవుడు మానవులకు ద్రోహం చేశాడు. ఒకవేళ అధికారంలోవున్న ఏమని షైనా కంపుగొడుతున్న ఆ నరకాన్ని చూసినట్టయితే వెంటనే దీన్ని ఆనుకొనివున్న తుప్పుపట్టిన, అమ్మడమో పారేయడమో చేయాల్సిన సైకిళ్ళతో నిండివున్న రెండు గదులను గమనించేవాడు. వాటిపని పూర్తి చేసి ఆ గదులను మనుషులకిస్తే బొంబాయి లోకల్‌లో నిలబడ్డట్టు రోజంతా నిలబడి, కక్కుకోకుండా నిరీక్షించగలరు.

నేను చివరకు ఒక అభిప్రాయానికొచ్చాను– "మన జైళ్ళలోవున్న చాలా మంది అక్కడుండాల్సినవాళ్ళు కాదు– చాలామంది అక్కడుండాల్సినవాళ్ళు బయటి ప్రపంచంలో స్వేచ్ఛగా జీవిస్తున్నారు."

బీహార్‌లో ప్రతివ్యక్తి అడుగుతున్న ప్రశ్న, నేనెన్నోసార్లు వేసుకున్న ప్రశ్న, ఎవరూ జవాబు తెల్సుకోలేని ప్రశ్న ఏమిటంటే కోర్టుల్లో నలుగుతున్న నాలుగు లక్షల కేసుల విషయం ఏం చేయాలి? సెషన్స్ కోర్టుల్లో నలుగుతున్న పదిహేను వేల కేసుల విషయం ఏమిటి?

జైల్లో విచారణలోవున్న అందర్నీ పూచీపై విడుదలచేసి వాళ్ళ నుదుర్లమీద 'విచారణ జరుగుతున్నది' అని ముద్రవేయించాలని నేను సూచించాను.

ఈనాడు ఈ పౌరులపట్ల మనం చూపిస్తున్న ఆనాదరణకూ, వాళ్ళ బాధనూ దుఃఖాన్నీ గుర్తించకపోవడానికీ ఒకనాడు మనం ఎంతోమూల్యం చెల్లించాల్సివస్తుంది.

దురదృష్టవశాత్తూ నేరం పట్ల సగటు మనిషి అమాయకత అపరిమితంగా వుంది. సగటు మనిషి నేరస్తుణ్ణి జనాన్ని అణస్తూ, చంపుతూ వీధుల్లో తిరిగే ఒక దోపిడీదారుగా భావిస్తున్నాడు. నేరస్తుణ్ణి ఆశ్రియం యివ్వగూడదని, రక్షణ యివ్వగూడని, కనీసం న్యాయంకూడా యివ్వగూడదని అతి దుర్మార్గమైన మానవులకు నమూనాగా సగటు మనిషి భావిస్తున్నాడు. వాళ్ళల్లో కొందరు కరడుగట్టిన నేరస్తులే కావచ్చు కానీ వాళ్ళల్లో చాలామంది న్యాయం సరిహద్దుల్ని ఒక అనుకోని పరిస్థితిలో, ప్రమాద పరి స్థితిలో, బాధాకర పరిస్థితిలో దాటడానికి ప్రయత్నించి వుండవచ్చు.

అక్కడ ఇంకా చాలామంది పోలీసుల తెలివితక్కువవల్ల నీచమైన వ్యాఖ్యానాల వల్ల అబద్ధపు ఆరోపణలు వాళ్ళమీద బనాయించడంవల్ల లేదా పోలీసుల లంచగొండి

'మీ బాధలు మీ గాథలు అవగాహన నాకవుతయి ఏడవకం డేడవకం డేడపకండి!'

ఫిబ్రవరి నాలుగున కేంద్ర ఆంతరంగిక వ్యవహారాలశాఖ ఒక ప్రకటన జారీ చేసింది. ఆ ప్రకటన ప్రకారం బీహార్‌లో ఎనభై శాతం పైగా, ఉత్తరప్రదేశ్‌లో ఎనభై రెండుశాతం, అస్సామ్‌లో అరవై ఎనిమిది శాతం, హర్యానాలో యాభై మూడు శాతం, మణిపూర్‌లో యాభై ఆరు శాతం, మేఘాలయలో అరవై మూడు శాతం, రాజస్థాన్‌లో యాభై శాతం, సిక్కింలో అరవై ఐదు శాతం, త్రిపురలో అరవై ఐదు శాతం, బెంగాల్‌లో అరవై ఏడుశాతం ఖైదీలు ఇంకావిచారణలో వున్నవారే (అండర్ ట్రయల్స్)

ప్రస్తుతం ధనికవర్గాలే పూచీకత్తు సులభంగా సంపాదించుకో గల్గుతున్నాయి, పేదవర్గాలకు పూచీపెట్టడానికి ఏమీలేకపోవడంవల్ల పూచీపై విడుదలయ్యే అవకాశం వుండడంలేదు, దీని అర్థమేమిటంటే ధనికుడు ఒక నేరం చేయొచ్చు; జైలుకు పోకుండా వుండొచ్చు- పేద మాత్రం జైలుకుపోవాలి.

అరుణ్‌శౌరీ విచారితులగురించి రాసిన వ్యాసంలో 'ఫిబ్రవరి ఐదున సుప్రీంకోర్టు రుస్తుంజీ పేర్కొన్న సలభై రెండుమంది విచారితులను విడుదల చేయాలని, వారంలోగా బీహార్ రాష్ట్ర జైళ్ళలో పద్దెనిమిది నెలలుమించి గడిపిన విచారితుల వివరాలు తెల్పాలని బీహార్ ప్రభుత్వాన్ని ఆజ్ఞాపించింది.

ఆజ్ఞ జారీచేసిన న్యాయాధికార్ల విచక్షణకు, నివేదించిన రుస్తుంజీకి, హెబియస్ కార్పస్ దరఖాస్తులు పెట్టిన శ్రీపతి కపిల్ హింగోరానీకి ఒకనివాళి.

పత్రికలో నివేదిక ప్రచురించబడ్డ తర్వాత నెలరోజులలోపల ఇట్లా ఆజ్ఞరావడం సమాజంలో వాక్స్వాతంత్ర్యంఎంత విలువైందో అర్థమవుతుంది. ఈ విచారితుల సమస్య మన సమాజంలోని అనేకానేక అన్యాయాల్లో ఒకటి. దీనిపై సుప్రీంకోర్టు విచారణ ఒక చిన్న అడుగు- ఐనా అదిఒక ప్రత్యేక అన్యాయానికి వ్యతిరేకంగా వేసిన అడుగు.

కానీ ఈ అడుగు మనకు చెప్పేదేమంటే మనం ఒకవాలులో, ఒకసామీప్యంలోనే ఆలోచించగలుగుతున్నాం. పూర్వం పోలీసువ్యవస్థలో పనిచేసిన ఒకవ్యక్తి జాతీయ

తనంవల్ల జైలుకొచ్చిన వాళ్ళే. వాళ్ళందర్నీ మన మురికి జెయిళ్ళలో పారేయదగిన మానవుల్లోని చెత్త అని మనం అంగీకరిద్దామా? మన ప్రభుత్వం వాళ్ళపట్ల యింత నిస్తబ్ధంగా వుండడానికి కారణం ఏమిటి? పరిశీలక వ్యవస్థ వీటిని కనుక్కోలేనంతగా ఎందుకు దిగజారిపోయింది? విడదీయడమే కారణమా?

ఇన్ని వేల మానవ విషాదాలకు ఎవరిది బాధ్యత?

పోలీస్‌కమీషన్‌లో సభ్యుడుకావాలి. తర్వాతఆయన రెండుబాగులేని జైళ్ళనుచూడాలి. ఆయన అక్కడ గమనించిన విషయాలు రాయాలి. ఒకవార్తాపత్రిక ఆవివరాలను అడిగి ప్రచురించాలి. ఒక న్యాయవాది ఆవార్తలు చదివి కోర్టులో దరఖాస్తులు పెట్టాలి. న్యాయాధికారులు ఆ న్యాయవాది ఫై దీలకోరికపైగాకుండా తనంతటతానే వచ్చాడనే విషయాన్ని విస్మరించాలి. వాళ్ళను విడుదల చేయమని ఆజ్ఞాపించాలి.... ఇదంతా ఎంతకాలమో.... ఇట్లా ఒక సామీప్యాల తాడు మన ఆశలను వేలాడదీస్తుంది.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేఖరులు సేకరించిన లెక్కల ప్రకారం సికింద్రాబాదు సెంట్రల్‌జైల్లో ఎనభై శాతం విచారితులున్నారు. సూరత్-మనప్రియమైన గాంధేయ ప్రధాని మొరార్జీ నియోజక వర్గంలో డెబ్బైఎనిమిది శాతం, అహమ్మదాబాద్‌లో డెబ్బై రెండుశాతం, లక్నో-షిల్లాంగ్‌లలో ఎనభై రెండుశాతం, పాట్నా, శ్రీనగర్‌లలో అరవై నుండి డెబ్బైశాతం, బెంగుళూర్‌లో యాభై ఐదు శాతం, కలకత్తా అలీపూర్ జైల్లో యాభై శాతం విచారితులుగా వున్నారు.

"కానీ వారిలో చాలామంది 'కొన్ని నెలలు' మాత్రమే గడపలేదా? మీరావిష యాన్ని తెగలాగడం లేదా?"

ఈ ప్రశ్న అడిగే వాళ్ళు ఆ 'కొన్ని నెలలు' జైల్లోవిచారితులుగా వుండాలి. పాట్నా సెంట్రల్‌జైల్లో అరవై శాతం విచారితులు ఆరునెలలపైగా గడిపారు. నలభై శాతం మంది సంవత్సరంపైగా గడిపారు: యాభై ఏడుమంది రెండు నుంచి మూడేళ్ళు, పది హేడుగురు మూడు నుంచి నాలుగేళ్ళు ఎనిమిది మంది నాలుగు నుంచి ఐదేళ్ళు, ముప్పై రెండుమంది ఐదు నుంచి పదకొండేళ్ళు గడిపారు. ప్రతిజైల్లోనూ పరిస్థితి యిదే.

"కాని మీరు హంతకులనూ, దోపిడీదార్లనూ స్వేచ్ఛగా వదిలేయాలంటున్నారా? ఒకవేళ వీళ్ళవిషయంలో ఉదారత చూపితే దోపిడీలూ హత్యలూ ఎంత విరివిగా జరుగు తాయో తెల్సునా?"

ఈ వెర్రిని సంఖ్యలు బలపరచవు- అన్ని సందర్భాల్లోనూ డెబ్బై నుంచి డెభ్భైఐదు శాతం విచారితులు చాలాచిన్న కేసులు పెట్టబడ్డవాళ్ళే. శ్రీనగర్, సహన్, లక్నో, అంబాలా, కలకత్తాజైళ్ళు యిందుకు కొద్ది మినహాయింపు. కలకత్తా జైల్లోని విచా రితుల్లో ఇరవైఐదుశాతం పైహత్య, దోపిడీ నేరాలారోపించబడ్డాయి. (ఈ ఆరోప ణల నిజానిజాల గురించి నేను మాట్లాడ దల్చుకోలేదుకాని బెంగాల్, ఆంధ్రప్రదేశ్‌ల్లో 'దోపిడీ' అనేది రాజకీయ ప్రత్యర్థులపై వుపయోగించడానికి చేతిలోవున్న ఆరోపణ.)

పాట్నాలో ఒక పాకిస్తాన్ పౌరుడు అబ్దుల్ రహ్మాన్ తొమ్మిదేళ్ళుగా- జానుతొమ్మిదేళ్ళుగా- జైల్లోగడుపుతున్నాడు. ఒకవేళ ఆయన గూఢచారే అయితే ఆయనను మిగతావాళ్ళతో ఎందుకు కలిపి వుంచుతున్నారు? ఒకవేళ కాకపోతే ఆయనను పాకిస్తాన్‌కు ఎందుకు పంపడంలేదు?

క్రిక్కిరిసి పోయిన పాట్నా సెంట్రల్ జైల్లో మరుగు దొడ్లను శుభ్రంచేసేందుకు నీళ్ళులేవు, మలం రోజుల తరబడికాదు నెలలు నెలలుగా కూడుతూవుంది....

మనది ఒకదేశమేనా? కాదా?

ఉత్తరప్రదేశ్‌లో శతాబ్ద ప్రారంభంలో అరశాతం (రెండు వందల మందిశిక్షలు బడ్డ ఖైదీలకు ఒక్కరు!) విచారితులుండేవాళ్ళు. 1967 లో యాభై ఎనిమిది శాతానికి పెరిగిన ఈసంఖ్య అక్టోబర్ 1978 కి నాలుగువందల అరవై శాతానికి (!) పెరిగింది.

ఘనశ్యామ్ మెహతో నేరంచేశాడని రుజువైతే గరిష్ఠశిక్ష మూడేళ్ళు పడాల్సుండగా ఇప్పటికీ విచారణ లేకుండా జైల్లో ఏడేళ్ళుగడిపాడు.

చరితామరుు శిక్షపడితే గడపాల్సింది మూడేళ్లు కాగా ఇప్పటికి ఎనిమిదేళ్లు గడిపింది.

బందీమరుు శిక్షపడితే గడపాల్సింది మూడేళ్లు కాగా ఇప్పటికి ఆరేళ్లు గడిపింది.

భోలూ మెహతో శిక్షపడితే ఏడేళ్ళు గడిపాల్సిందానికి ఇప్పటికి పదకొండేళ్ళు గడిపాడు.

వీళ్ళందరూ నేరం చేశారని రుజువైతే పడే గరిష్ట శిక్ష తెల్పాను నేను.

ఇట్లా బీహార్‌లో మాత్రమే కాదు.

ఇండోర్‌లో మూల్యారత్నా పిచ్చివాడై పోయాడు; అన్నూ అన్వర్ ఖాన్ తన కేమీ సంబంధంలేని కల్తీ మద్యం తాగి వందమంది చనిపోయిన సంఘటనలో అరెస్టు చేయబడ్డాడు- ఈ వ్యాపారంలోని పెద్దలందరూ హాయిగానే వున్నారు- ఆయన జైల్లో వున్న ఈ మూడేళ్ళలో ఆయన భార్య, తండ్రి, తల్లి, మామ, పినతండ్రి చనిపోయారు.

ఇట్లా ఎన్నైనా చెప్పొచ్చు.

మా విలేఖరులు పంపిన నివేదికలు చదువుతూ వివిఎస్ నయిపాల్‌ను జ్ఞాపకం చేసుకున్నాను.

ఆయన తన పుస్తకం 'ఏరియా ఆఫ్ డార్క్‌నెస్'లో మన 'చూడలేని కళ' గురించి చెప్తాడు. ఈనాడివన్నీ ఏంతోకాలంగా నిలిచి, యిట్లా కొనసాగుతున్నా

యంటే మన కళ్ళముందు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తూవున్న వాటిని చూడలేని మనం ఎంత సమర్థులం?

నయపాల్ కొత్తగా ప్రచురించిన వ్యాసాల్లో ఆయన యింకా యిలా అంటాడు. భారతదేశంలో ఒక అధ్వాన్నమైన స్థితిలోవున్న జీవన స్థాయిని చూసినపుడు ఎదురు తిరగాలనిపించిన మనస్సుకు అంతకంటె అధ్వాన్నమైన స్థితిలో కూడా ఒకచోట పరిస్థితులున్నాయని అర్థమవుతుంది. ఈ మాటలు ఎంత నిష్కర్షతో చెప్పినప్పటికీ ఎంత నిజమయినవి.

ప్రజాస్వామిక పౌరసంఘం ఒక జైలు సంస్కరణల కమిటీని మే '78 లో వేసింది. దీనికి తార్కుండే అధ్యక్షుడు. ఒక తీవ్రవాద మంత్రిభార్య సభ్యురాలు. ఈ కమిటీ తిహార్ జైలును సందర్శించడానికి– సందర్శించడానికి మాత్రమే– జూన్ '78 నుండి ప్రయత్నిస్తున్నది. వుత్తరాలు, టెలిఫోన్ మాటలు, చర్చలు– వుత్తరాలు, ఎక్కువ టెలిఫోన్ మాటలు, ఎక్కువ చర్చలు .... అంతేకాని సందర్శనంలేదు.

ప్రభుత్వం ప్రజల సహకారంతో పనిచేసే విషయంలో ఎంత శ్రద్ధ తీసుకుంటున్నదో, జనార్దనులని పిలిచే జనతను ఎంత కలుపుకు వస్తున్నదో ఈ విషయంలో అర్థమవుతుంది.

'ఐనా మనం చేయగలిగిన కొంచెమైనా చేయాలి– యివి చేయడానికి కూడా మనకు కొన్ని సంవత్సరాలే వున్నాయి.'

బొంబాయి నుంచి వెలువడే 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' ఈ సమస్యపై 'ఈ సంఘటనల వరుస జ్ఞాపకముంచుకోదగింది. భారత పత్రికా వ్యవస్థ ఈకాలంలో సాధించిన ముఖ్యమైన పని యిది.' అని రాసింది.

జనవరి ఎనిమిది తొమ్మిదిలలో నివేదిక ప్రచురించబడితే సుప్రీంకోర్టు బీహార్ ప్రభుత్వానికి జనవరి ఇరవైరెండున ఒక నోటీస్ పంపింది– ఫిబ్రవరి ఐదున ఇరవై ఐదుగురు ముజఫర్‌పూర్ జైల్లోని విచారితులను, పదిహేడుగురు పాట్నా జైల్లోని విచారితులను 'తక్షణమే' విడుదల చేయమని ఆజ్ఞాపించింది.

ఐతే ఫిబ్రవరి ఎనిమిదికి కూడా పాట్నా జైలు సూపరింటెండెంట్ సుప్రీంకోర్టు ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నాడు. ఫిబ్రవరి పన్నెండున సుప్రీంకోర్టులో విచారితుల తరఫు న్యాయవాది బీహార్ జైళ్ళు ఫిబ్రవరి ఐదునాటి సుప్రీంకోర్టు ఆజ్ఞను ఇంకా అమలు చేయలేదని చెప్పింది. ఆజ్ఞలు చేరకపోవడం 'తపాలా ఆలస్యమేనని' మళ్ళీ అప్పటికప్పుడు తంతిపై వార్తలు పంపబడ్డాయి.

మెయిన్‌స్ట్రీమ్ పత్రిక 'విచారితులలో నక్సలైట్ల సంఖ్య చాలాస్వల్పం. ఎందుకంటే ఇలాంటి తిరుగుబాటు దారులను తీసేయడానికి సులభమార్గమైన 'సంఘర్షణ' వ్యవహారం వుంది గదా!' అని రాసింది.

"ఒక వ్యక్తిని నిర్బంధించి కోర్టులో హాజరు పర్చింతర్వాత, కోర్టు పూచీ నిరాకరిస్తే ప్రాసిక్యూషన్ వారికి అభియోగపత్రం దాఖలు చేయడం ఆలస్యం చేయడానికి, సాక్షులను ఆలస్యంచెయడానికి స్వేచ్ఛదొరికినట్టే.

ఒకవైపుసాక్షుల కొరతతోపాటు న్యాయస్థానాలు సాక్షులను ఎక్కువ సంఖ్యలో పిలుస్తూవుంటారు. దీనికి ప్రత్యేకకారణమేమీ లేదుగాని కొందరు చెప్పినట్టు 'ప్రభుత్వం నుంచి ఇంకోరోజు భత్యాన్ని పొందడానికి' ఇట్లాచేస్తుంటారు. కానీ ఎక్కువ సాక్షులంటే ఎక్కువ పొడిగించబడ్డ విచారణ ఎక్కువ ఆలస్యాలు- విచారితులకు ఎక్కువ వాయిదాలు.

భారత హంతక శిక్షస్మృతి ప్రకారం ఒక పోలీస్ అధికారి కేస్‌డైరీని ఇరవై నాలుగు గంటలలోగా రాయాల్సుండగా ఎప్పుడూ అట్లాజరగలేదు. నిజంగా జరిగేదేమంటే వాళ్ళెప్పుడూ కేస్ డైరీలను ఉపయోగించరు. విచారణలో వాళ్ళు గమనించిన అంశాలను చిన్నచీట్లమీద రాసుకుంటారు. ఇట్లాంటి చీట్లు చాలా జమఅయింతర్వాత రెండుమూడు రోజులు సెలవు తీసుకొని పాత తేదీలువేసి కేస్ డైరీలు రాస్తారు.

అసలు పోలీస్ అధికారి అరవై రోజుల్లోగా అభియోగ పత్రం దాఖలుచెయ్యాలి. కాని ఎప్పుడూ అట్లాజరగలేదు. అది ఆరునెలలనుంచి నాలుగేళ్ళవరకు తీసుకుంటుంది.

బీహార్ పోలీస్ నివేదికలో వదిలివేసిన అంశం ఏమిటంటే వాళ్ళు నేరాలు పరిమితంచేసే పద్ధతిలోనూ విచారణలోనూ బ్రిటిష్ పద్ధతులే అవలంబిస్తున్నారు. బ్రిటిష్ పోలీసులు వాళ్ళప్రాంతంలో ఏదైన నేరం జరిగినప్పుడు 'నేరతెగ'లను పట్టుకునేవారు. ఇప్పుడు అదే పద్ధతిలో ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఒక 'నల్లజాబితా' వుంటుంది. ఈ జాబితామీద వాళ్ళకెంత నమ్మకమంటే ఒకకొత్తనేరస్తుడు వాళ్ళచే ఏమీ అనుమానింపబడకుండా తప్పించుకుపోవచ్చు అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో అరుణ్‌సిన్హా రాశాడు.

విప్లవం

బండలు కొట్టి బ్రతికే బ్రతుకుల్లో
మట్టికొట్టి మాడ్చే వాళ్ళుంటే
విప్లవం రాక మరేమవుతుంది?

యస్. కె. రావు

పండితాపురం గ్రామ సంఘటనలపై
వరంగల్ పౌరహక్కుల సంఘం సమర్పించిన
వాస్తవ విచారణ సంఘం సమర్పించిన **నివేదిక:**

ప్రభుత్వం కట్ట భూస్వామి చెరువును కాపాడుతుంది
ప్రభుత్వం భూస్వామి దోపిడీని కాపాడుతుంది

1979 జనవరి మూడవ ఒకటిన ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లా పండితాపురం గ్రామంలో జరిగిన పోలీసు కాల్పుల్లో ఇద్దరు మరణించారు. వరంగల్ పౌరహక్కుల సంఘం ఈ సంఘటన తనకు సంబంధమున్న విషయంగా పరిగణించింది. అక్కడి పరిస్థితిని పరిశీలించడానికి ఒక బృందాన్ని పంపాల్సిన అవసరమున్నదని అభిప్రాయ పడింది. కనుక వివిధ జీవన వ్యావృత్తులనుంచి తీసుకున్న వ్యక్తులతో ఒక 'వాస్తవ విచారణ సంఘాన్ని' నియమించింది. ఆ సంఘం కాల్పులకు దారితీసిన సంఘటనలు అవగాహన చేసుకోవాలనీ, పర్యవసానంగా జరిగిన సంఘటనలను పరిశీలించాలని నిర్ణయించుకున్నది.

ఈ వాస్తవ విచారణ సంఘంలో డాక్టర్ జి. హరగోపాల్, రీడర్, కాకతీయ విశ్వవిద్యాలయం. శ్రీ శంకరయ్య, అధ్యక్షుడు హనుమకొండ పట్టణ జనతా పార్టీ (న్యాయవాది), శ్రీ వి.ఎల్. నరసింహారావు, విలేఖరి, ఆంధ్రజ్యోతి, శ్రీ ఎన్. వేణుగోపాలరావు, ఎంటమాలజిస్ట్, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, శ్రీ ఇ. ఎల్. నరసింహయ్య, విరసం వరంగల్ యూనిట్ కన్వీనర్, శ్రీ ఎస్. జీవనకుమార్, వరంగల్ పౌరహక్కుల సంఘ సభ్యుడు (లెక్చరర్) లతో పాటు రాష్ట్ర పౌరహక్కుల సంఘం కన్వీనర్లు శ్రీ రంగనాథం, శ్రీ విఠల్‌రావు కూడా వున్నారు.

సంఘం మార్చి 11న ఖమ్మం చేరింది. అదేరోజు కొత్తలింగాల గ్రామంలో చాలామంది ప్రజల్ని, పండితాపురం గ్రామంలో పట్వారీ, పటేల్, భూస్వాములతో పాటు ఎక్కువ సంఖ్యలో ప్రజల్ని కలిసింది. వారితో మాట్లాడింది. మార్చి పన్నెండున సంఘం జిల్లా కలెక్టర్‌తోనూ, పోలీస్ సూపరింటెండెంట్‌తోనూ, స్థానిక శాసనసభ్యునితోనూ మాట్లాడింది. కాల్పులు జరిగిన ప్రాంతాన్నీ, సంఘర్షణకు ఉద్రిక్తతకు మూలకారణమైన చెరువునూ సంఘం చూసింది.

పండితాపురం గ్రామం ఖమ్మం నుంచి పదహారు కిలోమీటర్ల దూరంలో వుంది. ఆ గ్రామ జనాభా ఆరువేలు. కమ్మ కులం వాళ్ళది అధికారం. కొందరు వైశ్యులు, కొందరు బ్రాహ్మణులు కూడా అధికారవర్గంలో వున్నారు. వీళ్ళు మొత్తం జనాభాలో

పదిశాతం వుంటారు- మిగిలిన జనాభాలో గౌడ, వడ్డెర కులాలవాళ్ళు మూడింట ఒక వంతు ఉంటారు- లంబాడీలు, హరిజనులు పదిహేను శాతం ఉంటారు- ముస్లిములు, ఎరుకలవాళ్ళు చెప్పుకోదగినంతగా వున్నారు.

గ్రామంలో వున్న మొత్తం భూమి ఐదువేల ఏడువందల ఎకరాలు కాగా వెయ్యి ఎకరాల భూమి చిన్నతరహా నీటిపారుదల సౌకర్యాల కింద సాగవుతున్నది- మొత్తం భూమి రెండు వందల ఎనభై మంది పట్టాదార్ల పేరున వున్నది. వీరిలో ఎక్కువ మంది కమ్మ, వైశ్య, బ్రాహ్మణ వంటి అగ్రకులాలవాళ్ళే. చిన్నచిన్న భూములున్న వడ్డెర, గౌడ, లంబాడీ పట్టేదార్లు కూడా వున్నారు. భూమివున్న హరిజనులు కొద్ది మంది మాత్రమే వున్నారు. మిగతా ప్రజలంతా భూమిలేనివారే- వారు తమ కష్టం పైనే పూర్తిగా ఆధారపడివుంటారు- వ్యవసాయమే అక్కడ ముఖ్యమైన జీవనాధారం.

అక్కడ శాశ్వత నీటివనరులేమీ లేకపోవడంవల్ల ప్రజలు పొలాల కొరకే గాక బట్టలు ఉతుక్కోవడం లాంటి ఇంటి అవసరాలకు కూడా చెరువుల మీదనే ఆధారపడ తారు- పశువులకు కూడ చెరువు తప్ప వేరే తాగేనీటి సౌకర్యం లేదు.

భూస్వామి శ్రీ మల్లయ్య చెప్పుకోదగినంత భూమి కలిగివున్నాడు- శ్రీ మల్ల య్యకు ఎంత భూమి వున్నదని పట్వారీని అడిగితే ఆయన తెలివిగా సమాధానాన్ని దాటవేస్తూ 'న్యాయాధికారులు, న్యాయవాదులు, న్యాయస్థానాలు, రెవెన్యూ కాగితాలు మల్లయ్య భూమి భూకమతాల పరిమితిలోపే వున్నదని తెల్పుతున్నాయి-' అన్నాడు. ఎంతో భూమిని కలిగివుండడమే గాక భూస్వామి అప్పులు కూడా యిస్తూ వుంటాడు. ఆయన విపరీతమైన వడ్డీరేట్లు అమలు చేస్తాడనే ఉద్దేశ్యం అన్నివర్గాల ప్రజల్లోనూ బాగా నాటుకునివుంది- ఈ ఉద్దేశం ఆయన అమలుచేసే ఒక పద్ధతితో బాగా తెలుస్తుంది. నాట్లకాలంలో పది బస్తాలిచ్చి పంట వచ్చింతర్వాత పదిహేను బస్తాలు వసూలుచేస్తాడు. ఈ పద్ధతిని తెలంగాణలో 'నాగు' అని పిలుస్తారు- ఇది ఆరు నెలలకు మాత్రమే పరి మితమై వుంటుంది. ఈ వడ్డీరేటు వస్తురూపేణా ఐనప్పటికీ యాభయి శాతం అన్నమాట. ఆయన తను అప్పిచ్చే పెద్దమొత్తాలకు సంవత్సరానికి ఇరవై నాలుగు శాతం వడ్డీరేటు, చిన్న మొత్తాలకు సంవత్సరానికి అరవైశాతం వడ్డీరేటు లెక్కగడ్తాడు. ఒక్కొక్కప్పుడు వడ్డీరేటు నూటపది శాతం కూడా వుంటుందని చెప్పబడింది. ఒకసారి ఒక యువకుడు ఇలాంటి విపరీతమైన వడ్డీరేట్ల గురించి భూస్వామిని ప్రశ్నిస్తే ఆయన 'మా తాత ఇదేరేటు కట్టేవాడు- దాన్ని కొనసాగించిన మానాన్న నన్ను దాన్నిఆపవద్దని కోరాడు' అని చెప్పాడని గ్రామస్తులు చెప్పారు, దీనివల్ల తెలిసేదేమంటే చెప్పుకో

దగినంత సారవంతమైన భూమీ, పెట్టుబడీగల ఈ భూస్వామి గ్రామ ఆర్థిక వ్యవస్థను పాలిస్తున్నాడు- వీటన్నిటితోబాటు కొండారెడ్డి చెరువు శికం* భూమిపై ఈయన అధికారం గ్రామంలో ఉద్రిక్తతకూ, ఘర్షణలకూ కారణం.

గ్రామంలోవున్న పెద్ద చెరువుల్లో కొండారెడ్డి చెరువు ఒకటి. ఈ చెరువుకింద సాగయ్యే మొత్తం భూమి నూటరెండు ఎకరాలు. దీంట్లో ఇరవై ఎకరాలు మెట్ట, ఎనభై రెండు ఎకరాలు మాగాణి. ఇదికాక చెరువు శికం భూమి అరవై రెండు ఎకరాల ఇరవై గుంటలుంది,

1930 లలో శికం భూమి నవాబ్ షౌకత్‌జంగ్ జాగీర్లో వుండేది. అప్పుడే పదేళ్ళు వరసగా సాగుచేసిన ముప్పైముగ్గురు వ్యవసాయదార్లకు ఈ భూమంతా అమ్మి వేయబడింది. ఈ ముప్పైముగ్గురు వ్యవసాయదారులు వాయిదాలలో డబ్బు సరిగా చెల్లించలేక పోయినందువల్ల జాగీర్దార్ ఈ భూమిని వేలం పాడాడు. ఇట్లా మల్లయ్య తండ్రి శ్రీ బోదెంపూడి వీరయ్య చెరువుపై అధికారాన్ని సంపాదించాడు. సాధారణంగా శికం భూమి ప్రభుత్వానికి చెంది వుంటుంది. ప్రభుత్వం గ్రామస్తులను ఈ భూమిలో వ్యవసాయం చేసుకోనిచ్చి ఉత్పత్తులలో భాగం తీసుకుంటుంది. పక్క గ్రామం కొత్తలింగాలలో కూడా పదహారెకరాల శికం భూమి ప్రభుత్వ అధీనంలోనే వుంది. పది సంవత్సరాల క్రింద ప్రజల పోరాట ఫలితంగా ప్రభుత్వం ఈ భూమిని స్థానిక భూస్వామి శ్రీ గోదావరి ముత్తయ్య నుండి స్వాధీనం జేసుకుంది. కాని కొండారెడ్డి చెరువు విషయంలో ఒక అసాధారణస్థితి- భూస్వామి చెరువు స్వంతదారుగా ఉండడం- అమలుజరుగుతున్నది:

కొండారెడ్డి చెరువు క్రింద వున్న నూట రెండు ఎకరాలూ చిన్న కమతాల వ్యవసాయదారులవే- కాబట్టి వర్షాకాలంలో భూస్వామి చెరువుపై ఎలాంటి వివాదాలూ లేదు. గమనార్హమైన విషయమేమంటే చెరువు కట్ట ప్రభుత్వానిది. ఈ గ్రామంనుంచే వచ్చిన స్థానిక శాసన సభ్యుడు శ్రీ బుగ్గారపు సీతారామయ్య తన బాల్యం నుంచీ ఈవివాదాన్ని చూస్తున్నానని అన్నాడు. ఎండాకాలంలో చెరువులో మిగిలిపోయిన నీరు విడిచిపెట్టొద్దని, అట్లా చేయడ వల్ల ఎంతో అసౌకర్యం ఏర్పడుతుందని గ్రామ ప్రజలు భూస్వామితో మొరపెట్టుకుంటున్నారు. ఇట్లా మధ్యలో నీరు వదలడం గ్రామం ఎప్పటి

* వేసవి కాలంలో చెరువులో నీళ్ళైపోయింతర్వాత సాగుకు పనికివచ్చే చెరువు లోతట్టు భూమిని శికం అంటారు.

నుండో చూస్తున్నది- కాని నీళ్ళు బెత్తలు వదిలిపెడ్తున్నారని భూస్వామి అన్నాడు- కాని దీనివల్ల పూర్తిలాభం భూస్వామికే.

ఇలాంటి విచారకరమైన పద్ధతి కొనసాగింపుగా, ప్రజల కోరికను కూడా కాదని ఈ సంవత్సరం నవంబర్‌లో నీరు వదిలివేయబడింది- ఈ పద్ధతి ఈసారి కూడా బట్టలుతుక్కోవడానికి యిబ్బంది పెట్టడమే కాకుండా పంటలను నాశనం చేసింది- ఈ విషయం పట్వారీ ప్రభుత్వానికి తెలియపర్చాడు కూడా. కాని అధికారులావిషయం పట్టించుకోనేలేదు.

భూస్వామి చర్యలతో, అధికారులవైఖరితో విసిగిపోయిన గ్రామస్తులు ముఖ్యంగా శ్రామికులు రైతుకూలీ సంఘం స్థాపించుకున్నారు. రైతుకూలీ సంఘం అధ్వర్యంలో గ్రామస్తులు తమ అవసరాన్ని శక్తివంతంగా తెల్పనిదే భూస్వామి గ్రామస్తులకు ఇట్లా అసౌకర్యం కల్పించడం ఆపడని భావించారు. రైతుకూలీ సంఘం శ్రీ రాఘవయ్య నాయకత్వంలో పనిచేయడం మొదలుపెట్టింది. ఖరీఫ్ పంటల విత్తనాలు చల్లేప్పుడూ కోతలప్పుడూ వాళ్ళు ఎక్కువ కూలీరేట్లు సాధించుకోగలిగారు.

ఈ సంవత్సరం భూస్వామి నలభై ఎకరాల షికం భూమిలో మినుములు పండించాడు- అవి జనవరిలో కోతకొచ్చినాయి- షికంలో పండిన పంటను భూస్వామి అనుభవించకుండా చేయాలని, దానిద్వారా భూస్వామికి తమ నిరసనను తెల్పగలమని, ప్రజల ఆస్తిని భంగపర్చకుండా ఒక పాఠం నేర్పగలమని 1979 జనవరి ముప్పైన రైతుకూలి సంఘం నిర్ణయించుకున్నది. ఈ నిర్ణయం అమలులో భాగంగా కొందరు శ్రామికులు కొంత పంటను స్వాధీనం చేసుకున్నారు.

భూస్వామి పోలీసులకు ఇది దొంగతనంగా ఫిర్యాదు చేశాడు. దీనితో 'శాంతి భద్రతల'ను కాపాడడానికి పెద్దఎత్తున పోలీసు దళాలు ఆ రాత్రే గ్రామానిక వచ్చాయి. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కూడా పరిస్థితికి కావాల్సిన దానికంటె ఎక్కువ పోలీసు దళాలు పంపబడ్డాయని ఒప్పుకున్నాడు.

జనవరి ముప్పై రాత్రి పోలీసులు శ్రీ గుండ్ల భాస్కరరావును, శ్రీమతి దొడ్డా సుశీలను నిర్బంధించారు. శ్రీమతి సుశీల వితంతువు- ఈ సంఘటన గ్రామంలో భీతావహ పరిస్థితిని సృష్టించింది- చాలామంది గ్రామస్తులు గ్రామం వెలుపల ఆ రాత్రి నిద్రకు వెలియై గడిపారు. అప్పుడు వారు శ్రీ భాస్కరరావు, శ్రీమతి సుశీలల విడుదల గురించి పోలీస్ అధికారులను కోరటానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు- చాలా మంది గ్రామస్తులు ముఖ్యంగా వ్యవసాయ కార్మికులు, వృద్ధులు, స్త్రీలు, బాలబాలికలు

గ్రామం వెలుపల ఒక చెట్టుకింద కూడారు- మధ్యాహ్నం రెండు గంటలకు వారందరూ ఒక రెండు ఫర్లాంగుల పొడవుగల ఊరేగింపు తీశారు- వారు నిర్బంధించబడ్డ యిద్దర్ని విడుదల చేయాలని, గ్రామంలో పోలీసు క్యాంపును ఎత్తివేయాలనీ నినాదాలు చేసారు.

పోలీసులతో చర్చించవలసిన ఆరుగురు వృద్ధులు శ్రీమతి కప్పల సూరమ్మ, శ్రీమతి కుంచాలపు భద్రమ్మ, శ్రీమతి శాంతమ్మ మరి ముగ్గురు ప్రథమశ్రేణిలో ఉండేట్టుగా, వారి వెనక వందమంది స్త్రీలు నాయకత్వం వహించేట్టుగా ఊరేగింపు రూపొందించబడింది. చంటిపిల్లల నెత్తుకున్న స్త్రీలు కూడా ఊరేగింపులో పున్నారు- వారు ఎలాంటి అశాంతి రేపడానికి నిర్ణయించుకోలేదని, ఎవరిపైనా దాడిచేయడానికి ఉద్దేశించలేదని ఊరేగింపు రూపొందించబడ్డ పద్ధతి తెల్పుతుంది- వారు చట్టవిరుద్ధంగా నిర్బంధించబడ్డ వారి విడుదల కోసం జరిగే ఆందోళనలో గ్రామస్తులందర్నీ కలుపుకు రావాలనుకున్నారు.... అంతే.

పోలీస్ సబ్-యినస్పెక్టర్ లాఠీచార్జ్ చేయమని ఆజ్ఞాపించారు- పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ అదనపు పోలీస్ దళాలతో ఆప్రదేశానికొచ్చేసరికి పరిస్థితి గందరగోళంగా వున్నది- పోలీసుల లాఠీదెబ్బలకు శ్రీ జలగం వీరయ్య తలకు బలమైనదెబ్బ తగిలింది. విపరీతంగా రక్తం కారుతూవుంది. జనం తెలిపిన దాన్నిబట్టి ఆయనకేమయిందో తెలియదుగాని ఆయన తల, చెవులు, కణతలు ఉబ్బినయి, నొప్పితో పొంగినయి. ఊరేగింపులోవున్న ప్రజలు గాయపడ్డ వాళ్ళను చూడగానే అటూయిటూ పరిగెత్తసాగారు. డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీ సూర్యనారాయణకు ఏమయిందో ఎవరూ గమనించలేదు. ఊరేగింపునుంచి పారిపోయి వచ్చిన వారికి చుట్టుపట్లవున్న కమ్మ కుటుంబాలు ఆశ్రయం ఇవ్వలేదు, డీఎస్పీ అక్కడ ఒకనాగలి తాకి బోర్లా పడిపోయాడని అందువల్ల గాయపడ్డడని చెప్పబడింది. డీఎస్పీ ఖమ్మంలో లేకపోవడం వల్ల వాస్తవ విచారణ సంఘం ఆయనను కలుసుకోలేక పోయింది. ఐనా గాయపడ్డ డీఎస్పీ ఫోటోలను ఖమ్మంఎస్పీ చూపించాడు. వాటిప్రకారం తలపై ఒక గాయంతో పాటు డీఎస్పీకి చాలా గాయాలయినాయని సంఘం అభిప్రాయపడింది. కాల్పుల ఆజ్ఞ సరిగ్గా ఏసమయాన యివ్వబడిందో ఖచ్చితంగా ఎవరూ చెప్పలేక పోతున్నారు, గ్రామస్తులు లాఠీఛార్జ్ ఆజ్ఞవెంటనే కాల్పుల ఆజ్ఞయివ్వబడిందని అంటున్నారు. ఈకాల్పుల వల్ల యాభైఏళ్ళ వృద్ధురాలు శ్రీమతి కుంచపు నాగలక్ష్మి, ఇరవైరెండేళ్ళ యువకుడు శ్రీబట్టి లాలయ్య మరణించారు.

ఈ గుంపు భూస్వామిపై దాడిచేసే పథకం వేసుకున్నదని, వాళ్ళు హింసాయుతంగా మారారని, బుద్ధిపూర్వకంగానే డీఎస్పీపై దాడి చేశారని అందువల్లనే కాల్పులు

జరపవలసి వచ్చిందని ఈ మొత్తం ఉదంతం గురించి చెప్తూ అధికారులు అంటున్నారు. కాని భూస్వామి తన ప్రాణానికేమీ ముప్పులేదని అంటున్నాడు. 'బుద్ధిలేని గ్రామస్తులు' డీఎస్పీ మామూలు దుస్తుల్లో వున్నందున గుర్తించలేదని, డీఎస్పీ వాళ్ళను శాంతింపజేయాలని ప్రయత్నిస్తే దాడి చేశారని గ్రామ పోలీస్ పటేల్ చెప్పాడు.

లాఠీచార్జ్, రాళ్ళు విసరడం, కాల్పుల మధ్య ఏపాటి వ్యవధైనా వుందని కమిటీ భావించడంలేదు. ఇవన్నీ ఒకదాని వెనక ఒకటి జరిగివుంటాయి. డీఎస్పీపై భూస్వామిపై దాడి చేయాలనుకున్నారన్న ఆరోపణ గురించి గ్రామస్తుల్ని ప్రశ్నిస్తే, వాళ్ళు తమ కలాంటి ఆలోచనే వుంటే వృద్ధ స్త్రీలను, బాలబాలికలను, చంటిపిల్లల నెత్తుకున్న స్త్రీలను కలుపుకొని ఊరేగింపు తీసివుండేవాళ్ళమే కాదని అన్నారు.

ఖచ్చితమైన సాక్ష్యం కాల్పులు చాలా త్వరగా మొదలయ్యాయని సూచిస్తున్నది. అక్కడ కాల్పులు జరగబోతున్నాయన్న ప్రకటన కానీ, పరిస్థితిని అదుపులోకి తేవడానికి జరిపే బాష్పవాయువు ప్రయోగం లాంటి పద్ధతులు కానీ అమలుకాలేదు. నడుము క్రింది భాగాన మాత్రమే కాల్పులు జరపవలసిందానికి బదులుగా తుపాకులు గుండెలకు గురిచేయడం జరిగింది. లాలయ్య కంటిలో నుండి బుల్లెట్ దూసుకుపోవడం ఈ విషయాన్ని రుజువుచేస్తుంది. ఆయన గాయపడి ఖమ్మం ఆస్పత్రిలో చేర్చబడింతర్వాత మరణించాడు. శ్రీమతి నాగలక్ష్మి విషయంలో ఆమె పరిగెత్తుతున్నప్పుడు కందకంలో పడిపోయిందని, మళ్ళీలేస్తున్నప్పుడు తుపాకి గుండు ఎడమ చంకలోంచి కుడివైపుకు దూసుకువచ్చిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పన్నెండేళ్ళ బాలుడు చల్లా లక్ష్మయ్యకు తుపాకీగుండు ఎడమ మోచేతిగుండా దూసుకుపోయింది. ఈ పరిస్థితిలో వాస్తవమేమిటంటే తుపాకి దెబ్బతిన్న వాళ్ళందరికీ నడుముపైనే గాయాలయినాయి. నడుము క్రిందనే గాని పైన కాల్పులు జరపగూడదన్న చట్టపరిమితికి ఇది నిజమైన, తీవ్రమైన అతిక్రమణ.

అన్ని సందర్భాల్లోనూ కాల్పులకు గురియైన వారు నిర్లక్ష్యం చేయబడ్డారు- చనిపోయిన నాగలక్ష్మి విషయంలో శవం పగలు రెండున్నర గంటల నుంచి మర్నాటి ఉదయం తొమ్మిది గంటలదాకా- పందొమ్మిది గంటలు- వీధిలో పడివుంది. పోస్ట్ మార్టమ్ అయింతర్వాత శవాన్ని బంధువులకిచ్చే బదులు కాల్పులు జరిగినప్పుడు ఎక్కడ పడిపోయిందో అక్కడే పడేసారు. ఆమె బంధువులు అంత్యక్రియలు జరిపితే, అంత్యక్రియలు జరిపినందుగ్గాను ఆమె అల్లుడు నిర్బంధించబడ్డాడు.

లాలయ్య ఆస్పత్రిలో చేర్చబడ్డ తర్వాత చనిపోయాడు- ఆయన చనిపోయిన మర్నాడు ఆయన భార్యకూ, తల్లిదండ్రులకూ ఆ విషయం తెల్సింది. పన్నెండేళ్ళ

లక్ష్మయ్య గాయపడి ఆస్పత్రిలో చేర్చబడ్డాడు- అక్కడ నుంచి విడుదల చేయబడిన తర్వాత ఆయన గ్రామానికి తన స్వంత ఖర్చుమీద రావాల్సివచ్చింది. ఆయన గ్రామానికి తిరిగి వచ్చింతర్వాత పోలీసులు రెండురోజులు నిర్బంధించారు- ప్రతిరోజూ ఉదయం పోలీస్ క్యాంప్‌లో కనపడవలసిందిగా ఆయన ఆజ్ఞాపించబడ్డాడు.

ఆ తర్వాతి సంఘటనలు వివరణాత్మక విచారణ జరపవలసినవి- అక్కడ ఎపిఎస్‌పి (రెండవ బెటాలియన్, కర్నూలు) వివిధరకాల అణచివేత పద్ధతులు మితిమీరి సాగిస్తున్నది. భూస్వామి ఫిర్యాదు చేసింతర్వాత, పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు వచ్చాయని వాళ్ళెన్నో చేయగూడని పనులు చేశారని గ్రామస్తులు చెప్పారు- అవి కింద యిస్తున్నాం.

1. స్త్రీలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు: చెరచడం గురించిన ఒక సంఘటన సంఘానికి నివేదించబడింది. ఆ స్త్రీ తల్లిదండ్రులు బాధాపూరితమైన గొంతుతో ఈ సంఘటనను గురించి సంఘానికి తెలిపారు. ఆ స్త్రీ ఈ విషయాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఏడ్చింది. పోలీస్ క్యాంప్‌గా ఉపయోగపడ్డ పంచాయితీ కార్యాలయంలో ఫిబ్రవరి ఒకటిన ఆమెను నిర్బంధించారు- ఆ రాత్రి కొందరు పోలీసులు నిద్రపోయారు; కొందరు గ్రామంలో గస్తీలు తిరగడానికి వెళ్ళారు- ఆ సమయాన పంచాయితి ఆఫీసులో యిద్దరు పోలీసులు ఆమెను కొట్టడమే కాక బలవంతంగా చెరిచారు. ఇంకొక రెండు మానభంగాల సంఘటనలు సంఘానికి తెలిసినయి- కాని ఆ స్త్రీలు ఊళ్ళో లేనందువల్ల సంఘం ఎంత ప్రయత్నించినా వాళ్ళను కలుసుకోలేకపోయింది.

స్త్రీలను బాధించిన ఇంకో రెండు ఉదంతాలు సంఘం దృష్టికి వచ్చినయి- మొదటి ఉదంతంలో రాఘవయ్య పశువులకు మేత వేసినందుగ్గాను ఒక పోలీసు ఆ స్త్రీ వెంట తగిలాడు.

ఇంకో ఉదంతంలో భర్త ఆనుపానులను గురించి పదిహేనేళ్ళ స్త్రీ సీతను ప్రశ్నిస్తూ పోలీసులు ఆమెను బలాత్కారం చేశారు. ఆమె మామ దేశగిరి భిక్షం మధ్యలో పోతే అయనను గాయపరిచారు. అందువల్ల ఆయన కుడిచెయ్యి ఎముక విరిగింది.

2. చట్ట వ్యతిరేక నిర్బంధాలు : పోలీసులు చాలామందిని చాలారోజులు చట్ట వ్యతిరేక నిర్బంధంలో వుంచారు- కొన్ని ఉదాహరణలు యిక్కడ యిస్తున్నాం. ఒక కాంపౌండర్ శ్రీ కృష్ణమూర్తి పదిహేడు రోజులు, శ్రీమతి దొడ్డా సుశీల పదమూడు రోజులు, శ్రీ నలమాస కొమురయ్య ఏడు రోజులు, శ్రీ ధరావత్ మల్లు ఐదురోజులు

నిర్బంధించబడ్డారు. శ్రీ దొడ్డా రంగన్న, శ్రీ దొడ్డా వెంకన్న తొమ్మిది రోజులు నిర్బంధించబడ్డారు– వీరు దొరికే వరకూ వీరి తండ్రిని నిర్బంధంలో వుంచారు.

నిర్బంధంలో వున్న వారిపట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని తెల్పబడింది. ఇద్దరు బాలలు పదేళ్ళ గగ్లోతుమేఘ్యా, ఎనిమిదేళ్ళ భానోతులక్కు– ఐదు రోజులు నిర్బంధంలో వుంచబడ్డారు. ఐదవరోజు 'రోలర్ ట్రీట్‌మెంట్'* కూడా యివ్వబడింది. దీనికి కారణం వాళ్ళు పాటలు పాడడం. మేఘ్యా ఈఉదంతాన్ని గద్గద స్వరంతో వివరించాడు.

3. నిర్బంధాలు, శారీరకదౌర్జన్యాలు: పండితాపురం, కొత్తలింగాల గ్రామాల్లో పదకొండుగురు స్త్రీలతో కలిపి ఎనభై ఆరుగురు వ్యక్తులు నిర్బంధించబడ్డారు. కొత్త లింగాలగ్రామంలో నిర్బంధింపబడ్డ ఇరవైనాలుగుమందీ పోలీస్‌పటేల్‌చేసిన ఫిర్యాదుపై నిర్బంధించబడ్డ వాళ్ళే. స్థానిక జనతానాయకుడు ఒకరు వ్యక్తిగత కారణాలపై పండితాపురంలో ఏడుగురు అమాయక ఇందిరా కాంగ్రెస్ కార్యకర్తలను నిర్బంధింపజేశాడని శాసన సభ్యుడు సంఘంతో చెప్పాడు. పాలు తాగేవయసు పిల్లలున్న ముగ్గురుతల్లుల్ని వాళ్ళ పిల్లల్నుంచి వేరుచేశారని, ఒక రెండేళ్ళపాప బయట వుండగా తల్లిదండ్రులిద్దరూ జైలుకు పంపబడ్డారని, అరవై ఏళ్ళ వృద్ధురాలు శ్రీమతి శాంతమ్మ నలభై రోజులపైగా జైల్లో వుంచబడిందని సంఘానికి నివేదించ బడింది. ఎంతో మంది వృద్ధ స్త్రీపురుషులు తమ కొడుకులూ మనవలూ అమాయకులని ఐనా వారిని నిర్బంధించారని సంఘంతో చెప్పారు. గ్రామంలో ప్రతి కుటుంబమూ ఒకశోకపూరితగాథ చెప్పగలదని సంఘం అభిప్రాయపడింది.

ప్రత్యేకంగా దొడ్డాసుశీలను అర్ధరాత్రి నిర్బంధించడం విషయంలో పోలీసులు రమీజాబీ సంఘటన తర్వాత ప్రభుత్వం యిచ్చిన ఆజ్ఞలను తీవ్రంగా భంగపరిచారు. ఆ ఆజ్ఞలు స్త్రీలను రాత్రి నిర్బంధించ గూడదని, పోలీస్ నిర్బంధంలో ఉంచగూడదని చెప్పాయి. ప్రశ్నించే కారణం మీదగూడా స్త్రీలను రాత్రిలలో పోలీస్ స్టేషన్‌లకు తీసుకరాగూడదు. ఇన్ని ఆజ్ఞలున్నాగూడా పోలీసులు పూర్వపుపద్ధతులనే, రమీజాబీ సంఘటనకు ముందున్న పద్ధతులనే ఆచరించారు.

* ఒంటిపై చెడ్డీ మాత్రమే వుంచి ఒక రోలర్‌ను శరీరంపై అటూయిటూ యిద్దరు పోలీసులు తిప్పే ఒక అమానుష క్రియను 'రోలర్ ట్రీట్‌మెంట్' అంటారు.

4. గ్రామస్తులపై పోలీసుల దౌర్జన్యం: పోలీసులు గ్రామస్తులను కల్లు, కోళ్ళు తెమ్మని బెదిరించినట్టు సంఘానికి నివేదించబడింది. భయంతో గ్రామంనుంచి పారిపోయిన వ్యక్తుల బంధువులను, తల్లిదండ్రులను కొట్టడం అనేది పోలీసులపై ఒక సాధారణమైన, అంతటా వినవచ్చిన ఫిర్యాదు.

రాఘవయ్య కుటుంబం మొత్తమే గ్రామంలో నుంచి పారిపోయిన ఉదంతం సంఘందృష్టికి వచ్చింది. ఆయింట్లో చాలారోజుల్నించి ఎవరూ ఉండక పోవడంవల్ల ఆయిల్లు పాడుబడ్డట్టుగా కనిపిస్తుంది. మేతలేకుండా, చూసేవాళ్ళు లేకుండావున్న పశువులు లోపలికీ బయటికీ తిరుగుతున్నాయి

పోలీసులు గ్రామస్తులు తమ పనుల్నించి రాత్రి ఎనిమిదింటికి యిళ్ళకువచ్చేయాలనిచెప్తున్నారు. చాలామంది గ్రామస్తులు, ముఖ్యంగా గౌడలు తమకు రాత్రి పదకొండింటివరకు పనివుంటుందని, అందుచేత రాత్రి ఎనిమిదింటికి యింటికి వచ్చేయలేమని చెప్పారు. ఈఆజ్ఞ వాళ్ళనెంతో కష్టపెడుతున్నదని వాళ్ళుచెప్పారు,

పండితాపురం ప్రజలు శిక్షించబడాలని పోలీసులు అనుకోవడంలేదని, కాని వాళ్ళను శిక్షించకపోతే చుట్టుపక్కలగ్రామాల్లో శ్రామికవర్గాలు పండితాపురంలో జరిగిన లాంటిఆందోళనలు మొదలు పెడతాయని అనుకుంటున్నారని సంఘం అభిప్రాయపడింది. జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ కూడా అట్లాంటి భయాన్ని సంఘంముందు వ్యక్తపరిచాడు.

పండితాపురం నేడు ఉదాసీన దృశ్యలతో కనబడుతూవుంది. గ్రామంలోని పేద ప్రజలు భయభీతావహ వాతావరణంలో జీవిస్తున్నారు. చాలా మంది అమాయక శ్రామికులు వరసగా బాధింపబడ్డారు. వాస్తవ మేమిటంటే భూస్వామికి వ్యతిరేకంగా ఎన్నో ఫిర్యాదులు చేయబడ్డప్పటికీ అధికార యంత్రాంగం ఎలాంటి చర్యా తీసుకోలేదు. కాని భూస్వామి చేసిన ఒక ఫిర్యాదును అధికారులు ఎంతో తీవ్రంగా పరిగణించి, పెద్ద ఎత్తున పోలీస్ బలగాల్ని పంపించి, చర్య ఎంతో త్వరగా తీసుకున్నారు.

ఇట్లాంటి పేద, అధికారంలేని గ్రామీణప్రజలపై జరిగే దుష్టచర్యల్ని అరికట్టడానికి విద్యావంతులు, వివేకవంతులు ప్రభుత్వంపై ఒత్తిడితీసుకురాకపోతే రాజ్యాంగం నిర్దేశించిన మౌలికహక్కులు, పౌరస్వేచ్ఛలు అర్థం లేకుండా అవసరంలేకుండా పోతాయి.

పండితాపురం గ్రామంలో వాస్తవాలను తెలుసుకోవడానికి, విశ్లేషించ డానికి వీలైనన్ని ప్రయత్నాలు చేసింతర్వాత వాస్తవ విచారణ సంఘం కింది సూచనలు చేస్తున్నది.

1. పండితాపురం సంఘటనలపై ప్రభుత్వం న్యాయవిచారణకు ఆజ్ఞాపించాలి- అందు వల్ల వాస్తవం తెలుస్తుంది.
2. ప్రజలపై అక్రమంగా విధించిన అన్ని కేసులనూ ఎత్తివేయాలి. నిర్బంధించబడ్డ అమాయక ప్రజలదంర్నీ విడుదల చేయాలి.
3. పండితాపురంలో పోలీస్‌క్యాంపు తీసివేయాలి.
4. కొండారెడ్డి చెరువుషికం భూమి ప్రభుత్వం స్వాధీనంచేసుకొని, భూమిలేని పేదలకు యివ్వాలి.
5. దోషులైన అధికారులను శిక్షించాలి.
6. మరణించినవారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి.

మృతవీరుల ఆశలతో మునుముందుకె పోతాం

రాజన్న

పండితాపురంలోన ప్రగతి బాట కొరకు
క్రాంతి పథంలోన కలిసొచ్చిన మీరు
అక్షరంరాని మీరు అన్ని తెలిసినవారు
పసుల కాసే మీరు పంటలు తీసేవారు
సంఘం బెడితిరి నాగ ఓ కూలోల్ల నాగ
॥పం॥

భూస్వామ్య దోపిడి బూడిద కావాలని
పొరంబోకు దున్న సమ్మెజేసి మీరు
ఊరు ఊరు తిరిగి నిరుపేదల కలిసి
నిజం చెప్తిరి నాగ ఓ కూలోల్ల నాగ
॥పం॥

నాటు కూలీపెంచ నడుంకట్టిన మీరు
వెట్టిచాకిరి పోను ఎదురు తిరిగితేను
భూస్వాములు కలసి రివిజనిష్టుల కలసి
సంఘ బలమునుచూసి కంగారెత్తిపోయి
పగబట్టిరి నాగ ఓ కూలోల్ల నాగ ॥పం॥

కూలి పెంచనోళ్ళు కూడుపెట్టనోళ్ళు
జీతగాళ్ళతోని భూస్వాములు కలసి
కొడవలి చేతబట్టి కోత కొయ్యపోయి
కూలి పొట్టలుకొట్టి కూడబెట్టిన దొరలు
కోత కొయ్యలేక మోత మొయ్యలేక
పొంగలు కక్కిరి నాగ ఓ కూలోల్ల నాగ
పోదిబెట్టిరి నాగ ఓ కూలోల్ల నాగ ॥పం॥

సంఘం గుట్టుమీరు బైట బెట్టలేక
పిల్లజెల్లతోని బాపచింపులు చుట్టి
దొరలకు లొంగాలంటే మీకు ఇష్టంలేక

వరికోతలకు మీరు ఓ కూలోల్ల నాగ
తూర్పుపోతిరి నాగ ఓ కూలోల్ల నాగ
॥పం॥

తూర్పుపోయిన రోజు కోతకొయ్యలేక
సంఘం వున్నంతసేపు మనకులోంగారనీ
పంట గి జలన్ని రాలిపోతూ వుంటే
మీరు అడిగిన రేటు మీకు ఇస్తామని
కాళ్ళు వేళ్ళుపట్టి గడ్డం చేతులు పట్టి
అరు కుండలరేటు ఓ కూలోల్ల నాగ
మీకు ఇచ్చిరి నాగ ఓ కూలోల్ల నాగ
॥పం॥

పదిహేను ఏండ్లనుండి భూస్వామి
దగ్గరవున్న
పొరంబోకు దున్న చెరువు షికంమీద
పోరుచేయ దలచి పట్టువిడవక మీరు
బువ్వలేని మీరు భూమిలేని వారు
దున్నేవానికె భూమి కావాలని కోరి
చెరువు మాదనిచెప్పి మీకు లేదనిచెప్పి
ఊరుఊరు కదిలి పోరుబాటను చూపి
ఎదురుతిరిగితిరి నాగ ఓ కూలోల్ల నాగ
॥పం॥

మీరు చేసెపోరు తుంచివేయాలని
భూస్వాములతోని రివిజనిస్టులు కలసి
పోలీసోల్ల పిలిచి క్యాంపులెన్నొ పెట్టి
కల్లుసార తాపి మేకపోతుల మేపి
మీపై తోలిర్రి నాగ ఓ కూలోల్ల నాగ
॥పం॥

ఇండ్లు సోదాచేసి కుండలు బైట వేసి
ఖాన్కా రావును పట్టి సుశీలమ్మను పట్టి
క్యాంపులపెట్టగ చూసి కదిలిపోయి మీరు
అక్రమ అరెస్టులను ఆపివేయాలని
పోలీసు క్యాంపులన్ని ఎత్తివేయాలని
భూస్వాములు పెట్టే యమబాధలు పోను
పాపంతెలియని మీరు కపటం
తెలియని మీరు
అన్నెంపున్నెం ఎరుగని అమాయక
పరిజలు కలసి
పొట్టిచేతులు ఎత్తి కూలీ నినాదాలిస్తే
భూస్వాములు వణికిరి నాగ
ఓ కూలోల్ల నాగ ॥పం॥

చేతులుచేతులు కలిపి ఎర్రజెండాలెత్తి
ఊరేగింపులతోటి ఊరుదద్దరిల్ల
మీ ఐక్యత చూసి పోలీసు వణికిపోయి
ముందు చెప్పకుండ వెనుక లాటీలతోని
మీచర్మం పగలా మీకు రక్తం గారా
రక్తం చూసిన మీరు రక్తము వుడుకంగ
మీపై కాల్పులు జరిపి ఓ కూలోల్ల నాగ
మిమ్ముల చంపిరి నాగ ఓ కూలోల్ల నాగ
॥పం॥

పోరాటంలోను మీ పాత్ర సాక్షి
తుపాకి గుండ్లకున్న మీ రక్తం సాక్షి
మీరు కలలుకన్న మంచి బతుకులకొరకు
పోరు ఆపకుండ పోతాము ముందుకె
మీతో వస్తాం నాగ ఓ కూలోల్ల నాగ
రాజ్యం తెస్తం నాగ ఓ కూలోల్ల నాగ
రైతుకూలీ రాజ్యం తెస్తం నాగ
ఓ కూలోల్ల నాగ ॥పం॥

[జనవరి 31వ తేదీన ఖమ్మం జిల్లా పండితాపురంలో రైతుకూలీ
ఊరేగింపుపై పోలీసులు కాల్పులు జరపగా బలి అయిపోయిన
కామ్రేడ్స్ కుంచపు నాగలక్ష్మి, వట్టి లాలయ్యల స్మృతికి—]

వీర తెలంగాణ విప్లవ పోరాటంలో పండితాపురం పాత్ర:

గోరీల మీది పూలు

గంగినేని వెంకటేశ్వరరావు

పద్దెనిమిది, ఇరవయి మంది సుపుత్రుల్ని దళాల్లోకి పంపిన కీర్తి పండితాపురానికే చెందింది. ఆ పుత్రుల్లో పున్నయ్య ఒకడు. ఆయనకు ఒకకన్ను కాయకాసి పోయింది. ఒకటే కన్ను, మహా మొరటుగా వుంటాడు. వడ్డెర. చదువురాదు. కూలి పని చేస్తున్నవాడు, రజాకార్ల కాలంలో దళాలలోకి వచ్చాడు.

ఆయన మాట్లాడితే అందరికి నవ్వొచ్చేది. 'తెత్తెత్తే' అంటూ నత్తితో మాట్లాడుతాడు. ఆయన మాత్రం కామ్రేడ్స్ ఎంత ఎగతాళిచేసినా, వెక్కిరించినా తొణుకు బెణుకు లేకుండా వుంటాడు. నిశ్చలంగా, నవ్వుతూ కామ్రేడ్సుతో మెదిలేవాడు.

చదువు నేర్చుకోను ప్రారంభించాడు. తీరికవున్నప్పుడల్లా పుస్తకం ముందేసుకొని కూర్చునేవాడు. పెన్సిలు, తెల్లకాగితాల నోటుబుక్కు ఎప్పుడూ చేతిలోవుండేవి. తలగుడ్డచుట్టి మోకాటిపైన ఎగదీసి బుట్టపెట్టి, దోవతికట్టి పార్టీపని చేసేవాడు.

శ్రీనివాసరావు కొరియరుగా వుంటున్నాడు. దళాన్ని, శ్రీనివాసరావును ఒక చోటవుంచి తెల్లెలపాడులో అన్నం తీసుకొని తానువెళ్లాడు. అతిజాగరూకతతో పనులు చేస్తాడు. దారిలోవున్న వాగులో మిల్టరీ, రజాకార్లు మాటుకాసి వుండటం దూరంగా వుండే గ్రహించి, వెనక్కి తిరిగిపోతున్నాడు. వాళ్ళు చుట్టూ కమ్ముకొని, వచ్చి, వెంటబడ్డారు. ముగ్గురు పరుగెత్తుతున్న పున్నయ్యను పట్టుకున్నారు. వాళ్ళను ఒడిమీద ఒకణ్ని వేసి, చిత్తుచిత్తుగా తన్ని తప్పించుకొని దళంలో కలిశాడు. అరివచాకిరీ చేస్తాడు; ఈ పనిచేస్తాను ఇంతే నేను చేయగల్గుతానని ఎప్పుడూఅనడు. ఎంతపని వుంటే, ఎంతపని చేయమంటే అంతపని చేస్తాడు. కష్టసుఖాలు పేర్లు. తూకాలు, రూపాలు తెలీవు. పార్టీపని అంటే ఎంత అవస్థయినా పడిచేయడమే ఆయనకు తెలిసినవిద్య.

పార్టీ రాజకీయాలు తెలుసుకొని, సమస్యల పరిష్కారమార్గాలు కామ్రేడ్సునడిగి కనుక్కొని- తనకు తెలిసిందంతా ప్రజలతో విసుగూ విరామం లేకుండా ఆసక్తితో చెపుతుంటాడు. చర్చిస్తుంటాడు, సిగ్గుపడకుండా, పక్కవాళ్లు నవ్వుతున్నా పార్టీ పరిస్థితి, ప్రపంచ రాజకీయాలు ప్రజలకు చెపుతుండేవాడు.

యాక్షను అయిపోయింది. ఇల్లెందు తాలూకానుంచి పాల్వంచ తాలూకా విస్త్రుతానికి దళాలు తరలిపోతున్నాయి.

"రెండురోజులు సెలవు యిప్పించండన్నా, మాయింటి దాన్ని, పిల్లల్ని, చూసి వస్తా" నని దళకమాండరు నడిగాడు.

"త్వరలో వస్తావా పున్నయ్యా !"

"రెండురోజుల్లోవస్తా, ఎల్లుండి రాత్రికి మీరు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా" నన్నాడు.

"చాల జాగ్రత్తగా వెళ్ళాలిసుమా, మిల్టరీనిఘా అన్నిచోట్లవుంది. వెళ్ళి వెంట నేరా" అని కమాండరు పున్నయ్యను సాగనంపాడు.

భార్య దగ్గర కెళుతున్నాననే సంగతి మనస్సుకు తట్టినప్పుడు హృదయం పొంగెత్తింది. మూడేళ్ళబట్టి భార్యను చూడలేదు. ఎలావుందో? ఏమంటుందో? ఎన్ని దుర్భర కష్టాలు పడుతుందో, ఇంటికెళ్ళగానే కసుక్కుంటుందో? లేదో? పిల్లలు ఎల్లావున్నారో? చిన్నోడు మాటల్లోపడి వుంటాడు; పెద్దపిల్ల పైటవేసుకుంటూ వుంటుంది; చంటాడు నడుస్తూవుండాలి; జాగ్రత్తగా ఇంట్లోకి వెళ్ళాలి; పున్నయ్య మనస్సు పరిపరివిధాల పోతూంది. ఎన్నో వూహలు, కుతూహలాలు హృదయం ఆవరించాయి. ఎంతో ఆశగా భార్య దగ్గరికి వెళ్తున్నాడు;

ఊరిబయటకొచ్చాడు. పొద్దుగూకింది. గొడ్లుపొలాల నుండి వూళ్ళోకివస్తున్నయి మనుషులు చేలనుంచి యిళ్ళుచేరుకుంటున్నారు. పరమానందంగా, పురుకు పరుగుల మీద ఇంటి కెళ్తున్నాడు. వూరి డొంకలోన మాటుకాసి వున్న మిల్టరీ పట్టుకుంది. చేతిలో ఆయుధంకూడ లేదు. వాళ్ళదగ్గర పెద్ద పెద్ద ఆయుధాలున్నాయి. అదీ వాళ్ళు నలభై మంది వున్నారు. ధైర్యంచేసి పట్టుకున్న ఇద్దరు మిల్టరీవాళ్ళను పడదోసి పరుగెడుతున్నాడు. వాళ్ళు వెంటబడ్డారు. విపరీతంగా కాలుస్తున్నారు. లైటు బాంబులు వేస్తున్నారు. పున్నయ్య పరిగెత్తివెళ్ళి దగ్గరున్న చెరువులో దూకి చాలాదూరం ఈది, చప్పుడు కాకుండా ఒక బండచాటున చెరువులో నక్కాడు. మిల్టరీ చెరువుచుట్టూచేరి రైఫిళ్ళు ఫెళఫెళ లాడిస్తున్నారు. నెత్తిమీదుగా గుళ్ళు దూసుకుపోతున్నాయి. లైటు బాంబుల కాంతిలో అంతా వెన్నెలలాగ అయింది, చెర్లో జలగలు విపరీతంగా వున్నాయి. అవన్నీ దట్టంగా పున్నయ్యను పట్టుకొని పీకుతూన్నయి. కదిలితే నీళ్ళచప్పుడవుతుంది. అట్టానే తెల్లవారుజాముదాకా వున్నాడు. మిల్టరీ కాల్చి కాల్చి విసిగి వెళిపోయింది. వాళ్ళంతా పోయింతర్వాత ఇంటికెళ్ళకుండా మళ్ళా దళం దగ్గరకు వచ్చికలిశాడు.

ఉత్తర ఇల్లెందు ఆర్గనైజరుగా వేశారు. దళ సభ్యుడి బాధ్యతకంటే ఇదిచాలా కష్టమయింది ఎంతో బాధ్యతతో కూడింది. ఎంతో సహనంతో, నేర్పుతో వుద్యమాన్ని అక్కడ దృఢతరం చేశాడు.

పొద్దుపొడిచి బారెడెక్కింది. పున్నయ్య ఒకదళం తీసుకొని యాలంబయలులో మీటింగు పెట్టడానికి వచ్చాడు. మీటింగుకు అన్నీ సిద్ధం చేశారు. వెయ్యిమందికిపైగా వచ్చారు.

భూస్వాములు కుట్రచేసి ముందుగానే మనిషిని పాల్వంచ పంపించి, మిల్టరీని పిలిపించారు. నిలభై మంది మిల్టరీ తెల్లబట్టలు కట్టుకొని, ఆయుధాలు భుజాలకు తగిలించుకొని, పైపంచ కప్పుకొని మామూలు మనుషుల్లాగావచ్చి మీటింగులో అక్కడొక్కడు అక్కడొకడు కూర్చున్నారు. భూస్వాములు, ద్రోహులు, ప్రజావ్యతిరేకులు-ఒక్కొక్క కామ్రేడ్ దగ్గర ఇద్దరిద్దరున్నారు. కమాండరు ఉపన్యాసంఇస్తున్నాడు. ప్రజలు ఉపన్యాసం వింటూన్నారు. కామ్రేడ్స్ ఏమరుపాటుగా, ఎవరిపనుల్లో వాళ్ళున్నారు.

హఠాత్తుగా దళకామ్రేడ్స్‌మీద మిల్టరీ, ద్రోహులు పడ్డారు. భూస్వాములిద్దరు పున్నయ్యనువాటేసి, కిందపడేసి, పట్టుకున్నారు. పున్నయ్య వాళ్ళను పడతోసి, పరుగెత్త ప్రయత్నిస్తుంటే -మరో యిద్దరు ద్రోహులు వచ్చి పగ్గాలు వుచ్చులేసి పున్నయ్యను పట్టుకున్నారు. దళకమాండరు ఇంకో అయిదుగురు దళసభ్యులు చిక్కకుండా పోయారు.

పున్నయ్యతో పాటు మరో ముగ్గురు కామ్రేడ్స్ దొరికారు. అక్కడే- ఆనడి బజారులోనే - అన్ని వందలమంది ప్రజలయెదుటే- కొళ్ళగుదికట్టి హింసిస్తున్నారు. పైన పగలు విచారంతో వెచ్చనయింది. చుట్టూ యాలంబయలు వీధులు దిగులుపడి మౌనముద్ర వహించాయి. కింద నేలతల్లి జాలిపడి కంపిస్తూంది.

"దళం ఎక్కడికి పోయింది?"

"ఏమో. మీరేచూశారుగా, మీరు చూస్తుండగానే వెళ్ళిపోయింది, ఎక్కడికి పోయిందని మమ్మల్ని అడిగితే" అని సమాధానం చెప్పాడు.

"దళకమాండరు ఎవరు?" అడిగాడు మిల్టరీ ఆఫీసరు ఒకవేపు. ఆ ముగ్గురు కామ్రేడ్స్‌ను నేలపడేసి బాదుతున్న పోలీసు హంతకుల దెబ్బల ధ్వనిలో-

"మేమంతా దళ కమాండర్లమే।"

"ఏవ్వారు?"

"చెప్పం"

"పేర్లు?"

"చెప్పం"

"బాధ్యతలు?"

"చెప్పం"

"దళం పేరు?"

"చెప్పం"

మిల్టరీ ఆఫీసరు నిప్పులుతొక్కిన కోతిఅయ్యాడు కళ్ళు నెత్తుర్లు కమ్మాయి. కోపంతో, పిచ్చికుక్కలాగా చిందులు తొక్కుతూ "ఆ లంజకొడుకుల్ని సున్నం సున్నంగా మర్దించండి! ఆ ముండలకు మూతిమీసాలెందుకు పీకిపారేయండి! కిరసనాయిలుతో గుడ్డలు తడిపి ఒక్కొక్క కండమీదవేపి తలగబెట్టండి! వళ్ళంతా కుతకుత వుడికి చావనీయండి" అని ఆర్డరిచ్చాడు ఆఫీసరు.

ఆ హంతకులు నిజంగానే కిరసనాయిలుతో గుడ్డపేలికలు తడిపి, ఆ కామ్రేడ్స్ వంటిమీద పడేసి ఒక్కొక్కభాగం తగల పెడుతున్నారు. ఇప్పటిదాకా లాఠీలతో వళ్ళంతా పప్పు పప్పు అయ్యేట్టు చితికకొట్టారు. పున్నయ్య కాయకన్ను పగిలి రక్తం కారిపోతూంది.

సంతోషంగా భూస్వాములు, ప్రజా వ్యతిరేకులు- ఈ దృశ్యంచూసి నవ్వు తున్నారు. బాధగా, చింతతో ప్రజలు కళ్ళనీళ్ళుకుక్కుకుంటున్నారు.

"అబ్బా....ఆ....ఊ....దాహం........కాల్చి పారేయండ్రా ....ఆ....ఓ.... అబ్బా...." అంటూ బాధ వెళ్ళ బోసుకుంటున్నారు దుర్భరంగా- ఆ కామ్రేడ్స్.

"చెప్పండి, లంజకొడకల్లారా, మీరహస్య కేంద్రాలు చెప్పండి, మంచినీళ్ళు ఇస్తాం. మీ డంపులు ఎక్కడున్నాయో చూపించండి, వదలిపెడతాం" అని మొరుగు తున్నాడు క్రూరంగా ఆఫీసరు.

"చె....ప్పం" నలుగురూ ఒక్కసారి ఏకకంఠంతో.

పొద్దు నెత్తి ఎక్కింది. నెత్తిమీదినుంచి జారిపోతుంది. భూస్వాములు, మిల్టరీ సుష్టుగా భోజనాలు చేశారు. కాఫీలు, ఫలహారాలు సేవిస్తున్నారు. కాని ఆ కామ్రేడ్స్ అలానే వీధిలో స్పృహతప్పి శవాలలాగా పడివున్నారు. వారిదేహం నుండి జారిన రక్తంకు చీమలు పడుతున్నాయి! వారి వంటి మీదున్న గాయాలమీద 'జుయ్' మని ఈగలు ముసురుతున్నయ్!

సాయంత్రం వూరి బయటికి ఆనల్గురు కామ్రేడ్స్‌ను మిల్టరీ తీసికెళ్ళింది. మిల్టరీతో భూస్వాములు, ప్రజాద్రోహులు, వేడుకజూడను వెళ్ళారు. ఆనలుగురిని పిట్టల్ని

కాల్చినట్టు "ఠమ్‌ఠమ్‌ఠమ్‌ఠమ్" కాల్చివేశారు. వాళ్ళ తుపాకిగుళ్ళ సంగీతాన్ని "కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్" అనే వారి జీవనగీతం, జీవిత నినాదం కలిసి, లయ కలిపి, పాడి సూర్యాస్తమయంలో కరిగిపోయాయి!

ఆ నలుగురువీరుల శవాలు ఒక కొట్లోవేసి- పైన కాస్త కట్టెవేసి, నిప్పంటించి, సంతృప్తిగానవ్వి మిల్టరీ, ఖూస్వాములు వెళ్ళిపోయారు.

వారి శవాలు మండుతూ, పచ్చని, వెచ్చని పొగలు కక్కుతున్నాయి. ఆపొగలు వుమిసే నీలిమంటలు నింగినంటుతున్నాయి. వారి దేహాలుకాలి, పేలి, భస్మమయి, అదృశ్యమవుతుంటే- ఆత్మలు మాట్లాడుతూన్నయి!

పున్నయ్య-

నేను పలుగూ, పారా, తట్టతీసుకొని రాళ్ళుకొట్టే, ఇళ్ళుకట్టే రోడ్లువేసే నికృష్ట జీవు లయిన వడ్డెరకుటుంబంలో పుట్టాను. రెక్కలు ముక్కలుచేసి బ్రికుకుతెరువు చూసుకునేవాణ్ని! కౌలుపొలం చేసేవాణ్ని! పుట్టుబానిస భావాలతో బాధలదో నాజీవితం పెనవేసుకొనివుంది!

పార్టీలోకి వచ్చాను. నేను సంపూర్ణంగా మారిపోయాను. చదువునేర్చుకున్నా. నాజాతినిగురించి, దేశంగురించి ఆలోచించేజ్ఞానం సంపాదించాను. నాపిల్లల్ని ఉత్తమ కమ్యూనిస్టులుగా చేద్దామని వువ్విళ్ళూరాను.

విప్లవం జయిస్తుంది! తెలుగుజాతి విముక్తికి జరిగే స్వాతంత్ర సమరం చరమాంకం చూడకుండా చనిపోతున్నా! కాని భవిష్యత్తు ప్రజల సొత్తుచేయడంకోసం నేను జీవిత బలిదానం చేస్తున్నా....

శేషయ్య-

నాపేరు శేషయ్య. మాది సింహపుడి. కయ్యంతాలూకా చిన్నరైతును. పొద్దు గూకులు, ఎద్దులతోపాటు నేనో ఎద్దుగా తయారయి వాటిభాష మాట్లాడుతూ, వాటిక్షేమ సమాచారాలు విచారిస్తూండేవాణ్ని!

తెలంగాణా రైతుకూలీ విప్లవంరాగానే- నేనూ అందులో పాల్గొనదలచి పోరాట పిలుపు అందుకొని పనిచేస్తున్నా. ఈవిప్లవాన్ని నిర్మించి, నడుపుతున్న కమ్యూనిస్టు పార్టీతో సంబంధం పోరాటంలోనే కల్గింది. నేను పార్టీసభ్యుణ్ణి అయ్యాను! పార్టీ జీవితమంతా కొరియరుగా పనిచేశాను.

మాఆవిడ ఎప్పుడు విప్లవం జయిస్తుంది, ఎప్పుడు మనం స్వేచ్ఛగా, సుఖంగా వుంటాము అని అడుగుతుండేది। మమ్మ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ, నీకోరికలు ఎప్పుడు కొండెక్కుతాయి నాయినా అని ప్రశ్నిస్తుండేది. జయప్రదంగా సమాప్తమయ్యే స్వాతంత్రసమరం చివరి నిమిషాలు చూడకుండా వెళ్ళిపోతున్నా। నేనుకోరిన స్వర్గం అనుభవించే ముందు తరాల సోదర సోదరీలనుచూసి, సంతుష్టి చెందమని నాతల్లీ, భార్యలకు చివరిసారి చెపుతున్నా।

కమ్యూనిస్టుపార్టీ సభ్యుణ్ని అయినందుకు సంతోషిస్తున్నా. ఉత్తమ మానవుడిగా మరణిస్తున్నందుకు ఉప్పొంగుతున్నా....

బుచ్చయ్య—

మాది జెండాలపాడు. నేను కోయను. అడివితప్ప వేరే ప్రపంచంవుందని సంగంవాళ్ళు మావూరు వచ్చిందాకా తెలీదు। నిజాంప్రభుత్వం దోపిడి పరిపాలన తుదముట్టించ డానికి దళాలలో చేరాను. నేటిదాకా దళసభ్యుడిగా పనిచేశాను।

విపరీత హింసాకాండను, దుర్భర కష్టజీవితాన్ని, నరకంకంటె భయంకర మయిన అగ్నిపరీక్షలు తలదించకుండా భరించేశక్తి, జయించే సామర్థ్యం నాకు కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం యిచ్చింది।

తెలంగాణా విముక్తికి నావంతు త్యాగంచేసిపోతున్నా! నాధర్మాన్ని పరిపూర్ణంగా నిర్వర్తించిపోతున్నా! నేనెత్తిన జండా పదికాలాలపాటు ఎర్రగా ఎగరడానికి నారక్తం చిందించుతున్నా। నేను చేరిన కమ్యూనిస్టుపార్టీకి ఎలాంటి అగౌరవం, అప్రతిష్ట తీసుకురాకుండా పోరాడి చనిపోతున్నా! నేను ప్రేమించిన ప్రజలు సుఖమయజీవితాన్ని గడపడానికి నా జీవితం అంకితం చేస్తున్నా....

కన్నయ్య—

మాది పాతర్లగడ్డ. ఇల్లెందు తాలూకా, నేనుకోయను. అడివిలోగడ్డలు, కాయలు ఆకు, అలంతిని బ్రతకటంకంటె నాకు వేరే సంగతులు తెలీవు. గోచిపెట్టుకొని పొద్దు గూకులు అడవిలో జంతువులాగా కడుపులో ఆకలిచల్లార్చుకోను తిరిగేవాణ్ని! మాకోయ జాతిని సమానంగా, గౌరవంగా చూసే మనుషులు బయటి ప్రపంచంలో వుంటారని నేనూహించలేదు। నాకు తెలిసిన, నేనుచూసిన తెల్లబట్టల వాళ్ళంతా మమ్మల్ని పురుగులుగా, మృగాలుగాచూసి, అసహ్యించుకొని, ఏడ్పించి. దోచి, వున్నది కాస్తా ఎత్తుకొని పోయేవాళ్ళు।

సంగంవాళ్ళు వచ్చి నమ్మశక్యంకాని ప్రపంచం చూపారు. మొదట వీళ్ళని నమ్మలేదు! వాళ్ళు వాళ్ళతోపాటు మమ్మల్ని గౌరవించారు. మా దరిద్రానికి కారణం చూపారు. మాలాంటి అభాగ్యులు ఎందరున్నారో, ఏంచేస్తున్నారో అర్థమయ్యేట్టు చేశారు. మేము అందాకా తతిమ్మా కులాలన్నీ మాకు వ్యతిరేకమయినవిగా, మా శత్రువులుగా చూసేవాళ్ళం. సంగంవాళ్ళు ఆకలితో అలమటించే నికృష్టజీవులందరిదీ వకటే కులం అని ఒప్పించారు.

నేను కమ్యూనిస్టుపార్టీలో సభ్యుణ్ని అయినందుకు మహా అదృష్టవంతుడిగా భావిస్తున్నా। విప్లవంలో పాల్గొనే అవకాశం లభించినందుకు జీవిత సార్థకత పొందా ననకుంటున్నా। నాజీవితాన్ని ప్రతిఘటనోద్యమానికి అర్పించగల్గు తున్నందుకు ఆనంద పరవశుణ్ణవుతున్నా! కాని పాపం నాభార్య ఏంచేస్తుందో? మేమిద్దరంకలిసి ఏడురోజులే కాపరం చేశాం.... ఎన్నెన్ని కోరికలు పోగుచేసుకున్నాం? ఆ వారంరోజులు స్వర్గంలో జీవితమంతా పరిమళించే ఆశలు, ఆనందాలు పచ్చ పచ్చగా తీవెలుసాగి అల్లుకున్నాయి. కొడుకు పుడతాడనుకున్నాం- వాడు పుడితే 'విప్లవకుమార్' అని పేరు పెట్టేవాణ్నే. నేను చనిపోయినా, నా మార్గాన్నివాడు ముందుకు తీసుకపోయేవాడు కాని ఎనిమిదోరోజే పార్టీకుటుంబాన్ని వదలిపెట్టి దళాలలోకి రమ్మని పిలిచింది. నాభార్య ఎంత ఆశగా, బాధగా, అగాధంగా చూసింది- నేను సెలవు చెప్పినప్పుడు! అబ్బా! ఆ దృశ్యం నాకళ్ళ ముందు నరిస్తూంది!

కాని స్వాతంత్ర్య యుద్ధం జరిగేప్పుడు భార్యాపిల్లల విషయం ఆలోచిస్తూ కూచో కూడదు. సుఖదుఃఖాల అంచనావేస్తూ గోళ్ళు గిల్లుకోకూడదు. అంచేతే దళ సభ్యుడిగా, కొరియరుగా నేటిదాకా వెనక్కి పారచూడకుండా పనిచేశాను! పోరాడాను!....

['ఎర్ర జెండాలు' రెండవ భాగం నుంచి]

మార్చ్

మీ గుండెల్లో నెత్తురు
ఒక్క చుక్క మిగిరున్నా
మీ రక్తం
మీ శక్తి

పీల్చి తాగు జలగల్లో
ఏ ఒక్కటి బతిలున్నా
పోరాటం ఆపకండి।
ఆ బాటనె కదలిపొండి!

— బి. పాండురంగారెడ్డి

ఒక పరిమిత సంఘర్షణ

అమెరికా సంయుక్తరాష్ట్రాలను ఇండోచైనా ప్రజలు ఓడించకముందు నుంచీ సోవియెట్‌యూనియన్ తన ప్రభావాన్ని ఉత్తరవియత్నాంపై చూపెట్తోంది. అమెరికా వ్యతిరేకపోరాట ఉద్దేశ్యాలతో ఉత్తర వియత్నాం ప్రభుత్వమూ, దక్షిణ వియత్నాం తాత్కాలిక విప్లవ ప్రభుత్వమూ చైనాతోనూ రష్యాతోనూ సమంగా సంబంధాలు నెలకొల్పుకున్నాయి. దక్షిణవియత్నాం విముక్తమైన తర్వాత, రెండు వియత్నాంలూ ఏకం చేయబడ్డ తర్వాత వియత్నాంపై రష్యా ప్రభావం వేగంగా దృఢపర్చబడింది. చివరికి ఒక సానుభూతిపర పరిశీలకురాలైన కాథలీన్ గో (Cathalene Gough) 'వియత్నాం పునర్నిర్మాణం : పదిరెట్లు అందం' అనే పుస్తకంలో 1976 లో తన వియత్నాం సందర్శన సందర్భంలో ఇట్లా రాసింది– "వియత్నమీయులు చెప్తున్న 'సోషలిస్ట్‌క్యాంప్'లో ప్రతిఒక్క దేశంతో రాజకీయంగా నిష్పక్షపాతంతో వ్యవహరించడానికి బదులు నవంబర్ 1976 నుంచి వియత్నాంకు రష్యా అత్యంత సన్నిహిత మిత్రదేశమయింది." ఇంకా ఆమె "సోవియట్ ట్రక్కులు, యంత్రాలు వియత్నాంలో విస్తారంగా వున్నాయి– సోవియట్ సాంకేతికనిపుణులు కూడా వియత్నాంలో చాలామందే వున్నారు– సోవియట్ విమానాలు హనోయ్ నుంచీ, హనోయ్‌కీ తరుచూ తిరుగుతుంటాయి. వేలాది వియత్నాం విద్యార్థులు రష్యాలో ఉన్నతవిద్య నభ్యసించ గలుగుతున్నారు." అంతర్జాతీయ వ్యవహరాలలో సోవియట్ యూనియన్‌ను విధేయంగా అనుసరిస్తున్న వియత్నాం ప్రభుత్వం ఇందిరాగాంధీ ప్రభుత్వాన్నీ, భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రకటననూ 1975 లో శ్లాఘించింది.

ఇంకోవైపు చైనాతో వియత్నాం సంబంధాలు వేగంగా చెడిపోవడం మొదలైనవి– ఇది అమెరికా వ్యతిరేక పోరాటంలో వియత్నమీయులు చైనా నుండి స్వీకరించిన సన్నిహిత రాజకీయ వస్తు సహాయ దీర్ఘకాల చరిత్రను తారుమారు చేయడమే– 1974 లోనే 121 'సాయుధమైన రెచ్చగొట్టే సంఘటనలూ, దురాక్రమణలూ' వియత్నాం జరిపిందని చైనా యిప్పుడు ఆరోపిస్తున్నది, వియత్నాం 1977 లో ప్రారంభించిన 'చైనీయులను దేశం నుంచే వెళ్ళగొట్టే కార్యక్రమం' రెండు దేశాలమధ్య సంబంధాలను ఇంకా అశాంతిమయం చేసింది. ఇట్లా లక్ష ఇరవై వేల మంది చైనీయులు వియత్నాం నుంచి వెళ్ళగొట్టబడ్డారని అంచనా వేయబడింది. వీరిలో చాలా మంది ఉత్తర వియత్నాం నుంచే వెళ్ళగొట్టబడ్డారు. ఉత్తర వియత్నాం చాలా సంవత్సరాలు సోషలిస్టు దేశంగా వున్నది కాబట్టి ఇవ్వాళ కొత్తగా తాను సోషలిస్టు విధానాలు అవలంబిస్తున్నది కాబట్టి ఈ ప్రజలు దేశాన్ని వదిలి పారిపోతున్నారు అని నమ్మించ

జూడడం పొసగడం లేదు. ఇక చివరికి చైనా వియత్నాంకు తన ఆర్థిక సాంకేతిక సహకారాన్ని జులై 1978 లో ఆపివేసింది.

రుమేనియా తప్ప మిగిలిన రష్యా ఉపగ్రహ దేశాలతో కూడిన పరస్పర ఆర్థిక సహకార సంఘం (Council of Mutual Economic Assistance) లో 1978 జూన్‌లో చేరడంతో సోవియట్‌యూనియన్‌తో తన అభివృద్ధి చెందుతున్న సంబంధాలకు వియత్నాం ఒక రూపునిచ్చింది. ఐదు నెలల తర్వాత వియత్నాం ఉన్నత నాయకులతో కూడిన ఒక బృందం మాస్కోకు పోయింది. ఈ బృందంలో లేదువాన్, ఫామ్‌వాన్ డాంగ్ కూడా వున్నారు. ఈ బృందం స్నేహ సంబంధాలు, సహకారం అనే అంశాలకు సంబంధించిన ఒక ఒడంబడికపై రష్యాతో కలిసి సంతకం చేసింది. ఈ ఒడంబడిక రెండు దేశాలమధ్య సైన్య సహకారం వుంటుందని బహిరంగంగా చెప్పింది. ఈ సహకారం వియత్నాంకు మిగ్-23 విమానాల, సముద్రి ఆయుధాల, రాకెట్ల, సోవియట్ సైనిక సలహాదార్ల వరదతో విశదమయ్యింది. సోవియట్‌యూనియన్ మధ్య వియత్నాంలోని కామ్‌రాన్ అఖాతంలో వున్న కామ్‌రాన్ సముద్రి స్థావరాన్ని ఉపయోగించడం మొదలుపెట్టింది.

ఈ పురోగమనాల ఫలితాలు ఇండో చైనాలో తీవ్రంగా ప్రతిఫలించడం మొదలైంది. 1967 లోనే వియత్నాం కంపూచియాలు ఒక సరిహద్దు ఒడంబడిక కొచ్చాయి. ఆ ఒడంబడికపై సంతకం చేసినప్పుడు తాము అమెరికా వ్యతిరేక యుద్ధంలో మునిగి పోయి వున్నామనే సాకుతో వియత్నాం ఆ ఒడంబడికను 1976 లో నిరాకరించింది. కంపూచియా సరిహద్దు పొడవునా వెంటవెంటనే జరపబడ్డ వియత్నాం దాడులు దీన్ని బలపర్చినయి. ముందు నెలలో రష్యాతో చేసుకున్న ఒడంబడిక రక్షణగా వియత్నాం చివవరికి 'కంపూచియా జాతీయ రక్షక ఐక్యసంఘటన' అనబడే దాని ఆవిర్భావాన్ని 3 డిసెంబర్ 1978 న ప్రకటించింది. ఇది కంపూచియాలోని పోల్‌పాట్ ప్రభుత్వాన్ని కూలదోసే ఒక పెద్ద సైనిక నేరానికి వియత్నాం చేస్తున్న సూచన అనే భీతి నిజమేనని కొద్ది వారాల్లోనే తెల్పిపోయింది. 25 డిసెంబర్ 1978 న కంపూచియాపై వియత్నాం దళాలు అన్ని దిశల నుంచీ పెద్దఎత్తున దాడులు ప్రారంభించాయి. 7 జనవరి 1979 న వియత్నాం నామ్‌ఫెన్‌ను ఆక్రమించుకుని, వారి సృష్టి ఐన నూతన ప్రభుత్వాన్ని స్థాపించినట్లు ప్రకటించింది. దీనితో; ఇంతకుముందే లావోస్‌లో స్థాపించబడ్డ సుస్థిర ప్రభుత్వంతో వియత్నాం తన ఎన్నాళ్ళ కోరికో ఐన తన అధికారంలోవుండే 'ఇండో-చైనా ఫెడరేషన్'ను సాధించానని చెప్పుకోవచ్చు.

మొత్తం ఈ సంఘటనల నేపథ్యంలో చూసినప్పుడు వియత్నాం సరిహద్దుల వెంబడి చైనా ఎదుర్కోడానికి చాలా పరిమితమైన లక్ష్యాలున్నాయని అర్థమవుతుంది. లావోస్, కంపూచియా చైనా సరిహద్దులు అతిక్రమించి కవ్వించడానికి వియత్నాం ప్రయత్నిస్తూవుంటే అవసరమైతే శిక్షించడానికికూడా చైనా వెనుకాడదని వియత్నాంకు గుర్తుచేయ దల్చుకున్నది. చైనా 'ఎదురుదాడి' వియత్నాంను కంపూచియా నుంచి కొన్ని దళాలను వెనక్కి తీసుకోవడానికి గానీ, సోవియట్ బలంతోవున్న శక్తివంతమైన వియత్నాం శతృలకు బలమైన దెబ్బగా గానీ ఉపయోగపడుతుందని చైనీయులు అనుకోలేదు. ఐనా టెంగ్‌సియావో పింగ్ 'వియత్నాం అజేయత్వ భ్రమ'ను బహిర్గతం చేయదల్చుకున్నట్టు ప్రకటించారు కాబట్టి చైనీయుల 'ఎదురుదాడి' కొద్ది సమయంలోనే కొద్ది ప్రాంతంలోనే జరుగుతుందని చైనీస్ ప్రభుత్వం ముందే ప్రకటించినట్టు జరిగవచ్చు.

ఎట్లాగైనా సోవియట్ యూనియన్ ఓడించబడ్డ అమెరికా చెప్పుల్లో కాళ్ళుదూర్చాలనీ, ఇండో-చైనా ప్రాంతంలో ఒక ప్రబలమైన శక్తిగా రూపొందాలనీ ప్రయత్నిస్తున్నది. ఈ ప్రయత్నాలు ఇప్పటి వరకూ సఫలమయినాయి కూడా. కంపూచియాపై, వియత్నాం దురాక్రమణ; వియత్నాం దురాక్రమణదారులకు వ్యతిరేకంగా సాగుతున్న ...త్వంలోనే ప్రజాశక్తిని సమీకరించుకోగల కంపూచియా ప్రజల ప్రతిఘటనా పోరాటం; ఫలితంగా వచ్చే వియత్నాం దళాల ఉనికిపై, వియత్నాం కీలుబొమ్మ ప్రభుత్వంపై లావోస్ ప్రజల తిరుగుబాటు; చైనా వియత్నాం మధ్య తీవ్రతరమయ్యే శత్రుత్వ సంబంధాలు (అమెరికా వ్యతిరేక పోరాట సమయంలో దంతాలు పెదవుల్లాగా తాము విడదీయబడరాని వాళ్ళమని ఈ దేశాలు చెప్పుకున్నాయి.) యివన్నీ సోవియట్ రష్యా ప్రయత్నాల అనివార్యమైన పర్యవసానాలుగా మనం అంగీకరించక తప్పదు.

(ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ 1979 మార్చి 3 సంచిక నుంచి)

ఉద్యమం

నిప్పుమీది
నివురు ఊది
రగిల్చకపోతే
మిగిలేది........? — బూడిద

పేదలంతా
పెనుమంటలై....
దోపిడీని కాల్చకపోతే
రాజ్యమేలేది........? — పీడన

— బి. పాండురంగారెడ్డి

SRJANA Telugu Monthly April 79 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

సృజనవద్ద దొరికే పుస్తకాలు

విరసం ప్రచురణలు :

1.	కథ, నవల – జీవితం – సాహిత్య పాఠశాల ప్రసంగ వ్యాసాలు	0-40
2.	తెలంగాణా పోరాట పాటలు	4-00
3.	ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు – ప్రసంగవ్యాసం	0-30
4.	అభ్యుదయ రచయితల సంఘానికి కాయకల్ప చికిత్స – వ్యాసం	1-25
5.	పోరాటాల శ్రీరాములు – రచనల సంకలనం	0-75
6.	పోరాట పాటలు	2-00

సృజన ప్రచురణలు :

7.	భూమి భాగోతం – నృత్య నాటకం	1-00
8.	చెల్లీ చెంద్రమ్మ – ఒగ్గు కథ	0-40
9.	సాంస్కృతిక దళాల నిర్మాణం – ప్రచార కార్యక్రమం	0-15
10.	కరీంనగర్ పోరాట పాటలు – 2	0-30

ఇతర ప్రచురణలు :

11,	తెలంగాణా వీరయోధులు – బుర్రకథ	0-60
12.	కరపత్రాల దుమారం – తెరవెనుక భాగోతం	3-00
13.	మాపల్లె – నవల	4-00
14.	ప్రజల మనిషి – ఒక పరిచయం	3-00
15.	స్వేచ్ఛ – కవితలు	2-50
16.	జనసం – కవితలు	2-50
17.	కవిత్వం చైతన్యం – వ్యాసాలు	3-00
18.	మావో రచనలు	15-00
19.	గమ్యం – కవితలు	2-00

పై పుస్తకాలన్నింటికీ ముందే ఎంఓ చేయాలి– ఐదు కాపీలకు పైబడే ఆర్డర్లకు సృజన ప్రచురణలమీద 25%, విరసం ప్రచురణలమీద 20%, ఇతర ప్రచురణలమీద 15% కమీషన్ యివ్వబడుతుంది.

మేనేజర్,
సృజన, హనుమకొండ 506 001

ఐదవ పేజీలో ప్రకటించబడ్డట్లు కరీంనగర్ పోరాట పాటలు మొదటిభాగం లేవు–

SRJANA Rs. 1-50
Hanamkonda, Warangal 506001